అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 29-07-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 160 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు వెల: 6.50

బ్రాంజ్ భాకర్

మను భాకర్‌కు కాంస్య పతకం

పతక ఖాతా తెరిచిన టీమ్ ఇండియా

పారిస్ 2024 ఒలింపిక్స్



పుష్కర కాల నిరీక్షణకు తెరపడింది. 2012 ఒలింపిక్స్ తర్వాత షూటింగ్‌లో భారత్ తొలి పతకం సాధించింది. స్టార్ షూటర్ మను భాకర్ ఒలింపిక్స్‌లో పతక చరిత్ర సృష్టించింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో కాంస్య పతకం సాధించిన మను భాకర్.. ఒలింపిక్స్‌లో పతకం సాధించిన తొలి భారత షూటర్‌గా నిలిచింది.

వివరాలు 12లో

టోక్యో ఒలింపిక్స్ పీడకలకు మను భాకర్ ముగింపు పలికింది. పతక ఫేవరేట్‌గా టోక్యోకు వెళ్లిన మను భాకర్.. పిస్టల్‌లో సాంకేతిక లోపంతో సుమారు ఐదు నిమిషాల సమయం కోల్పోయింది. స్వల్ప తేడాతో మెడల్ రౌండ్‌కు దూరమైంది. పారిస్ ఒలింపిక్స్‌లో అర్హత రౌండ్ నుంచి అద్భుత ప్రదర్శన చేసిన మను భాకర్ కాంస్య పతకంతో ఒలింపిక్ క్రీడల రెండో రోజే భారత్ గర్వపడేలా చేసింది.



తెలంగాణ దార్శనికుడు

జైపాల్ రెడ్డి

ఎత్తుగడల్లో వైఫల్యం వల్లే 2014లో అధికారానికి దూరం

కల్వకుర్తికి 100 పడకల ఆస్పత్రి మంజూరు

ఆర్‌అండ్‌బీ రోడ్లకు రూ. 180 కోట్లు

హైదరాబాద్ నుంచి శ్రీశైలానికి నాలుగు లైన్‌ల రోడ్డు :

జైపాల్‌రెడ్డి ఐదో వర్ధంతి సభలో సీఎం రేవంత్‌రెడ్డి

కొట్ర చౌరస్తాలో కాంస్య విగ్రహావిష్కరణ

నవ తెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

రాజకీయ ఉద్దండులు, తెలంగాణ దార్శనికులు సూదిని జైపాల్ రెడ్డి ఈ ప్రాంత వాసి కావడం మనందరికీ గర్వకారణమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ బిల్లు వస్తుందో రాదో అన్న సందేహంలో యువత ఆత్మ బలిదానాలు చేసుకుంటుంటే పార్లమెంటులో బిల్లును ఆమోదింపజేసిన ఘనత జైపాల్ రెడ్డికి దక్కుతుందన్నారు. ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండల కేంద్రంలోని కొట్ర చౌరస్తాలో జైపాల్ రెడ్డి కాంస్య విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో సర్పంచులు మొదలుకొని ఎమ్మెల్యేల దాకా జైపాల్ రెడ్డి శిష్యులమేనని ఇప్పటికీ చెప్పుకుంటున్నారంటే అది ఆయన రాజకీయ విలువలకు ...11లో

ప్రతిపక్ష ఎంపీలకు బెదిరింపులు

కేంద్రమంత్రులపై చర్యలు తీసుకోండి :

స్పీకర్‌కు కాంగ్రెస్ ఉప నాయకులు గొగోయ్ లేఖ



న్యూఢిల్లీ : పార్లమెంట్ సాక్షిగా ప్రతిపక్ష ఎంపీలపై బెదిరింపులకు పాల్పడ్డ మంత్రులపై చర్యలు తీసుకోవాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సభలో కాంగ్రెస్ ఉప నాయకులు గౌరవ్ గొగోయ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్పీకర్‌కు లేఖ రాసారు. అలాగే, రోజు రోజుకు లోక్‌సభలో పార్లమెంటరీ ప్రవర్తనా ప్రమాణాలు ...3లో

వరదొచ్చిందంటే..

మునుగుతున్న నగరాలు



రుతుపవనాల సీజన్ వచ్చిందంటే చాలు...వాణిజ్య రాజధాని ముంబయి ప్రజలు భయంతో గజగజ వణికిపోతారు. 2005 జులై 26న వచ్చిపడిన వరదలు సుమారు వెయ్యి మంది ప్రాణాలను బలిగొన్నాయి. దాదాపు దేశంలోని ప్రధాన నగరాల న్నింటిది ఇదే సమస్య.మానవ తప్పిదమో, ప్రకృతి ప్రకోపమో... కారణమేదైనా అతలాకుతలమయ్యేది జనజీవనమే కదా. ఆ సమయంలో లక్షలాది మంది నిలువ నీడ కోల్పోయారు. జీవనోపాధి కరువై అల్లాడిపోయారు. ప్రకృతి విపత్తులకు ప్రధాన కారణం ఓ పద్ధతి అంటూ లేకుండా చేపడుతున్న పట్టణీకరణే. ప్రణాళికల రూపకల్పన మొదలుకొని వాటి అమలు వరకూ అన్నీ వైఫల్యాలే.

బీభత్సం సృష్టిస్తున్న జల ప్రళయాలు

ప్రణాళికాబద్ధంగా లేని పట్టణీకరణే ప్రధాన కారణం

ప్రజలకు శాపంగా మారిన పాలకుల ఉదాశీనత

ప్రకృతి వైపరీత్యాలపై కొరవడిన ముందుచూపు

న్యూఢిల్లీ : దేశ ఆర్థిక రాజధాని ముంబయి నగరాన్ని మరోసారి వరదలు ముంచెత్తాయి. 2005లో కురిసిన 900 మిల్లీమీటర్ల వర్షపాతం జన జీవనాన్ని స్తంభింపజేస్తే ఈ ఏడాది అందులో మూడో వంతు వర్షపాతం మాత్రమే నమోదైనప్పటికీ నగర జీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. పాఠశాలలు, కళాశాలలు మూతపడ్డాయి. వ్యాపార సంస్థల షట్టర్లు తెరుచుకోలేదు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ధైర్యసాహసాలు ప్రదర్శించి, ప్రాణాలకు తెగించి ప్రజలను కాపాడారు.

స్మార్ట్ సిటీలో సైన్యం సహాయం

ఒక్క ముంబయి మాత్రమే కాదు...దేశంలోని అర డజను నగరాలు నీటిలో మునిగి పోయాయి. ఒకప్పుడు స్మార్ట్ సిటీగా పేరొందిన పూనే ఇప్పుడు స్టార్టప్‌లకు కేంద్రంగా విలసిల్లుతోంది. అలాంటి నగరంలో వరద నీటిలో చిక్కుబడి పోయిన ప్రజలను కాపాడేందుకు సైన్యాన్ని పిలిపించాల్సి వచ్చింది. పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు ప్రవేశించింది. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో నీరు రోజులు తరబడి అలాగే నిలిచిపోయింది. విద్యుత్ సరఫరా ఆగిపోయింది.

2021లో కేవలం దక్షిణ భారతదేశంలోనే ఐదు రాష్ట్రాలలోని 30కి పైగా నగరాలను వరదలు ముంచెత్తాయి. ప్రభుత్వాల మొద్దు నిద్ర, ఉదాశీనత కారణంగా ప్రజలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. ఈ వర్షాకాలంలో కూడా డజనుకు పైగా నగరాలు వరద తాకిడికి గురయ్యాయి. నీటి కొరతతో విలవిలలాడిన బెంగుళూరు, ఎండలతో మండిపోయిన ఢిల్లీ నగరాల్లో ఆ తర్వాత కొద్ది రోజులకే భారీగా వానలు పడి వరదలు సంభవించాయి. రాజధాని నగరంలో ...3లో



మోడీ విజన్ ఏమైంది?

2014 జులైలో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తన తొలి బడ్జెట్ ప్రసంగంలో వరదల సమస్యను ప్రస్తావించారు. వలస వస్తున్న ప్రజల తాకిడిని తట్టుకోవాలంటే కొత్త నగరాలను నిర్మించాల్సి ఉంటుందని, లేని పక్షంలో ప్రస్తుత నగరాలలో నివసించలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆయన చెప్పారు. దేశంలోని వంద స్మార్ట్ సిటీలను అతి పెద్ద నగరాలుగా శాటిలైట్ పట్టణాలుగా అభివృద్ధి చేయాలని, ప్రస్తుతం ఓ మాదిరి పరిమాణం కలిగిన నగరాలను ఆధునీకరించాలని ప్రధాని విజన్‌తో ఉన్నారని చెప్పుకొచ్చారు. నేటికి పది సంవత్సరాలు గడిచాయి. నగరాలు మాత్రం ప్రజలు ...3లో

ఉన్నత చదువులకోసం వెళ్లి..

తెలంగాణ విద్యార్థిని సహా ముగ్గురు మృతి



ఫైల్

కోచింగ్ సెంటర్‌లోకి వరద..

నీటిలో చిక్కుకుని మరణం..

ఘటనపై తక్షణ చర్యలు తీసుకోవాలి:ఎస్ఎఫ్ఐ నేతలు, సీపీఐ(ఎం) ఎంపీల డిమాండ్

కోచింగ్ సెంటర్ యజమాని అరెస్టు



న్యూఢిల్లీ : ఉన్నత చదువుల కోసం దేశరాజధానికి వెళ్లి...అక్కడ కురుస్తున్న వర్షాలు ముగ్గురి ప్రాణాలను తీశాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న.. కోచింగ్ సెంటర్‌లోకి అమాంతంగా వరద నీరు ప్రవేశించింది. ఏం జరుగుతుందో తెలుసుకునే లోపు నీట మునిగారు. ఈ ప్రమాదం లో ముగ్గురు విద్యార్థులు చనిపోయారు. వీరిలో తెలంగాణకు చెందిన విద్యార్థిని ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఓల్డ్ రాజేందర్ నగర్‌లోని రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లోకి శనివారం రాత్రి భారీగా వరద నీరు ప్రవేశించింది. ఈ సమాచారంతో అక్కడకు చేరుకున్న పోలీసు, అగ్ని మాపక సిబ్బంది సహాయక చర్యలు ప్రారంభించారు. ఈ క్రమంలోనే ముగ్గురు విద్యార్థుల మృతదేహాలను గుర్తించి, వెలికి తీశారు. మృతులను తెలంగాణకు చెందిన తాన్యా సోని, కేరళలోని ఎర్నాకులంకు చెందిన నవీన్ డాల్విన్, ఉత్తరప్రదేశ్‌లోని అంబేద్కర్ నగర్‌కు చెందిన శ్రేయాయాదవ్‌లుగా గుర్తించారు. ఈ దారుణ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ప్రతిపక్ష నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.కోచింగ్ సెంటర్ ఎదుట విద్యార్థులు ఆదివారం ఆందోళన నిర్వహించారు. విద్యార్థులు ...2లో



జూరాలకు భారీగా వరద

11లో..

41 గేట్లు ఎత్తివేత.. శ్రీశైలంకు నీరు విడుదల

కమిషన్ల కక్కుర్తి వల్లే మేడిగడ్డ కుంగింది

ఉత్తర తెలంగాణకు నీళ్లు రాకుంటే మాజీ సీఎం కేసీఆరే కారణం



కేటీఆర్‌వి పిచ్చి మాటలు

ఆధారాలు ఉంటే ఘోష్ విచారణ కమిషన్‌కు ఇవ్వండి :


నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మేడిగడ్డ బరాజ్ కుంగింది కేసీఆర్ సర్కారు కమిషన్ల కక్కుర్తి వల్లే అని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆయన తెలిసీ తెలియని రీ డిజైనింగ్, రీ ఇంజినీరింగ్ వల్లే ఇంతటి అనర్థం జరిగిందనీ, వేలకోట్ల సొమ్ము నీళ్లపాలయ్యిందని ...11లో

సింగరేణి ప్రయివేటీకరణపై

సీపీఐ(ఎం) సమరభేరి



బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలి

ప్రయివేటీకరణ కోసమే అగ్రాస్

నేటి నుంచి వచ్చే నెల ఐదు వరకు

సింగరేణి పరిరక్షణ బస్సు యాత్ర'

బెల్లంపల్లిలో ప్రారంభించనున్న

తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణతో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య

సింగరేణిలో సీపీఐ(ఎం) పోరు సైరన్ మోగించింది. బొగ్గుబ్లాకులను అగ్రాస్ వేయటం ప్రయివేటీకరించేందుకేనని మోడీ ప్రభుత్వంపై ఆ పార్టీ మండిపడుతోంది. బొగ్గు బ్లాకులను నేరుగా సింగరేణికే కేటాయించాలని నినదిస్తున్నది. వేలం పాటలను ఆపాలని కార్మికుల తరపున డిమాండ్ చేస్తున్నది. సింగరేణి మనుగడను ప్రశ్నార్థకం చేస్తే సహించబోమని హెచ్చరిస్తున్నది. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు, కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి మౌనంగా ఉండటంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నది. ప్రయివేటీకరణ ముసుగును వారు తొలగించుకోవాలని కోరుతున్నది. ఈ నేపథ్యంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వీరయ్యతో పాటు రాష్ట్ర నాయకులు భూపాల్, పి ఆశయ్య నేతృత్వంలో నేటి నుంచి 'సింగరేణి పరిరక్షణ బస్సు యాత్ర'కు శ్రీకారం చుట్టారు. సోమవారం నుంచి ప్రారంభమైన ఈ యాత్రను సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రారంభిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ వీరయ్యతో నవతెలంగాణ బ్యూరో రిపోర్టర్ ఎస్ వెంకన్న ముఖాముఖిలో యాత్ర వివరాలను వెల్లడించారు.

ముఖాముఖి

మీ యాత్ర ప్రధాన ఫోకస్ ఏమిటి?

సింగరేణి ప్రభుత్వ రంగ సంస్థ. ఇది లాభాలతో నడుస్తున్నది. ఈ సంస్థ ఆ ప్రాంత ప్రజల ఆర్థికాభివృద్ధితో పాటు కొనుగోలు శక్తి పెంచేందుకు ఉపయుక్తంగా ఉంది. విద్య, సాంస్కృతిక అభివృద్ధికి దోహదపడుతోంది. ఇంత ప్రాముఖ్యత కలిగిన సంస్థను వేలం పాటల ద్వారా ప్రయివేటీకరించటం తగదు. ప్రయివేటీకరణ వల్ల ఆ సంస్థ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతున్నది. వాస్తవంగా సింగరేణి ద్వారా బొగ్గు తవ్వకం జరిపితే.. ఉత్పత్తి చౌకగా ఉంటుంది. విద్యుత్ ఉత్పత్తి కూడా చౌకగానే వస్తున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అదనపు ఆదాయం సమకూరుతుంది. కార్మికుల, ప్రజల ప్రాధాన్యాలను పక్కన పెట్టి, బొగ్గు బ్లాకులను వేలం వేయటం ఎందుకు? అంటే.. కార్పొరేట్లతో ...3లో

బోనమెత్తిన భాగ్యనగరం



వైభవంగా లాల్ దర్వాజా బోనాలు

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

వివరాలు 2లో

సంక్షామ హాస్టళ్లు

పెరగని మెస్, కాస్మోటిక్ చార్జీలు .. అర్థాకలి..అరకొర వసతులు

- నాలుగు నెల్ల బిల్లులు పెండింగ్
- మెస్ చార్జీలు పెంచకపోతే ఉద్యమం : కేవీపీఎస్



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సంక్షేమ హాస్టళ్లు కాస్త క్షామ హాస్టళ్లగా మారాయి. పెరుగుతున్న ధరలకనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెరగకపోవడంతో విద్యార్థులు అర్ధాకలి.. అరకొర సదుపాయాలతో కాలమెల్లదీస్తున్నారు. అద్దె భవనాల్లో మగ్గడం, రక్షిత మంచినీళ్లు కూడా లేక వస్తులతో అలమటిస్తున్నారు. దుస్తులు, దుప్పట్లివ్వకపోయినా పర్వాలేదు. కానీ.. కనీసం కడుపునిండా తిండి పెట్టని పరిస్థితి ఉంటే ఎలా..? పెరిగే ధరలకు.. ప్రభుత్వమిస్తున్న మెస్ ఛార్జీలకు పొంతనలేదు. ప్రభుత్వమిచ్చే బియ్యం మినహాయిస్తే.. కూరగాయలు, పాలు, గుడ్లు, చికెన్, మటన్, గ్యాస్, స్నాక్స్, టిఫిన్, నిత్యవసర సరుకుల ధరలు అకాశాన్నంటాయి. సర్కారిచ్చే పైసలు దేనికీ సరిపోకపోవడంతో నాసిరకం సరుకులతో మమా ...11లో

రాబందులు తగ్గాయ్

మనుషుల మరణాలు పెరిగాయ్

ఐదేండ్లలో 5 లక్షల మంది మృతి

2000-2005 మధ్య

పర్యావరణానికి రూ.58వేల కోట్లకు పైగా నష్టం : నివేదిక

11లో..



మను భాకర్‌కు కిషన్‌రెడ్డి శుభాకాంక్షలు

- ఒలింపిక్స్‌లో పతకం సాధించడం పట్ల హర్షం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్యారిస్ ఒలింపిక్స్‌లో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో మనుభాకర్ కాంస్యపతకం సాధించటం పట్ల కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. షూటింగ్‌లో మెడల్ సాధించిన తొలి భారత మహిళగా రికార్డు సాధించడం ఎంతో ప్రత్యేకమనీ, దేశానికే గర్వకారణమని తెలిపారు.

ఉన్నత చదువుల కోసం వెళ్లి..

(మొదటి పేజీ తరువాయి)

మరణించిన గదిని నిర్వాహకులు ప్లాన్‌లో స్టోర్ రూమ్‌గా పేర్కొన్నా, ఆ గదిని లైబ్రరీగా ఉపయోగిస్తున్నట్టు ఢిల్లీ మున్సిపల్ అధికారులు గుర్తించారు. వరదల సమయంలో ఈ గదిలో సుమారు 20 మంది విద్యార్థులు ఉన్నట్టు అధికారులు చెప్పారు. ఈ ఘటనతో నగరంలో మిగిలిన కోచింగ్ సెంటర్లలో కూడా తనిఖీలు ప్రారంభించారు. ఈ ఘటన పై దర్యాప్తు చేయడానికి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామని అధికారులు ఆదివారం వెల్లడించారు. ఢిల్లీ మేయర్ షెల్లీ ఒబెరాయ్ మాటాడుతూ కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్‌లో అక్రమంగా లైబ్రరీ నిర్వహిస్తున్నారని తెలిపారు. బేస్‌మెంట్‌లో లైబ్రరీ లేదా ఎలాంటి ఏ ఇతర వాణిజ్య కార్యకలాపాలకు అనుమతి లేదని చెప్పారు. మూడు అంతస్తుల కోచింగ్ సెంటర్, దాని బిల్డింగ్ ప్లాన్‌కు 2021లో అనుమతిచ్చినట్లు తెలిపారు. సహాయక కార్యక్రమాలకు అనేక ఇబ్బందులు ఎదురైనట్లు అధికారులు వివరించారు. ఆదివారం సాయంత్రం ఈ ప్రమాదం గురించి తమకు స్థానిక మేజిస్ట్రేట్ నుంచి కాల్ వచ్చినట్లు ఢిల్లీ అగ్నిమాపక అధికారి అతుల్ గార్గ్ తెలిపారు. ఇది అగ్ని ప్రమాదానికి సంబంధించిన సంఘటన కాకపోయినా, మానవతా దృక్పథంతో ఐదు ఫైర్ ఇంజిన్లతో అక్కడకు చేరుకున్నామని తెలిపారు. బేస్‌మెంట్ నుంచి నీటిని బయటకు పంపడమే పెద్ద సవాల్‌గా నిలిచిందని అన్నారు. మా యంత్రాలతో నీటిని బయటకు పంపుతున్నా వర్షాల కారణంగా రోడ్లపై కూడా నీరు ఉండటంతో పంపించిన నీరు మళ్లీ లోపలకి వస్తోందని చెప్పారు.

ఎఫ్ఐఆర్ నమోదు

ఈ ప్రమాదంపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. విచారణ కోసం పలు బృందాలను ఏర్పాటు చేశారు. ఆదివారం కోచింగ్ సెంటర్ యజమాని, కోఆర్డినేటర్‌ను ఢిల్లీ పోలీసులు చేశారు. వీరిపై హత్యానేరం కింద కేసు నమోదు చేశారు. రాజేందర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో సెక్షన్లు 105, 106(1), 115(2) కింద ఈ కేసు నమోదైంది.

దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల ఆందోళన

ప్రమాదానికి కోచింగ్ సెంటర్ యాజమాన్యం బాధ్యత వహించాలని, భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు కోచింగ్ సెంటర్ ఎదుట భారీ ఎత్తున ఆందోళన నిర్వహించారు. యాజమాన్యం, అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని విమర్శించారు. ముఖర్జీనగర్, పటేల్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని చెప్పారు. గతవారం పటేల్ నగర్‌లో రోడ్డుపై వర్షపు నీటి వల్ల విద్యుత్ షాక్‌కు గురై ఒక విద్యార్థి మరణించిన విషయాన్ని గుర్తు చేశారు. ఢిల్లీలోని కోచింగ్ సెంటర్లలో ఎలాంటి భద్రతా ఏర్పాట్లు లేవని విమర్శించారు.

ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకో వాలని, బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. విద్యార్థులను పోలీసులు చెదరగొట్టారు. పలువురిని అదుపులోకి తీసుకుని, బస్సులో తరలించారు. ఈ ఘటనను నిరసిస్తూ కరోల్‌బాగ్ మెట్రో స్టేషన్ వద్ద ఆందోళన చేసిన విద్యార్థులను కూడా పోలీసులు అరెస్టు చేశారు.

ఘటనపై తక్షణ చర్యలు తీసుకోవాలి
ఎస్ఎఫ్ఐ, నేతలు సీపీఐ(ఎం) ఎంపీలు డిమాండ్

ఢిల్లీలో స్టడీ సర్కిల్ ఘటనపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, నేతలు సీపీఐ(ఎం) ఎంపీలు డిమాండ్ చేశారు. ముగ్గురు యూపీఎస్సీ ఆశావహుల విషాద మరణంపై వారు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. రాజ్యసభ ఎంపీ వి.శివదాసన్, లోక్‌సభ ఎంపీ కె.రాధాకృష్ణన్ తో పాటు ఎస్ఎఫ్ఐ ఆలిండియా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి విపి సాను, మయూక్ బిశ్వాస్, నితీష్ నారాయణన్ (ఉపాధ్యక్షుడు), ఐసీ ఘోష్ (కేంద్ర కార్యవర్గ సభ్యులు)తో కూడిన ప్రతినిధి బృందం ఆందోళన చేస్తున్న విద్యార్థులతో సమా వేశమైంది. అలాగే విద్యార్థుల మృతదేహాలను పెట్టిన ఆర్ఎంఎల్ ఆస్పత్రిని సందర్శించారు. అక్కడ ఉన్న విద్యార్థులతో, బంధువులతో మాట్లాడారు. పరీక్షల కేంద్రీకరణ కారణంగా అత్యాశతో కూడిన కోచింగ్ వ్యాపారంలో ప్రాణాలు కోల్పోయిన ముగ్గురు అమాయక విద్యార్థులని పేర్కొన్నారు. అధి కారులు, ప్రయివేట్ సంస్థల నిర్లక్ష్య వైఖరిని మరోసారి ప్రదర్శిస్తూ, ఈ ఇన్స్టిట్యూట్ బేస్‌మెంట్ లైబ్రరీలో ఇరుక్కుని ముగ్గురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. భారీ వర్షాల తరువాత అదే ప్రాంతంలో మరో విద్యార్థి విద్యుదాఘాతానికి గురైన కొద్ది రోజులకే ఈ ఘటన చోటు చేసు కుందని అన్నారు. జేఎన్‌యూలో పీహెచ్‌డీ చదువుతున్న కేరళకు చెందిన ఓ విద్యార్థి కూడా ఈ ఘటనతో మరణిం చారు.



విద్యారంగానికి జరిగిన తీరని నష్టం గురించి ఎస్ఎఫ్ఐ పదేపదే ప్రభుత్వాన్ని హెచ్చరిం చిందని, ఈ షాకింగ్ ఘటనకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని నేతలు డిమాండ్ చేశారు. త్వరితగతిన విచారణ జరిపి ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

పేదలకు 'ప్రయివేట్' విద్య అందేనా..?

- 25 శాతం సీట్లు ఉత్తమాటేనా..?
- అధ్యయనం పూర్తయి పదేండ్లు గడిచినా ఫలితం శూన్యం
- విద్యాహక్కు చట్టంతో వేలాది మంది పేద విద్యార్థులకు లబ్ధి



నవతెలంగాణ-సిటీబ్యూరో

పేద విద్యార్థులకు ప్రయివేటు స్కూళ్లలో 25 శాతం సీట్ల కేటాయింపు, ప్రభుత్వమే ఖర్చులు భరించి, ఉచితంగా చదువు చెప్పించాలనే నిర్ణయం మళ్లీ తెరపైకి వచ్చింది. ఇటీవల ఘట్‌కేసర్‌కు చెందిన ఓ విద్యార్థి తండ్రి తన పిల్లలకు ప్రయివేటు స్కూల్‌లో విద్యా హక్కు చట్టం ప్రకారం 25శాతం ఉచిత విద్యనందించడం లేదని కోర్టులో కేసు దాఖలు చేశారు. దాంతో సుప్రీంకోర్టు తెలంగాణలో విద్యాహక్కు చట్టం అమలు చేయకపోవడం, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయకపోవడం వంటి విషయాలపై సమాధానం ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో టీచర్ పోస్టుల భర్తీ, విద్యాహక్కు చట్టం అమలు మళ్లీ తెరపైకి వచ్చింది.

2 వేలకు పైగా ప్రయివేటు స్కూళ్లు..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 2,050 ప్రయివేటు స్కూళ్లు ఉన్నాయి. వీటిలో సుమారు 6.30 లక్షలకు పైగా విద్యార్థులున్నారు. ఆయా విద్యాసంస్థల్లో విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లు కేటాయిస్తే జిల్లాలో 1.50లక్షలకు పైగా విద్యార్థులకు ఉచితంగా ప్రయివేటు చదువులు చెప్పాలి. అయితే, ఒకటో తరగతిలో చేరే విద్యార్థులకే చట్టం వర్తిస్తుందని విద్యాశాఖకు చెందిన కొందరు పేర్కొంటున్నారు. మధ్యలో చేరే వారికి ప్రయివేటు చదువులు చెప్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదనేది పలువురి వాదన. ఫలితంగా విద్యాశాఖ హక్కు చట్టం అమలైతే దాదాపు లక్ష మంది వరకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం కూడా ఉంది. సర్కారు బడుల్లో చదివే విద్యార్థులు ప్రయివేటు బడులకు వెళితే.. ఎలా..? అని ప్రభుత్వం ఈ చట్టం అమలుకు వెనకడుగు వేసిందని గతంలో విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు.

2012లోనే నివేదిక రెడీ..

విద్యాహక్కు చట్టంలో భాగంగా ప్రయివేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాలని పదేండ్ల క్రితమే సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. కానీ, ఇంతవరకు అమలుకు నోచుకోలేదు. ప్రభుత్వం 8 మందితో నియమించిన కమిటీ సీట్ల కేటాయింపుపై అధ్యయనం చేసి, 2012 మే నెలలోనే ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. దానిపై గత ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దాంతో వేలాది మంది పేద విద్యార్థులు ప్రయివేటు చదువులకు దూరమయ్యారు. ఫీజుల భారంతో మిన్నకున్న సర్కారు సీట్ల కేటాయింపునకు ప్రయివేటు యాజమాన్యాలు విముఖంగా ఉన్నట్టు సమాచారం.

ఒకవేళ పేద పిల్లలకు సీట్లు కేటాయించినా ఒలింపియాడ్, కాన్సెప్ట్, టెక్నో, ఇంటర్నేషనల్, ఈ-టెక్నో స్కూళ్ల పేరిట వసూలు చేస్తున్న వేలాది రూపాయల ఫీజులను ప్రభుత్వం చెల్లించలేని పరిస్థితి. అందుకే గతంలో పలు విద్యాసంస్థల యాజమాన్యాలు కోర్టును ఆశ్రయించాయి. కమిటీ అధ్యయనం తర్వాత చాలా వరకు యాజమాన్యాలు కొంతమేర అంగీకారం తెలిపాయి. కానీ, కమిటీ ప్రభుత్వంపై ఏటా పడే ఫీజుల భారాన్ని కూడా నివేదికలో పేర్కొనడంతో సర్కారు మిన్నకుండిపోయింది.

విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి



జిల్లాలో విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. ఈ చట్టం ప్రకారం జిల్లాలోని ప్రయివేటు స్కూళ్లలో పేద విద్యార్థులకు 25శాతం ఉచిత విద్యనందించాలి. 'ప్రతి పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజు చెల్లించే విధంగా ఫీజు నియంత్రణ చట్టం అమలు చేస్తాం' అని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మాట నిలబెట్టుకోవాలి. విద్యా హక్కు చట్టం అమలు కాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులే స్వయంగా కోర్టు మెట్లు ఎక్కడం సిగ్గుచేటు. అలాగే బుక్స్, యూనిఫామ్, టై, బెల్ట్, ఫీజుల పేరిట కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు రూ.లక్షలు దోపిడీ చేస్తున్నా.. విద్యాధికారులు చూసీ చూడనట్టు వ్యవహరించడం సరికాదు. ప్రభుత్వమే కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యనందిస్తుందని ఒకవైపు చెబుతూనే, మరోవైపు ప్రయివేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామంటుండటం విద్యాహక్కు చట్టం అమలుపై గందరగోళానికి కారణమవుతోంది. సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్నాకైనా ప్రయివేటు విద్యాసంస్థల్లో పేద విద్యార్థులు చదివేందుకు అవకాశం లభిస్తుందో లేదో వేచి చూడాలి.

- రాథోడ్ సంతోష్, ఎస్ఎఫ్ఐ మేడ్చల్
-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి

లక్ష్యం మంచిదే.. ఆచరణేది?

కలెక్టర్ల సదస్సుకు బయట నుంచి స్నాక్స్

- మిగతా సమావేశాల్లోనూ అదే తీరు
- తెరపైకి ఆ క్యాంటీన్ల నుంచే భోజనం, స్నాక్స్ తెప్పించేలా ఉత్తర్వులివ్వాలనే డిమాండ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'రాష్ట్రంలో మహిళలను కోటీశ్వరులను చేయాలనే సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పంతో వేసిన తొలి అడుగే మహిళా శక్తి క్యాంటీన్లు' అని రాష్ట్ర సర్కారు అట్టహాసంగా ప్రకటించింది. రాష్ట్రంలో రెండేండ్లలో 151 మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామనీ, త్వరలో జిల్లాల్లో ఏర్పాటు చేస్తామని మంత్రి సీతక్క స్వయంగా చెప్పారు. ప్రతి ఇంటి అమ్మచేతి వంటలా మహిళా శక్తి క్యాంటీన్లు నిలవాలని ఆకాంక్షించారు. అందులో పనిచేసే మహిళా సంఘాల సభ్యులకు గచ్చిబౌలిలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ సంస్థలో శిక్షణ కూడా ఇప్పిస్తున్నారు. ప్రయోగాత్మకంగా మొదట హైదరా బాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ప్రారంభించారు. సచివాలయానికి పనుల నిమిత్తం జిల్లాల నుంచి వచ్చే ప్రజలు ఈ క్యాంటీన్లను కొంత మేరకు వాడుకుంటున్నారు. అక్కడ మహిళా సభ్యులు చేసే పిండి వంటకాలు, ఇతర స్నాక్స్‌ను తిని రుచికరంగా ఉంటున్నాయని నిర్వాహకులను ప్రశంసిస్తున్నారు. ఇంత వరకూ బాగానే ఉంది. మహిళలను కోటీశ్వరులను చేయాలనే సర్కారు బృహత్తర లక్ష్యానికి ప్రభుత్వ అధికారులే ఆచరణలో పెట్టడం లేదనే విమర్శలొస్తున్నాయి. ఒక్క పంచాయతీ రాజ్ శాఖ నిర్వహించే సమీక్షలు, సమావేశాలకే మహిళా శక్తి క్యాంటీన్ల నుంచి స్నాక్స్ తెప్పిస్తున్నట్టు తెలిసింది. మిగతా శాఖల సమావేశాలన్నింటికీ బయట నుంచే భోజనాలు, స్నాక్స్ తెప్పిస్తున్నారనే విమర్శ ఉంది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కలెక్టర్ల సమావేశం రాష్ట్ర సచివాలయంలో జరగ్గా...స్నాక్స్‌ను అధికారులు బయట హోటళ్ల నుంచి తెప్పించారు. వాటికి బిల్లులనూ పెట్టారు. బయట నుంచి తెచ్చిన ఆహారపదార్థాలను తిన్న కలెక్టర్లు, ఇతర అధికారుల్లో కొందరు అస్వస్థతకు గురైనట్టు కూడా తెలిసింది. సచివాలయంలోనే మహిళా సంఘాల సభ్యుల నేతృత్వంలో నడుస్తున్న మహిళా శక్తి క్యాంటీన్ నుంచి కాకుండా స్నాక్స్, టీలు, ఇతర ఆహార పదార్థాలను బయట నుంచి ఎందుకు తెప్పించారనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన కార్యక్రమాలకు సంబంధించిన ఆర్డర్లనే ఆ క్యాంటీన్లకు ఇవ్వకుంటే బయట నుంచి వచ్చే వారు ఎలా ఆదరిస్తారనే చర్చ మొదలైంది.

సచివాలయ మహిళా శక్తి క్యాంటీన్లకు దక్కని ఆర్డర్లు

క్యాంటీన్ల ప్రారంభ సమయంలో మహిళాసంఘాల సభ్యులు తయారు చేసిన పిండి వంటల రుచులు బాగున్నాయని చెప్పిన సీతక్క మాటలను అధికారులు ఎందుకు పెడచెవిన పెడుతున్నారో అర్థం కావడం లేదు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల ఆర్డర్లను బయటకు ఇస్తున్నారనే విషయం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి వెళ్లిందో? లేదో? అనేది కూడా తెలియదు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి సచివాలయంలో ఏ కార్యక్రమం జరిగినా మహిళా శక్తి క్యాంటీన్ల నుంచే ఆహారపదార్థాలు, టీలు, స్నాక్స్ తెప్పించాలనీ, అవసరమైతే వారితో భోజనాలు తయారు చేయించేలా అధికారికంగా ఉత్తర్వులు జారీ చేయాలనే డిమాండ్ వస్తున్నది. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుందనీ, మహిళలు స్వయం చోదితంగా తమ కాళ్లపై తామే ఆర్థికంగా ఎదిగేలా దోహదపడేలా విధానపరమైన నిర్ణయం తీసుకుంటుందని ఆశిద్దాం.

సీఎం చెప్పినవన్నీ అబద్ధాలే

- విద్యుత్ సంస్థల ప్రయివేటీకరణకు కుట్ర : మాజీమంత్రి జగదీష్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వ్యవసాయ మోటర్లకు మీటర్ల గురించి సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చెప్పినవన్నీ అబద్ధాలేనని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించాలని, కేంద్రం ఒత్తిళ్లకు గురిచేసినా రాష్ట్రంలో మోటర్లకు మీటర్లు పెట్టబోమని కరాఖండిగా తేల్చిచెప్పామన్నారు. ఎఫ్ఆర్‌బీఎం పరిమితులను సడలిస్తామని చెప్పినా తాము ఒప్పుకోలేదన్నారు. తెలంగాణ రైతుల ప్రయోజనాల కోసం రూ.30 కోట్ల రుణాన్ని సైతం వదులుకున్నామని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి కావాలనే కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ గెలిస్తే మోటర్లకు మీటర్లు పెడతారనే మాట నేడు నిజం కాబోతుందన్నారు. విద్యుత్ సంస్థలను గంపగుత్తగా ప్రయివేట్ కంపెనీలకు అప్పగించేందుకు రేవంత్ సర్కార్ సిద్ధమైందని ఆరోపించారు. ఈ సమావేశంలో మాజీ హోంమంత్రి మహమూద్‌అలీ, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యమాలతో ప్రజలు చైతన్యం

- అర్ఫా ఖనూమ్ షెర్వానీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజా ఉద్యమాలు దేశాన్ని ఫాసిజ ప్రమాదం నుంచి కాపాడాయని ది వైర్ పత్రిక సీనియర్ ఎడిటర్ అర్ఫా ఖనూమ్ షెర్వానీ తెలిపారు. తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ప్రొఫెసర్ జయశంకర్ 13వ స్మారక ఉపన్యాసమిచ్చారు. పార్లమెంటు ఎన్నికలకు ముందు, ఆ తర్వాత మార్పు వచ్చిందని చెప్పారు. పీఎంలైనా, సీఎంలైనా సరే ప్రజల తీర్పుకు తలొగ్గాల్సిందేనని, అటువంటి సందర్భాలను విశ్లేషించారు. హిందూ రాష్ట్ర స్థాపన ఎజెండాగా వచ్చిన బీజేపీకి మెజారిటీ ఇవ్వకుండా సెక్యులరిజం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామని తెలిపారు. ప్రజల్లో ఇంతటి చైతన్యం రావడానికి ప్రజా ఉద్యమాలు ప్రధాన కారణమని తెలిపారు. ఎన్ఆర్సీకి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంతో పాటు రైతు ఉద్యమం, స్వతంత్ర జర్నలిజం, రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర ఉన్నాయని తెలిపారు. నిరక్షరాస్యులు సైతం తాము ఆధిపత్య భావజాలాన్ని భరించేది లేదని స్పష్టం చేశారన్నారు. పదేండ్లపాటు ఆర్ఎస్ఎస్ చేసిన ప్రయత్నాలను తిప్పికొడుతూ ఉద్యమకారులు నిలబడ్డ ఫలితమిదని చెప్పారు. ఈ సమావేశంలో టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం, తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షులు అంబటి నాగయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిప్పర్తి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ 'ధూల్‌పేట్'

- గుడుంబా, గంజాయిపై నిరంతర నిఘా
- ఆగస్ట్ 31 నాటికి గంజాయి ఫ్రీ ప్రాంతమే లక్ష్యం
- పోలీసులతో కలిసి ఎక్సైజ్ శాఖ ప్రణాళిక



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ధూల్‌పేటంటే గుడుంబా, గంజాయితో పాటు నెంబర్‌టూ దందాలకు కేరాఫ్ అడ్రస్‌గా చెప్పుకున్న సందర్భాలనేకమున్నాయి. దూల్‌పేటను ఇతివృత్తంగా చేసుకుని తెలుగుతో పాటు అనేక భాషల్లో సినిమాలొచ్చాయి. గుడుంబా, గంజాయి అక్రమ రవాణాలో చిక్కుకుని స్థానిక యువకులు తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారనే కోణం కూడా ఉంది. దూల్‌పేట్‌ను సంస్కరిం చాలని గతంలో చేసిన అనేక ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ఈ క్రమంలో సర్కార్ ఆదేశాలతో గుడుంబా, గంజాయి రహిత ప్రాంతంగా మార్చేం దుకు పోలీసులతో కలిసి ఎక్సైజ్ శాఖ కసరత్తు చేస్తున్నది. నాటుసారా తయారీ, గంజాయి అమ్మకాలకు కార్ఖానాగా మారిన ధూల్ పేట్‌లో ఆగస్టు 31 నాటికి గంజాయి అమ్మకాలు, విని యోగం, లేకుండా చేయాలని ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలను పూర్తిగా అరికట్టాలనే ప్రభుత్వ నిర్ణయానికనుగుణంగా ఆబ్కారి శాఖ పోలీసులతో కలిసి చర్యలు చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు చేస్తోంది. ఈ క్రమంలో హైదరాబాద్ నడిబొడ్డున గల దూల్‌పేట్ సర్కార్‌కు సవాల్‌గా మారింది. ఇక్కడి యువతను ఈ అక్రమ వ్యాపారాల నుంచి బయటపడేసేందుకు గతంలో చేసిన ప్రయత్నాలేవి సఫలం కాలేదు. గట్టి నిఘా ఉంచినప్పుడు వెనక్కి తగ్గి తిరిగి అదే వ్యాపారాన్ని కొనసాగుస్తున్నారనే ఆరోపణ లున్నాయి. గంజాయి, నాటుసారా అక్రమ రవాణా, అమ్మకం వృత్తిగా ఎంచుకున్న వారిలో మార్పు తెచ్చేందుకు ఆబ్కారీ శాఖ చర్యలు చేపట్టింది. ఒకటి కంటే ఎక్కువ సార్లు తయారీ, రవాణా చేస్తూ దొరికిన వారిపై కేసులు, జరిమానాలతో పాటు కౌన్సిలింగ్ ఇస్తున్నారు. కుటుంబాలు విచ్ఛిన్నం కావడానికి కారణమైన మహమ్మారిని తరిమేయాలంటే దాడులు, శిక్షలు ఒక్కటే పరిష్కారం కావని ప్రభుత్వం భావిస్తోంది. గంజాయి, నాటుసారా వల్ల కలిగే నష్టాలను వివరించి వారిలో పరివర్తన తెచ్చేందుకు పోలీసులతో కలిసి చర్యలు చేపట్టింది.

పునరావాసంపై సమాలోచనలు?

2016లో అప్పటి బీఆర్ఎస్ సర్కార్ నాటు సారాను అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ వృత్తిపై జీవించే 6,885 మందిని గుర్తించి పునరావాసం కల్పించింది. 80 వేల సబ్సిడీతో రూ.లక్ష బ్యాంక్ లోన్ అందించింది. 2016 నుంచి 2018 వరకు జరిగిన ఈ ప్రాజెక్ట్ తర్వాత రాష్ట్రంలో నాటు సారాను పూర్తిగా అరికట్టామని అధికారులు ప్రకటించారు. ఆ తర్వాత దాని గురించి పట్టించుకోక పోవడంతో నాలుగేండ్లుగా చాప కింద నీరులా మళ్లీ విజృంభించింది. ఈ నేపథ్యంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పునరావాసం దిశగా చర్యలు చేపడితే ఎలా ఉంటుందనే అంశంపై సమాలోచనలు చేస్తోంది. ముందుగా దూల్‌పేట్‌ను పైలట్ ప్రాజెక్ట్‌గా చేసుకుని పునరావాస ప్రణాళికను అమలు చేయాలని బావిస్తున్నట్టు సమాచారం.

గంజాయి ఫ్రీ ప్రాంతంగా దూల్‌పేట
ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి

దూల్‌పేట్‌ను గంజాయి ఫ్రీ ప్రాంతంగా మార్చేందుకు చర్యలు చేపట్టాం. ఇందుకు సంబంధించి పోలీసులతో కలిసి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. దుల్‌పేట్‌లో తనిఖీలు ముమ్మరం చేశాం. గంజాయి ఎక్కడి నుంచి వస్తుంది? ఎలా వస్తుంది? తీసుకొస్తున్న వారెవరు? కొనుగోలుదారులెవ్వరు? తదితర విషయాలపై నిఘాపెట్టాం. ఇందుకోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా వినియోగించాలని నిర్ణయించాం. ఆగస్టు 31 వరకు దూల్‌పేట్‌లో గంజాయి, నాటు సారా కనిపించకుండా చేయాలని సంకల్పించాం.

బోనమెత్తిన భాగ్యనగరం

- అట్టహాసంగా లాల్ దర్వాజా బోనాలు
- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన డిప్యూటీ సీఎం దంపతులు
- బోనాలు, మొక్కులు చెల్లించుకున్న మహిళలు, భక్తులు
- ప్రముఖ దేవాలయాలకు పోటెత్తిన భక్తజనం
- నగరమంతటా సందడిగా బోనాల జాతర
- నేడు రంగం, అమ్మవారి ఘటాల ఊరేగింపు



నవతెలంగాణ-సిటీబ్యూరో /ధూల్ పేట్/ చాంద్రాయణగుట్ట

భాగ్యనగరం బోనమెత్తింది. ఆదివారం నగరవ్యాప్తంగా ఆషాడమాస బోనాల జాతర ఉత్సాహంగా సాగింది. పాతబస్తీలో లాల్ దర్వాజా సింహవాహిని శ్రీ మహంకాళి బోనాలతో పాటు భాగ్యలక్ష్మి అమ్మవారు, ఇతర ప్రముఖ దేవాలయాల్లో బోనాల జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం నుంచే అమ్మవార్ల దర్శనానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తి, శ్రద్ధలతో అమ్మవారికి మహిళలు, భక్తులు బోనం సమర్పించి.. మొక్కులు చెల్లించుకున్నారు. దాంతో భక్తజనంతో దేవాలయాలన్నీ కిటకిటలాడాయి. దేవాలయాల పరిసర ప్రాంతాలన్నీ జన సందోహంగా మారాయి. పోతురాజుల విన్యాసాలు, తొట్టెల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బోనాలు తీసుకువచ్చే మహిళల కోసం ఆలయ నిర్వాహకులు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు. భారీ స్థాయిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపింది. ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మెన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో పాతనగరంలో లాల్ దర్వాజా బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. లాల్ దర్వాజా సింహవాహిని శ్రీ మహంకాళి అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆయన సతీమణి మల్లు నందిని అమ్మవారికి బంగారు బోనం సమర్పించారు. ఆయన వెంట మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ ఉన్నారు.

డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. బోనాల పండుగ భూమి పుత్రులు జరుపుకునే పండుగని, అందుకని ఈ పండుగకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. నగరంలో బోనాల పండుగ విజయవంతం కోసం ప్రభుత్వం తరపున సకల సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం బోనాల ఉత్సవాల కోసం ప్రభుత్వం రూ.20 కోట్లు విడుదల చేసినట్టు చెప్పారు. హైదరాబాద్ నగరాభివృద్ధికి పటిష్టమైన పునాదులు వేయడానికి ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రూ.పది వేల కోట్లు కేటాయించామని తెలిపారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ.. గోల్కొండ బోనాలతో ప్రారంభమై, ఉజ్జయిని మహంకాళి బోనాలు, లాల్ దర్వాజా సింహవాహిని బోనాలు ఘనంగా జరుగుతున్నాయని, బోనాలు అంటే హైదరాబాద్ సంస్కృతి సంప్రదాయాలకు నిదర్శమన్నారు.

భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో సుభిక్షంగా ఉండాలి : మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కోరుకున్నారు. పాతబస్తీలో బోనాల సందర్భంగా చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రభుత్వం తరపున కుటుంబ సమేతంగా పట్టువస్త్రాలు సమర్పించారు. గతేడాది వర్షాల్లేక.. రైతులంతా ఇబ్బందిపడ్డారని, ఈసారి అమ్మవారి ఆశీస్సులతో సమృద్ధిగా వర్షాలు పడాలన్నారు. పాడి పంటలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, అఖిలపక్ష నిర్ణయానికి అనుగుణంగా పాత డిజైన్‌తో కొత్త ఉస్మానియా దవాఖాన నిర్మిస్తామన్నారు. మూసీనది ప్రక్షాళన చేస్తున్నామని తెలిపారు. పాతబస్తీ స్థితిగతులను మార్చేందుకు మెట్రోను విస్తరిస్తున్నామన్నారు. పోటీ చేసిన సగం సీట్లలో డిపాజిట్లు రానీ ఆ పార్టీ గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని బీఆర్ఎస్ పార్టీని ఉద్దేశించి అన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు..

లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారిని.. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు దర్శించుకున్నారు. మంత్రి కొండా సురేఖ, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అద్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, తీన్మార్ మల్లన్న, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు ఫిరోజ్ ఖాన్, రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు అచారి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్య వీరిలో ఉన్నారు. అలాగే చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి దేవాలయంతో పాటు పాతనగరంలోని ప్రముఖ దేవాలయాలను మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర్ రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి దర్శించుకొని.. అమ్మవార్లకు ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు.

నేడు రంగం, ఘటాల ఊరేగింపునకు ఏర్పాట్లు

బోనాల పండుగలో అత్యంత ప్రధాన ఘట్టమైన మాతేశ్వరి ఘటాల సామూహిక ఊరేగింపు సోమవారం జరగనుంది. సాయంత్రం నాలుగు గంటలకు హరిబౌలి అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయం వద్ద అంబారీపై మాతేశ్వరి ఊరేగింపును రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, నగర పోలీసు కమిషనర్ ప్రారంభించనున్నారు. దానిని అనుసరించి అన్ని ఆలయాల ఊరేగింపులు సాంస్కృతిక కార్యక్రమాలు, డప్పు, వాయిద్యాలతో నయాపూల్ ఢిల్లీ దర్వాజ వైపు సాగుతాయి. ప్రధాన ఊరేగింపు సాగే దారి పొడవున పెద్ద ఎత్తున విద్యుత్ దీపాలంకరణ చేపట్టారు. కాషాయ ధ్వజాలను ఏర్పాటు చేశారు. అడుగడుగున పోలీసు బందోబస్తు, నిఘా కెమెరాల నీడలో ఊరేగింపు సాగనుంది.



లెఫ్టినెంట్ గవర్నర్లకూ రాజ్యాంగ రక్షణ ?

- ఉంటుందని చెబుతున్న క్యాట్ .. విభేదిస్తున్న న్యాయ నిపుణులు
- ఆర్టికల్ 361 సమీక్షకు సుప్రీంకోర్టు అంగీకారం

శ్రీనగర్ : కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లకు కూడా రాజ్యాంగపరమైన రక్షణ లభిస్తుందా? ఇటీవల సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్) జారీ చేసిన ఆదేశాల నేపథ్యంలో ఈ ప్రశ్న ఉత్పన్నమవుతోంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 361 ప్రకారం లెఫ్టినెంట్ గవర్నర్లకు రక్షణ లభిస్తుందని క్యాట్ అభిప్రాయపడింది. రాజ్యాంగం ప్రకారం ప్రస్తుతం రాష్ట్రాల గవర్నర్లకు అందుబాటులో ఉన్న రక్షణ పరిధిని పరిశీలించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించిన సమయంలోనే క్యాట్ ఆదేశాలు వెలువడ్డాయి. అయితే లెఫ్టినెంట్ గవర్నరుకు అలాంటి రక్షణ ఏదీ ఉండదని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. జమ్మూకాశ్మీర్‌లో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారి అశోక్ పర్మర్ తన సర్వీసు వ్యవహారాలకు సంబంధించి దాఖలు చేసిన పిటిషన్‌ను ఈ నెల 16న ట్రిబ్యునల్ తోసిపుచ్చింది. పిటిషన్‌ను తోసిపుచ్చడానికి ట్రిబ్యునల్ చూసిన ప్రధాన కారణం...లెఫ్టినెంట్ గవర్నర్‌కు రాజ్యాంగంలోని 361వ అధికరణ కింద రక్షణ ఉంటుందని స్పష్టం చేయడం. అంతేకాదు...భవిష్యత్తులో ఇలాంటి పిటిషన్లు దాఖలు చేయకుండా పిటిషనర్‌కు లక్ష రూపాయల జరిమానా కూడా విధించింది.

సమీక్షకు సుప్రీం ఓకే

గవర్నర్లపై ఏ విధమైన క్రిమినల్ చర్యలు చేపట్టకుండా వారికి రాజ్యాంగపరంగా రక్షణ కల్పిస్తున్న ఆర్టికల్ 361ని సమీక్షించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ తనను వేధిస్తున్నారంటూ రాజ్‌భవన్‌లోని మహిళా ఉద్యోగి ఒకరు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఆ అధికరణను సమీక్షించేందుకు అంగీకరించింది.

రాజ్యాంగం ఏం చెబుతోంది?

రాష్ట్రపతి, గవర్నర్లు పదవిలో ఉన్నప్పుడు వారికి రాజ్యాంగపరమైన రక్షణ లభిస్తుందని ఆర్టికల్ 361 చెబుతోంది. పదవిలో ఉన్న సమయంలో వారిపై ఎలాంటి క్రిమినల్ చర్యలు చేపట్టకూడదు. అప్పటికే అవి చేపట్టి ఉంటే వాటిని కొనసాగించకూడదు. వ్యక్తిగత చర్యలకు సంబంధించిన సివిల్ ప్రొసీడింగ్స్‌ను మాత్రం రెండు నెలల నోటీసు ఇచ్చి ప్రారంభించవచ్చు. రాష్ట్రపతి, గవర్నర్ ఏ న్యాయస్థానానికీ జవాబుదారీ కాదు. పదవిలో ఉండగా వారిని అరెస్ట్ చేయాలని, జైలులో ఉంచాలని ఏ న్యాయస్థానం ఆదేశించలేదు.

న్యాయ నిపుణులు ఏమంటున్నారు?

అయితే కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు లేదా పాలకులకు ఇదే విధమైన రాజ్యాంగ రక్షణ లభిస్తుందా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. క్యాట్ వ్యాఖ్యలు దీనిని సమర్థిస్తున్నాయి. అయితే లెఫ్టినెంట్ గవర్నరుకు అలాంటి రక్షణ ఏదీ ఉండదని రాజ్యాంగ నిపుణుడు, లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ పీడీటీ ఆచారి స్పష్టం చేశారు. రాష్ట్రపతి, గవర్నరుకు మాత్రమే అలాంటి రక్షణ ఉంటుందని తెలిపారు.

మేధా పాట్కర్ కేసులో...

నర్మదా బచావ్ ఆందోళన్ కార్యకర్త మేధా పాట్కర్‌పై దాడి చేసిన కేసులో తన పైన, మరో ముగ్గురి పైన చేపట్టిన చర్యలపై స్టే ఇవ్వాలన్న ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అభ్యర్థనను గత సంవత్సరం మే 8న దిగువ కోర్టు తోసిపుచ్చింది. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నరుగా కొనసాగినంత కాలం తనపై విచారణ చేపట్టకుండా ఆర్టికల్ 361ని ఉపయోగించాలని సక్సేనా కోరారు. దిగువ కోర్టు ఆదేశాలను గుజరాత్ హైకోర్టులో సక్సేనా సవాలు చేశారు. సక్సేనా అభ్యర్థనపై తుది నిర్ణయానికి వచ్చే వరకూ ఆయనపై విచారణ జరపవద్దని హైకోర్టు మధ్యంతర స్టే ఉత్తర్వులు జారీ చేసింది. ఆ స్టే ఉత్తర్వులు ప్రస్తుతం కొనసాగుతున్నాయని మేధా పాట్కర్ న్యాయవాది ఆనంద్ యాగ్నిక్ తెలిపారు.

సింగరేణి ప్రయివేటీకరణపై సీపీఐ(ఎం) సమరభేరి



(మొదటి పేజీ తరువాయి)

మోడీ ప్రభుత్వానికున్న బంధమే అందుకు కారణమని తెలుస్తున్నది. కార్పొరేట్ల లాభాల కోసం కార్మికుల, ప్రజల పొట్టలు కొడతామంటే..సీపీఐ(ఎం) ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించదు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆ విధానానికి నిరసనగా నేటి నుంచి వచ్చే నెల ఐదు వరకు సింగరేణి పరిరక్షణ యాత్ర' ద్వారా ప్రజలు, కార్మికుల్లో ఆ ప్రభుత్వ విధానాలను ఎండగడతాం.

ఈ యాత్రలో నిర్దిష్ట సూచనలేమైనా చేస్తున్నారా?

గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో సింగరేణి సంస్థ సొంత ఖర్చులతో అనేక ప్రాంతాల్లో సర్వే చేసి బొగ్గు బ్లాకులను గుర్తించి బొగ్గు ఉత్పత్తి చేస్తున్నది. శ్రావణ పల్లిలో కూడా ఆ రకంగానే బొగ్గు తవ్వకాలు చేపట్టాలి. కానీ.. వేలం పాట ద్వారా దక్కించుకోవాలని బీజేపీ ప్రభుత్వం చెబుతున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో వేలం పాట ద్వారానే ప్రయివేట్ వారికి ఇచ్చారు. దీని వల్ల సింగరేణికి పని లేకుండా పోతున్నది. నష్టాల పాలవుతుంది. అందుకనే వేలాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. తెలంగాణలో బొగ్గు బ్లాకులన్నీ సింగరేణి హక్కుగా పరిగణించాలి. నేరుగా సింగరేణికి ఇవ్వాల్సిందే. అయితే సింగరేణిని ప్రయివేటీకరించబోమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెబుతూనే మరో పక్క వేలం పాటలు పెట్టటం శోచనీయం. ఇది ప్రజలను, కార్మికులను పక్కదారి పట్టించటమే. రాష్ట్ర ప్రభుత్వం కూడా సింగరేణి పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. రాష్ట్ర శాసన సభలో తీర్మానం చేయాలి. ముఖ్యమంత్రి నాయకత్వంలో అఖిల పక్షాన్ని కేంద్ర ప్రభుత్వం వద్దకు తీసుకుపోవాలి.వేలం పాట ప్రారంభం సందర్భంగా కిషన్‌రెడ్డితో పాటు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొనటం ఎంత మాత్రం సరికాదు.

ఈ విధానాలు సింగరేణికి ఎలా నష్టం తీసుకొస్తాయి?

పాలకుల విధానాల వల్ల కోల్ ఇండియా, సింగరేణికి ఎలాంటి హక్కులు లేకుండా మిగతా వాటి లాగానే వేలం పాటలో పాల్గొనాలి. యూపీఏ ప్రభుత్వ కాలంలో కొలిండియాలో 10శాతం వాటాలమ్మితే..మోడీ ప్రభుత్వం మరో 29శాతం వాటాలమ్మింది.క్రమంగా వాటికున్న హక్కులను నిర్వీర్యం చేయటం, తెలంగాణ కొంగుబంగారమైన సింగరేణిని కార్పొరేట్ల చేతుల్లో పెట్టటం దాని లక్ష్యంగా ఉంది. ఆ విధానాలకు వ్యతిరేకంగా 2003లో సింగరేణి 15 రోజుల పాటు సమ్మె చేసింది. ఆ సమయంలో 12రోజులు జైల్లో ఉన్నాను. ఆ తర్వాత అనేక పోరాటాలు జరిగాయి.అయినా పాలకులు పెడచెవిన పెడుతున్నారు. మోడీ ప్రభుత్వం నగదీకరణ పేరుతో ప్రయివేటు వాళ్లకు విపరీత రాయితీలు ఇచ్చింది. బొగ్గు దిగుమతులమీద సుంకం రద్దు చేసింది. వీటితో పాటు దేశంలో బొగ్గు వినియోగించే సంస్థలన్నీ 10శాతం దిగుమతి చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిబంధన విధించింది. ఆ విధంగా అదానీ దగ్గర దిగుమతుల రూపంలో బొగ్గు కొనేందుకు అవకాశం కల్పించింది. దీంతో టన్ను రూ.3, 500, రూ. 4వేలకిచ్చే సింగరేణిని కాదని అనివార్యంగా ఏపీ ప్రభుత్వం టన్ను రూ.18వేల చొప్పున ఏడు లక్షల టన్నుల దిగుమతి ఒప్పందం చేసుకుంది. అట్లాగే సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం, జెన్‌కో, ఎన్‌టీపీసీ రూ. 30వేల కోట్లు బకాయిపడ్డాయి. అయినా సింగరేణి లాభాల్లోనే ఉన్నదన్న విషయాన్ని మర్చిపోవద్దు. విద్యుత్ ఉత్పత్తిలోనూ ప్రయివేట్ శక్తుల ప్రయోజనాలే ప్రభుత్వం చూస్తుంది. తద్వారా చార్జీలు పెరుగుతున్నాయి. ఈ విధానాల వల్ల ప్రజల మీద, సమాజం మీద తీవ్ర ప్రభావం పడుతుంది. ప్రభుత్వ ఖజానామీద కూడా ప్రభావం ఉంటుంది.

రాష్ట్ర కార్మిక వర్గానికి, ముఖ్యంగా సింగరేణి కార్మికులకు మీ పార్టీ ఇచ్చే పిలుపేంటి?

దొడ్డిదారిని సింగరేణిని వేలం ద్వారా ప్రయివేటీకరించేందుకు జరిగే కుట్రను కార్మిక వర్గం అడ్డుకోవాలి. వేలం పాటలను ప్రభుత్వం రద్దు చేయాలి.దీనికోసమే ఈ యాత్ర సాగుతున్నది. నేడు బెల్లంపల్లిలో ప్రారంభమవుతున్న యాత్రను పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రారంభిస్తారు. 31న గోదావరి ఖనిలో భారీ బహిరంగ సభ జరగనున్నది. దీనిలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు పాల్గొంటారు. ఐదున కొత్తగూడెంలో ముగింపు సభ జరగనున్నది. దీనిలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు విజయరాఘవన్ పాల్గొంటారు. మధ్యలో మేధావులు, రాష్ట్ర నాయకులు పాల్గొంటారు.

ప్రయివేటీకరణకు కారణమేంటి?

సింగరేణి ప్రయివేటీకరణకు దారి తీసే ప్రక్రియ సరళీకృత ఆర్థిక విధానాలతో మొదలయింది.వాస్తవంగా కార్మికుల సంక్షేమం, భద్రత కోసం, పర్యావరణ పరిరక్షణలక్ష్యంగా ప్రభుత్వ రంగ సంస్థలకు కొన్ని ఉత్పత్తులను రిజర్వు చేయటం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక చట్టాలు చేసింది. 1990 తర్వాత ప్రభుత్వ విధానాల్లో మౌలికంగా మార్పు వచ్చింది. మొదట కాప్టివ్ మైనింగ్ పేరుతో కోల్ ఇండియా, సింగరేణి నుంచి కొనకుండా తానే ఉత్పత్తి చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఆ తర్వాత సాధారణ బొగ్గు తవ్వకాల్లో కూడా ప్రయివేట్ సంస్థలకు వెసులుబాటు కల్పించింది. లీజు ఒప్పంద విధానాల్లో సులభతర మార్పులు చేసింది. కేంద్రంలో మోడీ సర్కార్ దూకుడుగా ప్రయివేటీకరణ చేస్తున్నది. ఆ తర్వాత 2021లో మరో చట్టాన్ని తీసుకొచ్చింది. వేలంపాటలో పొందిన వారికి ఎలాంటి కండీషన్లు లేకుండా ఆ చట్టం స్వేచ్ఛనిచ్చింది. కార్మికుల భద్రత, సంక్షేమం, పర్యావరణ సంరక్షణ ఇవేవీ వారికి ముఖ్యం కాదు. లాభాలు దండుకోవటమే వారి లక్ష్యం.

తానియా సోని మృతిపై కిషన్‌రెడ్డి దిగ్భ్రాంతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఢిల్లీలోని సివిల్స్ కోచింగ్ సెంటర్‌లో వరదల కారణంగా సికింద్రాబాద్‌కు చెందిన తానియా సోని(25) మృతిచెందటం పట్ల కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సోని తండ్రి విజయ్‌కుమార్‌కు స్వయంగా ఫోన్ చేసి పరామర్శించారు. ఆమె భౌతికకాయాన్ని వీలైనంత త్వరగా కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు సహకరిస్తామని హామీనిచ్చారు. ఢిల్లీ పోలీసులు, ఇతర అధికారులతో మాట్లాడి అన్ని లాంఛనాలను త్వరగా పూర్తిచేయాలని ఢిల్లీలోని తన కార్యాలయాన్ని కిషన్‌రెడ్డి ఆదేశించారు.

ఏడాదికి 6.5 లక్షల కొత్త ఆయకట్టుకు నీళ్లు

- ఐదేండ్లలో 36 లక్షల ఎకరాలు లక్ష్యం
- కమిషన్ల కక్కుర్తి కోసం ప్రాజెక్టులు కట్టం :నీటిపారుదల శాఖ రివ్యూలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఏడాదికి ఆరు లక్షల నుంచి ఆరున్నర లక్షల ఎకరాలకు నీళ్ల ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నాడిక్కడి జలసౌధలో ఆ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ శాఖ సలహాదారులు, కార్యదర్శులు, ఈఎన్సీతో పాటు ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ శాఖకు బడ్జెట్‌లో కేటాయించిన రూ.10,800 కోట్ల మూలధన పెట్టుబడి వినియోగంపై చర్చించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉండి తక్కువ వ్యయంతో పూర్తి కావస్తున్న ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలని నిర్ణయించారు. దానికోసం ఏ,బీ కేటగిరీలుగా విభజన చేశారు. నిలిచిన పనులు, ఎవరెవరికి చెల్లింపులు చేయాలి? వానాకాలంలో వచ్చే వరదల నిర్వహణ, చెరువులు, జలాశయాల కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ప్రతి పది హేను రోజులకు పనుల పురోగతిపై అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. గత ప్రభుత్వం మాదిరి అధికార దుర్వినియోగం చేస్తూ, కమిషన్‌ల కక్కుర్తి కోసం ప్రాజెక్టులు కట్టబోమని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. ఐదేండ్లలో 36 లక్షల ఆయకట్టుకు నీరు ఇవ్వాలనే లక్ష్యంలో ప్రభుత్వం ఉన్నదని స్పష్టంచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు మీద మరింత స్పష్టత రావల్సి ఉందన్నారు. తుమ్మిడి హెట్టి వద్ద అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణం చేయాలని గత కాంగ్రెస్ ప్రభుత్వం పనులు ప్రారంభించిందనీ, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఆ పనులు కొనసాగిస్తూ, జాతీయ హోదా కూడా అడిగారని గుర్తుచేశారు. ఆ తర్వాత దుర్బుద్ధితో ఆ పనులు ఆపేసి, రూ.30వేల కోట్ల వ్యయ అంచనాను రూ. 85 వేల కోట్లకు పెంచారని తెలి పారు. వ్యయం పెరిగినా ఆయకట్టు మాత్రం పెరగలేదన్నారు. ఈ ఏడాదిలో మొత్తం 12 ప్రాజెక్టుల్ని పూర్తిచేయాలని నిర్ణయించారు. వీటితో పాటు కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని 9,20,21,21ఏ,22 ప్యాకేజీలను ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపడతారు

గోదావరి బేసిన్

ప్రాజెక్టు పేరు	ఆయకట్టు (ఎకరాల్లో)	వ్యయం(రూ.కోట్లలో)
1. చినకాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం (ఎల్ఐఎస్)	12,267	183.96
2. మోదికుంటవాగు	-0-	163.08
3. లోయర్ పెన్‌గంగ, చనాక కొరాట ఎల్ఐఎస్	27,794	147.23
4. శ్రీపాద ఎల్లంపల్లి ఎల్ఐఎస్	41,000	545.95
5. జే చొక్కారావు దేవాదుల ఎల్ఐఎస్	1,32,012	512.18
6. సీతారామ ఎల్ఐఎస్	1,18,933	1,487.31
గోదావరి బేసిన్ మొత్తం	3,32,006	3,039.71

కృష్ణా బేసిన్

ప్రాజెక్టు పేరు	ఆయకట్టు (ఎకరాల్లో)	వ్యయం(రూ.కోట్లలో)
7. కొయిల్‌సాగర్ ఎల్ఐఎస్	3,078	121.56
8. రాజీవ్ బీమా ఎల్ఐఎస్	21,692	127.34
9. జవహర్ నెట్టెంపాడు ఎల్ఐఎస్	35,000	67.88
10. కల్వకుర్తి ఎల్ఐఎస్	1,34,994	489.16
11. డిండి ఎల్ఐఎస్	8,000	1,831.1
12. ఎలిమినేటి మాధవరెడ్డి శ్రీశైలం లెఫ్ట్‌బ్యాంక్ కెనాల్	50,000	1,679.66
కృష్ణా బేసిన్ మొత్తం	2,52,764	4,366.72



లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులు

- ప్రాంతీయ యుద్ధంగా మార్చొద్దు
- నెతన్యాహును హెచ్చరించిన ఈజిప్టు
- గోలన్ హైట్స్‌పై దాడితో సంబంధం లేదన్న హిజ్బుల్లా

బీరుట్ : ఇజ్రాయిల్ తన దురాక్రమణ పూరిత దాడులను పశ్చిమాసియాలోని ఇతర ప్రాంతాలకు విస్తరిస్తోంది. పాలస్తీనాను నాశనం చేసింది. ఇప్పుడు లెబనాన్‌పై పడింది. శనివారం గోలన్ హైట్స్‌లో 12 మంది మరణానికి కారణమైన రాకెట్ దాడికి హిజ్బుల్లాలను నిందిస్తూ దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయిల్ క్షిపణులతో విరుచుకుపడింది. మరో వైపు ఆ దాడితో తమకు ఎలాంటి సంబంధం లేదని హిజ్బుల్లా సంస్థ స్పష్టం చేసింది .గాజాలోను, లెబనాన్‌లోను ఇజ్రాయిల్ గత 24 గంటల్లో సాగించిన దాష్టీకాలకు 66 మంది చనిపోయినట్లు గాజా పౌర రక్షణ విభాగం తెలిపింది.కొత్త భౌగోళిక ప్రాంతాలకు ఇజ్రాయిల్ దాడులను విస్తరిస్తుండడంతో ఇది ప్రాంతీయ యుద్ధానికి దారితీసే ప్రమాదముందని ఈజిప్టు విదేశాంగ శాఖ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. గాజాలో కాల్పుల విరమణ తక్షణమే జరగాలని, అక్కడ నెలకొన్న అమానవీయ పరిస్థితులపై అంతర్జాతీయ సమాజం దృష్టి సారించాలని కోరింది. గోలన్ హైట్స్ ప్రాంతాన్ని ఇజ్రాయిల్ 1967లో ఆరు రోజులపాటు జరిగిన యుద్ధంలో సిరియా నుంచి ఆక్రమించుకుంది. ఐక్యరాజ్యసమితి తీర్మానం ప్రకారం గోలన్ హైట్స్ ఇజ్రాయిల్ ఆక్రమిత ప్రాంతంగానే ఉంది. ఈ ప్రాంతంలో అసలు అరబ్బులను మూలకు నెట్టేసి ఇజ్రాయిల్ యథేచ్ఛగా ఇజ్రాయిలీ నివాస కాలనీలను నిర్మించింది.

పాఠశాలపై బాంబుదాడి : 50కి చేరిన మృతుల సంఖ్య

సెంట్రల్ గాజాలో ఓ పాఠశాలపై ఇజ్రాయిల్ శనివారం జరిపిన బాంబుదాడిలో మృతుల సంఖ్య 50కి చేరింది. ఇల్లు సురక్షితం కాదని, ఐరాస సహాయక శిబిరాల్లో పాలస్తీనీయులు తలదాచుకుంటున్నారు. వాటిపైనా ఇజ్రాయిల్ వైమానిక దాడులు జరుపుతోంది. పాఠశాలల్లో తలదాచుకుందామంటే వాటినీ వదిలిపెట్టడం లేదు. శనివారం ఇజ్రాయిల్ సైన్యం జరిపిన దాడిలో పాఠశాల అంతర్ గోడలు కూలిపోయి పలువురు పిల్లలు చనిపోయారు. అంబులెన్సులు అందుబాటులో లేవు. దీంతో దుప్పట్లలో చుట్టి పిల్లల మృతదేహాలను తరలిస్తున్నారు. పాఠశాలపై దాడిని పాలస్తీనా అథారిటీ అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్ ప్రతినిధి ఖండించారు.

ఇటలీలో చర్చలు

గాజాలో సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ఇటలీలో ఈజిప్టు, ఖతార్, అమెరికా తదితర దేశాల ప్రతినిధులు ఆదివారం సమావేశమయ్యారు. కాల్పుల విరమణపై తమకు ఆసక్తి లేదని ఇజ్రాయిల్ పేర్కొంది.

వరదొచ్చిందంటే..

(మొదటి పేజీ తరువాయి)

నివసిస్తున్న పార్లమెంట్ సభ్యులు సైతం సాయం కోసం గగ్గోలు పెట్టారు. తనకు ఓ పడవ అవసరం ఉన్నదని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ జోక్ చేశారు కూడా.

సమన్వయ లోపమే శాపం

రాజకీయ ఉదాశీనతకు నగరాలు బలైపోతున్నాయి. విధాన రూపకల్పన, అమలులో జవాబుదారీతనం మధ్య సమన్వయం లేకుండా పోతోంది. విధానాలు రూపొందించేది కేంద్ర ప్రభుత్వం. ఈ విషయంలో రాష్ట్రాల ప్రమేయం తక్కువే.

ఏం చేయాలి?

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్పించిన తాజా బడ్జెట్‌లో తొమ్మిది ప్రాధాన్యతలు ఉన్నాయి. వాటిలో పట్టణీకరణ ఒకటి. నగరాలు అభివృద్ధికి కేంద్రాలు అని గొప్పలు చెప్పడం మినహా మిగిలిన వివరాలేవీ అందులో లేవు. పట్టణీకరణ అవసరమే కానీ అదొక్కటే సరిపోదు. వరదల నివారణకు ఓ విధానాన్ని రూపొందించి, దానికి సరిపడా నిధులు కేటాయించాలి. అనుసంధానించిన కారిడార్ల వెంబడి కొత్తగా విస్తరణలు చేపట్టాలి. పట్టణ ఆర్థిక వ్యవస్థ నుండి పొందుతున్న ఆదాయంలో కొంత భాగాన్ని తిరిగి పట్టణాలు, నగరాలకే కేటాయించాలి. ముఖ్యంగా రాజకీయ వైఖరులు, ఆర్థిక విధానాలను సమీక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మోడీ విజన్ ఏమైంది?

(మొదటి పేజీ తరువాయి)

నివసించడానికి అనువుగా లేకుండా పోతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే పరిస్థితులు రోజురోజుకూ మరింత దుర్భరంగా మారుతున్నాయి. వరదలకు పట్టణ ప్రణాళికలు సరిగా లేకపోవడాన్ని కారణంగా ప్రభుత్వాలు గుర్తించడం లేదు. ప్రకృతిపై నింద వేసి చేతులు దులుపుకోవడం తేలికైపోయింది.

ఏసిరెడ్డి స్ఫూర్తితో ఇండ్ల స్థలాల పోరాటాలు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



నవతెలంగాణ-జనగామ

ప్రజా నాయకులు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరులు ఏసిరెడ్డి నరసింహారెడ్డి స్ఫూర్తితో జనగామ ప్రాంతంలో నిరుపేదలు ఇండ్ల స్థలాల కోసం పోరాటాలు నిర్వహిస్తున్నట్టు నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏసీ రెడ్డి నరసింహారెడ్డి 33వ వర్ధంతి సభను ఆదివారం జనగామ జిల్లా కేంద్రంలోని కామాక్షి ఫంక్షన్ హాల్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సభ ప్రారంభానికి ముందు స్థానిక క్రిస్టియన్ గ్రౌండ్ నుంచి ఆర్టీసీ చౌరస్తా, నెహ్రూ పార్కు మీదుగా కామాక్షి ఫంక్షన్ హాల్ వరకు డప్పు కళాకారుల ప్రదర్శన బృందంతో, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు భారీ ప్రదర్శన నిర్వహించారు. ముందుగా ఏసీరెడ్డి చిత్రపటానికి నర్సిరెడ్డితో పాటు సీపీఐ(ఎం) జిల్లా నాయకత్వం పూలమాల వేసి నివాళులర్పించింది.


అనంతరం నర్సిరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నైజాం సర్కారుకు, దొరలకు ఎదురొడ్డి పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి ఏసీరెడ్డి అని అన్నారు. జనగామ ఎమ్మెల్యేగా నిస్వార్థంగా సేవలందించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. జనగామ జిల్లా ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదలకు ఇండ్లపట్టాలిచ్చి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలు రెచ్చగొట్టి పాలన సాగిస్తుందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేస్తూ, ఉన్న ఉద్యోగులను తొలగిస్తూ నిరుద్యోగాన్ని పెంచుతున్నదని ఆరోపించారు. రాజ్యాంగాన్ని రద్దు చేసి మనుధర్మశాస్త్రాన్ని అమలు చేసే కుట్ర పన్నుతోందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాల అమలులో విఫలమైందన్నారు. ఇండ్ల స్థలాలు లేని పేదలందరికీ ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి రానున్న రోజుల్లో ఏసీరెడ్డి స్ఫూర్తితో ప్రజా పోరాటాలు, ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు, సింగారపు రమేష్, రాపర్తి సోమయ్య, సీనియర్ నాయకులు బొట్ల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శులు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సందీప్, ధర్మభిక్షం

ప్రతిపక్ష ఎంపీలకు బెదిరింపులు

(మొదటి పేజీ తరువాయి)

దిగజారుతున్నాయని లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న వర్షాకాల సమావేశాల్లో అనేక ఉదాహరణలు చోటు చేసుకున్నాయని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల ఎంపీలపై తరచుగా ప్రభుత్వ మంత్రులే అన్‌పార్లమెంటరీ, అభ్యంతరకర, బెదిరింపు వ్యాఖ్యలు చేస్తున్నారని చెప్పారు. ఇలాంటి మంత్రులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నెల 26న భూపిందర్ సింగ్ హూడాపై కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ బెదిరింపు పదజాలాన్ని ఉపయోగించారని, ఈ నెల 25న సోనియా గాంధీని ఉద్దేశించి మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు అన్‌పార్లమెంటరీ భాషను ఉపయోగించారని గుర్తు చేశారు. అదేవిధంగా ఈ నెల 25న 'మతపరమైన భాష'ను ఉపయోగిస్తూ బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే ప్రసంగం చేశారని తెలిపారు. ఈ సంఘటనలు జరిగినప్పుడు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి సభలో ఉన్నప్పటికీ తన సహచరులను అదుపు చేయలేకపోవడం గమనించి నిరాశకు గురయ్యాయని లేఖలో గొగోయ్ పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం విధానాలను, సమావేశాలను, నిబంధనలను పట్టించుకోకపోవడంపై స్థిరంగా ఉందని విమర్శించారు. 'సభలో ప్రతీ సభ్యునికి వారివారి నియోజకవర్గాల వాణికి ప్రాతినిధ్యం వహించే విషయంలో సమాన బాధ్యత ఉంది. అభిప్రాయ భేదాలు అగౌరవానికి దారితీయకూడదు' అని తెలిపారు. 'సభకు సంరక్షకునిగా ప్రవర్తనా నియమావళిని మీరు సమర్థిస్తారని, ఏ సభ్యుడు కూడా పార్లమెంటు నిబంధనలను ఉల్లంఘించేలా అనుమతించరని నేను ఆశిస్తున్నాను. ఈ విషయంలో మీరు వెంటనే జోక్యం చేసుకోవాలని నేను కోరుతున్నాను, ఈ దుర్భరమైన ప్రకటనలు చేస్తున్న పార్లమెంటు సభ్యులపై మీరు వెంటనే చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాను' అని తెలిపారు.





'సురలకన్న కరుణాత్ముడు/ నరుడుగాక ఇంకెవ్వడు/ మందిర మెరుగని దేవుడు/ మనిషిగాక ఇంకెవ్వడు?' అంటూ మనిషిని మహనీయుడుగా, మందిర మెరుగని దేవునిగా చెబుతూ, అక్షర చిత్రికలు గీసిన మహాకవి, తెలుగు కవితకు అచ్చమైన చిరునామాగా, తెలుగు సినిమా పాటకు మేరునగగా, సాంస్కృతిక, సాహిత్య సభలకు వెలుగు దివ్వెగా వెలిగిన మహాకవి డా॥సి.నారాయణ రెడ్డి. భారతీయ సాహితీవేత్తల్లో సినారెది ప్రత్యేక స్థానమే కాదు, ఆయన తెలుగేతర భాషల్లోనూ పరిచయమైన మహోన్నత ప్రతిభామూర్తి కూడా. పార్లమెంట్ వేదిక నుండి ప్రపంచ కవితా యాత్రల వరకు సాగిన వారి ప్రస్థానం, ఆయన విరాన్మూర్తిని దర్శింపజేస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆయన కోటానుకోట్ల తెలుగుల సాంస్కృతిక రాయబారి, తెలుగు హృదయసీమలపై చెరగని పచ్చబొట్టు. ప్రతిష్టాత్మక జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకున్న డా॥ సి.నారాయణ రెడ్డి ఎనభైఆరు సంవత్సరాల నిండు జీవితం గడిపారు. తన సమున్నత వ్యక్తిత్వంతో 'కవి' అన్న పదానికి ఐకాన్‌గా నిలిచారు.

మనిషే ఆయన కవిత్వమూ... కాన్వాస్



- డా॥ పత్తిపాక మోహన్
9966229548

'సినారె' తఖల్లుస్‌తో తెలుగు గజల్‌కే కాదు, తెలుగు కవిత్వ 'కవితా కర్పూర వసంతరాయలు'గా విరాజిల్లిన ఆయన జూన్ 12, 2017న శాశ్వత నిద్రలోకి జారుకునే వరకు కవిత్వం రాశారు. ఆయన కనుమూసిన రోజు కూడా 'నవ తెలంగాణ'లో కవిత అచ్చయ్యింది. ఏడు దశాబ్దాలపాటు నిరంతరం కవిత్వం రాసిన సినారె తనదైన సమన్వయ దృక్పథంతో నడిచారు. పద్యం, గేయం, వచనం, గజల్, సినిమాపాట... ఏది రాసినా తనదైన ముద్రతో రాయడం ఆయనకే చెల్లింది. మాత్రా ఛందస్సులో సినారె చేసిన ప్రయోగాలు, రచనలు మరొకరు చేయలేదన్నది అతిశయోక్తి కాదు. 'సాహిత్యంలో సంప్రదాయ ప్రయోగాల స్థానాన్ని లెస్సగా అవగాహన చేసుకున్న' వారుగా సినారెను పేర్కొంటారు దేవులపల్లి రామానుజారావు. **'కవిత్వం నా మాతృభాష/ ఇతివృత్తం నా మానవత్వం'** అంటూనే **'భాష నేను తెచ్చుకున్న తీయని వరం/ భాష నేను కట్టుకున్న జీవన గోపురం'** అన్న మాటలు సినారె పథాన్ని, దృక్పథాన్ని, గమనాన్ని చెబుతాయి.

మొన్నటి నిజాం రాష్ట్రంలోని సిరిసిల్ల తాలూకా, నేటి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని హనుమాజిపేట అనే పల్లెటూరులో పుట్టి సినారెగా ప్రసిద్ధుడైన సింగిరెడ్డి (సత్య) నారాయణరెడ్డి వంద ఎకరాల భూస్వామి సింగిరెడ్డి మల్లారెడ్డి–బుచ్చవ్వ దొరసానిల ఏకైక కుమారుడు. సత్యనారాయణ వ్రతం చేసుకుంటే పుట్టాడని సత్యనారాయణ రెడ్డి అని పేరు పెట్టుకున్నారు. సినారెనే చెప్పినట్టు ఆయన పేరులోని 'సత్యం కాలక్రమంలో ఆయన కవిత్వంలో స్థిరపడిపోయింది. అప్పటి ప్రభుత్వ అధికార భాష ఉర్దూ. సినారె చదువు కూడా ఉర్దూలోనే సాగింది. ఇదే సమయంలో వేములవాడలోని హరికథలు, పురాణ ప్రవచనాలు, సిరిసిల్ల శ్రీ వేంకటేశ్వర దేవాలయ పూజారుల నగర సంకీర్తనా గానాలు సినారెలో తెలుగును వెలిగేలా చేశాయి. పట్టుబట్టి ఒప్పించుకుని చదువుకున్న నారాయణరెడ్డి ప్రస్థానం సిరిసిల్ల, కరీంనగర్‌ల మీదుగా హైదరాబాద్ చాదర్‌ఘాట్ కాలేజీ వరకు సాగింది. ఆయన పట్టుదలకు మారుపేరు. సిరిసిల్ల, వేములవాడల్లో విద్యార్థిగా ఉన్నప్పుడే కవిత్వం రాయడం ప్రారంభించారు. ఏడవ తరగతి చదివేప్పుడే **'ఒకనాడు ఒక నక్క ఒక అడవిలోపల/ పొట్టకోసర మెటో పోవుచుండె'** అనే సీస పద్యం రాశారు. పదవ తరగతి విద్యార్థిగా **'వెన్నవంటి మనసున్నవానికి/ అన్నమేమో కరువాయె/ ఉన్నవానికింత పెదుదా/ మన్న గుండె లేదాయె'** అనే గేయం రాశారు. 'మనం బట్టోళ్ళమా... బాపనోళ్ళమా' అంటూ నాయిన మల్లారెడ్డి వారించినా కవిత్వం రాయడం మానలేదు. విద్యార్థి దశలోనే **'మారాలి మారాలి మారాలిరా/ కరడుగట్టిన నేటి కరువుకు సంఘపు రంగు/ మారాలి మారాలి మారాలిరా', 'విజయంబు సాధించినావా విద్యార్థి/ నీ వీర భావాలు నింగి వ్యాపించగా/ నీ వైరిచిత్తాల నేల కనిపించగా'** వంటి అభ్యుదయ గేయాలు రాసిన సినారె అదే దృక్పథాన్ని అటు తరువాత సినీగీతాల్లోనూ కొనసాగించారు.

'మంచి మనసును మించిన దైవం/ మహిలో కలదా నరుదా' అని చెప్పిన సినారె ఇంకో చోట **'మనిషే మనిషికి తీయని వరమూ/ మనసులేని బ్రతుకే తీయని శాపమూ'** అంటారు. **'చదువు సంపద అందరిదీ/ పాడీ పంట అందరిదీ/ పరువుగా బ్రతికే జన్మహక్కు/ మనిషి అన్న ప్రతివానిదీ'** అంటూ 'డబ్బుకు లోకం దాసోహం' సినిమాకు రాసిన గీతంలో అంటారు సినారె. మానవ హక్కుల పట్ల అవగాహన, చేతన, అట్టడుగు వర్గాల పట్ల ఆవేదనతోపాటు సంపద అందరిదీ అన్న సమసమాజ భావన ఈ గీతంలో మనం చూడొచ్చు. నేను పైన పేర్కొన్నట్టు సినారెకు మనిషే జండా! మనిషే తన నమూనా! 'నిండు సంసారం' సినిమాకు రాసిన ఒక గీతంలో ఈ విషయాన్నే బలంగా చెప్పారాయన. **'ఎవరికీ తలవంచకు/ ఎవరినీ యాచించకు/ గుండె బలమే నీ ఆయుధం/ నిండుమనసే నీ ధనం'** అంటారు. మనిషి మనీషిగా మనగలగాలంటే తలవంచని వ్యక్తిత్వం ఉండాలన్నది వారి మతం. ఇదే కోవలో **'విద్యార్థులు నవసమాజ నిర్మాతలురా/ విద్యార్థులు దేశభావి నిర్ణేతలురా/ వినోదాలు చూపినా, విప్లవాలు రేపినా/ అన్నిటికీ పైచేయి యువతరానిదే – ప్రగతి/ ఆగిపోవు విద్యార్థులు ముందులేనిదే'** అంటారొకచోట. **'సహనం నా కవచం/ ... అహింసయే మనజాతికి/ అందిన పరమార్థం'** అని చెప్పిన సినారె, ఒకచోట తన స్వరాన్ని తీవ్రంగా వినిపిస్తారు... అదీ బలంగా... ! **'ఇది కుళ్ళిన సంఘం/ వయసు మళ్ళిన సంఘం – దీని/ కీళ్ళు విరిచేయాలి/ వేళ్ళు నరికేయాలి'** అంటారు.

విద్యార్థిగా వేసవి సెలవులకు హనుమాజీ పేటకు వచ్చే సినారె అనేక నాటికలు రాసి వాటిని ఆనాటి తన మిత్రులు కనపర్తి లక్ష్మీనర్సయ్య, ఆడెపు నారాయణ, శిష్యులు గూడూరి సీతారాం, గూడూరి రాఘవేంద్ర, గూడూరి శంకరం, కాతం ఆదిరెడ్డి మొదలైన వాళ్ళతో ప్రదర్శింపజేసేవారట. తరువాత వీరిలో సినారె, కనపర్తిలు కవిత్వం వైపు వెళ్ళగా, సీతారాం, శంకరం కథలవైపు, రాఘవేంద్ర బాల సాహిత్యం వైపు నడిచారు. ఇదే గ్రామానికి చెందిన మిద్దె రాములు ఇదే సమయంలో ఒగ్గుకథ వైపు వెళ్ళారు.

'నవ్వని పువ్వు' సంపుటి నుండి 'కలం అలిగింది వరకు' వచ్చిన సినారె గ్రంథాలన్నీ ఆయన కవిత్వంలోని విలక్షణతకు అద్దంగా నిలిచాయి. 'జలపాతం' సినారె తొలి కవితా సంపుటి. 'నాగార్జున సాగరం' సినారె అందించిన తొలి చారిత్రక కావ్యం. నాగార్జున కొండలోని బౌద్ధమత ఇతివృత్తాన్ని స్వీకరించి రాసిన గేయకావ్యమిది. ఇదే కోవలో కర్పూర వసంతరాయలుగా ఖ్యాతి గాంచిన కొండవీటి రెడ్డి ప్రభువు పెదకోమటి వేమారెడ్డి, లకుమల ప్రణయ వృత్తాంత గాథ 'కర్పూర వసంతరాయలు'. ఇది సినారెకు అత్యంత ఖ్యాతిని తెచ్చిన కావ్యాల్లో ఒకటి. ఇంకా 'విశ్వనాథనాయకుడు', 'ఋతుచక్రం' వంటివి ఈ సమయంలోనే వచ్చిన మేలిమి రచనలు. అందులో 'ఋతుచక్రం' కావ్యం నారాయణ రెడ్డి మట్టి మూలాల భూమికకు అద్దం పడుతుందనడం అతిశయోక్తి కాదు.

మానవుడే మహా నాయకుడుగా సినారె రాసిన మహా కావ్యం 'విశ్వంభర'. అప్పటిదాకా గేయకావ్యాలతో పాటు విలక్షణ ప్రయోగాలు చేసిన సినారె వచనంలో మహా కావ్యాన్ని రాయాలని సంకల్పించుకుని చెప్పిందే ఈ కావ్యం. దీనికి భారతీయ జ్ఞానపీఠం వరించింది. ఈ మహా 'కావ్యానికి నాయకుడు మానవుడు. రంగస్థలం విశాల విశ్వంభర. ఇతివృత్తం తేదీలతో నిమిత్తం లేని పేర్లతో అగత్యం లేని మనిషి కథ. ఈ కథకు నేపథ్యం ప్రకృతి... ఆదిమం నుంచీ ఆధునికం వరకు మనిషి చేసిన ప్రస్థానాలు ఈ కావ్యంలోని ప్రకరణాలు'. నిరంతర కవి, ప్రయోగశీలి అయిన సినారె అనేక ప్రయోగాలు చేశారు. వాటిలో 'ప్రపంచ పదులు', 'మా కందాలు' ఉన్నాయి. మహాకవి దాశరథి తెలుగులో గజల్ ప్రక్రియకు బీజం వేయగా, దానిని చేపట్టి తొలి గజల్ సంపుటిని తెలుగులో ప్రచురించిన కవి సినారె. అంతేకాదు తన గజళ్లను తానే స్వీయంగా గానం చేశారు కూడా. 'ఆత్మలను పలికించేదే అసలైన భాష' అంటారు ఒక గజల్‌లో సినారె. ఇది ఆయన మనిషికి వేసిన పెద్ద పీటను తెలిపే మిస్రా.

సినారె తాను జీవించి ఉన్నప్పుడు 86 గ్రంథాలు ప్రచురించగా, వారి తరువాత కూడా సుశీలా నారాయణరెడ్డి ట్రస్టు ఆ పరంపరను కొనసాగిస్తూ సినారె అముద్రితాలను, ఆడియో, వీడియోల రూపంలో ఉన్నవాటిని ప్రచురిస్తోంది. ఇవేకాక వివిధ సమయ సందర్భాల్లో సినారె చేసిన రచనలను ఒకచోట ఏర్చికూర్చి సంపుటాలుగా వేసి అందిస్తోంది. నేడు 29 జులై, 2024న సినారె 93వ జయంతి. ఈ సందర్భంగా తన ముందు తరం కవులు, మహనీయులు, గాంధీ, నెహ్రూ, అంబేద్కర్ వంటి యుగపురుషులపై రాసిన కవితలు 'సమన్వితం' గ్రంథంగా వెలువడుతోంది.

పరిశోధకులుగా కూడా సినారె స్థానం గొప్పది. 'ఆధునికాంధ్ర కవిత్వము– సంప్రదాయములు, ప్రయోగములు' పరిశోధకునిగా సినారె నిశిత పరిశోధన, శేముషీలకు నిదర్శనం. నన్నయ యుగం నుండి నేటి ఆధునిక యుగందాకా తెలుగు కవిత విస్తార, వికాస, ప్రయోగ, పరిణామ గాథలను చెప్పారిందులో సినారె. కవులు, వారి ప్రయోగాలు, ఏర్పరిచిన సంప్రదాయాలు, ఆయా కాలల్లో, యుగాల్లో ప్రవక్తలుగా వారు వేసిన ముద్రల వంటివి ఇందులో సోదాహరణంగా నిరూపించారాయన.

మనిషిని ఎంతగా ప్రేమించేవారో తన మట్టిని కూడా అంతే అభిమానించేవారు సినారె. ప్రతి సంవత్సరం తనకు జన్మనిచ్చిన హనుమాజీపేటకు వచ్చి రెండు రోజులు కూతుళ్ళు, అళ్ళుల్లు, మనవలు, మనవరాళ్ళతో సొంత ఇంట్లో గడిపేవారు. ఆ రెండు రోజులు మానేరుతీరం, హనుమాజీపేట ఒక సాహిత్యోత్సవంలాగా ఉండేది. సినారె తాను కొత్తగా రాసిన కవితలను వచ్చినవారందరికి వినిపించేవారు.

విశ్వవిద్యాలయ ఆచార్య పదవి నుండి ఉపకులపతి వరకు, అధికార భాషా సంఘం అధ్యక్ష పదవి నుండి రాజ్యసభ సభ్యత్వం వరకు సినారె అనేక పదవులను అధిష్టించారు. 'పదవున్నా లేకున్నా ఎదఎదలో నీ పరిమళాన్ని ఎవరాపగలరు నారన్నా!' అంటారు డా॥ ఎన్.గోపి సినారె మహోన్నత వ్యక్తిత్వం గురించి చెబుతూ. పదవున్నా లేకున్నా ప్రతిక్షణం కవిగా జీవించారు సినారె. 'కవిత్వం నా మాతృభాష' అంటూ కాలరెగరేసి చెప్పుకున్న కవి. చిన్నా పెద్ద భేదాలు లేకుండా కొత్త కవుల్లో నిన్న మొన్నటిదాకా వారు నింపిన స్ఫూర్తిని కొలవలేం. అందుకు వారు రాసే ముందుమాటలు, తిరుగుటపాలో జవాబు రాసే ఉత్తరాలు నిదర్శనం. తన అభిప్రాయం కోసం పుస్తకాన్ని పంపిన ఏవ్యక్తినీ నిరుత్సాహ పరచకుండా నాలుగు మాటలు రాసేవారు సినారె. ఆ నాలుగు మాటలే వారిలో ఎంతో స్ఫూర్తిని నింపేవి. భవిష్యత్తులో ఆయా కవులు చేసిన బలమైన వాగ్దాన సంతకాలకు స్ఫూర్తిగా నిలిచేవి. సి.నారాయణ రెడ్డి కవిగానే కాదు వ్యక్తిగా తెలుగు జాతికి ఐకాన్... షాన్... నిషాన్. 'ఎక్కడ సినారె ఉంటె అక్కడ అభిమానులుందరది ఎట్లన్సన్, చుక్కలు పొడిచిన నిశిలో చక్కని చంద్రుడు శికారు సలిపిన భంగిన్' అంటూ కందంలో డా.ఎన్. గోపి చెప్పిన అందమైన మాటలు సినారె ఏమిటో చూపిస్తాయి.

◆◆

> మానవుడే మహా నాయకుడుగా సినారె రాసిన మహా కావ్యం 'విశ్వంభర'. అప్పటిదాకా గేయకావ్యాలతో పాటు విలక్షణ ప్రయోగాలు చేసిన సినారె వచనంలో మహా కావ్యాన్ని రాయాలని సంకల్పించుకుని చెప్పిందే ఈ కావ్యం. దీనికి భారతీయ జ్ఞానపీఠం వరించింది. ఈ మహా 'కావ్యానికి నాయకుడు మానవుడు. రంగస్థలం విశాల విశ్వంభర. ఇతివృత్తం తేదీలతో నిమిత్తం లేని పేర్లతో అగత్యం లేని మనిషి కథ. ఈ కథకు నేపథ్యం ప్రకృతి... ఆదిమం నుంచీ ఆధునికం వరకు మనిషి చేసిన ప్రస్థానాలు ఈ కావ్యంలోని ప్రకరణాలు'.

ఎన్ని చలి సాయంత్ర రాత్రులలో..

పట్టాల రైలుగోడ పక్కన
కమ్మరి పనోళ్ళు చెప్పినట్టు వింటూ వంచినట్టుగా వొంగే ఇనుపముక్క ఆ పిల్ల నడుము..
ఎలా మరిచిపోను.. ఎలా వివరించి చెప్పను మొదటిసారి గుండెగోడలచుట్టూ సాలీడు ఊహల దారాలు
పహెలాబార్ పహెలా క్రష్.. బస్ వొత్తా..
ఉరుదూ హైస్కూల్, డీఈవో ఆఫీసునుంచి వీధిదృశ్యం చూసేందుకు ఆవరణ దాటిన రావి
చీకటి నీడ తగిలి తన కాలిమువ్వల దండతెగిన సవ్వడి
మున్నేటి పడమటి గాలి ప్రేమకు ఘల్లున కురిసే ఎండుటాకులు ..
తగ్గుతున్న సంచారం, పెరుగుతున్న భయం
చిక్కబడుతున్న చీకటిచేయి జతపట్టుకుంటున్న వీధిలైటు కాంతి సాయంత్రపు రాత్రి
రాత్రి సాయంత్రం వీధి లైట్లు ఊసులాడే రొమాంటిక్ మూమెంట్
పేదోళ్ళ సిన్మాటాకీస్... ప్రభాత్ దాటుతున్నప్పుడు
పోలీస్ కచ్చీరు ఎదురు కమాన్ బజార్ వైపు పాకుతున్న నల్లపాము ఆరోడ్డు..
తనూ తనచెల్లెలు, నేనూ దోస్త్ యూసుఫ్.. ఆగే, పీచే..
వాడేదో చెబుతుంటాడు నేనేమీ వినను.. నమాజ్ అంటుంటాడు నేను సంజాయించుకోను
తనేదో మాట్లాడాలనుకుంటుంది అదేదో ఇట్టే స్పష్టంగా వినపడుతుంది
ఇళ్ళల్లో చల్లకవ్వం తిప్పినట్టు ఆపిల్ల నడుమూ ఆదారిలెక్కనే వొంపుసొంపు ..
దారి వంచేదో, తానే మెలితిరిగేదో కానీ వొంపుతిరుగుతూ మెడవెనక్కుతిప్పి ఒక్క చూపుల పంజా ...
ఎంత బలంగా అంటే.. వాలుజడ వీపుపై నాట్యమాడేటంత...
ఎంతైనా నర్తకి.. కళ్ళు మాట్లాడతాయ్, హావభావాలూ మాట్లాడతాయ్
చెల్లెలితో కలిసినడుస్తూ కళ్ళుముందుకు తనచూపు వెనక్కు ...
ఆవొంపు దాటితే మరింత చీకటి.. తన నడకలు, తనవెనుక నడకలూ మరింత దగ్గరికి...
మాటలు వినపడేటంత.. శ్వాసలు వినపడేటంత..
నాట్యశిక్షణ ముగించుకొచ్చేదాక గుండెల్లో మువ్వల శబ్దం
అట్లా ఎన్ని ఏడాదులో ఎన్ని చలిసాయంత్రరాత్రులో.. ఏరా యూసుఫ్.. ఏడున్నవ్ ఏమంటవ్.

- శ్రీనివాస్ సూఫీ, 9640311380

29 న అడిగోపుల సంస్మరణ సభ

ఇటీవల దివంగతులైన కవి అడిగోపుల వెంకటరత్నం సంస్మరణ సభ ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 29 సాయంత్రం విజయవాడలోని ప్రెస్ క్లబ్‌లో జరుగుతుంది. ఈ సభలో కవులు, రచయితలు, వివిధ సాహిత్య సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు

- ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం

తెలంగాణి కవితా సంపుటి ఆవిష్కరణ

జూపాక సుభద్ర రాసిన తెలంగాణి కైతల దొంతులు పుస్తకం ఆవిష్కరణ సభ ఆగస్టు 3వ తేదీ సాయంత్రం 6 గంటలకు రవీంద్ర భారతిలో జరుగుతుంది. ఈ సభలో డి.అనసూయ, సీతక్క కె.శ్రీనివాస్, డా॥ జిలుకర శ్రీనివాస్, మామిడి హరికృష్ణ, బి.ఎస్.రాములు, ప్రొ.కంచ ఐలయ్య, ప్రొ.సూర్యధనుంజయ, డా॥ అంబటి సురేంద్ర రాజు, కొండవీటి సత్యవతి, డా॥ గోగు శ్యామల, డాక్టర్ కోయి కోటేశ్వరరావు, కనీజ్ ఫాతిమా, దాసోజు లలిత, స్వేచ్ఛ పాల్గొంటారు.

- దండోరా పబ్లికేషన్స్

కథల పోటీకి ఆహ్వానం

బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్ విశాఖ సంస్కృతి మాసపత్రిక సౌజన్యంతో నిర్వహిస్తున్న 8వ జాతీయ స్థాయి కథల పోటీకి ఆహ్వానం పలుకుతోంది. కుటుంబ వ్యవస్థ, నైతిక విలువలు, సామాజిక అంశాలు ప్రతిబింబించే కథలను 4, 5 పేజీలకు మించకుండా ఆగస్ట్ 24 లోపు 'బండికల్లు జమదగ్ని, అధ్యక్షులు, బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్, ఫ్లాట్ నెంబరు 402, హిమజ టవర్స్, 3/10 బ్రాడీపేట, గుంటూరు – 522002. లేదా ఈ–మెయిల్ : bjmarkandeyulu@gmail.com పంపించాలి.

- బండికల్లు జమదగ్ని, 9848264742

ఛిద్రం

రంగురంగుల అందమైన చిత్రాన్ని గీసి
కాన్వాస్ను చింపేసాడు చిత్రకారుడు
ఉలి సుత్తులతో రాయిని శిల్పంగా చెక్కి
సమ్మెటతో ధ్వంసం చేసాడు
భావుకత నిండిన కవితను రాసి
ఉన్నట్టుండి అక్షరాలను చెరిపేసాడు
అచ్చం కాలం లాగానే...

- ర్యాలి ప్రసాద్ 9494553425

పరస్పర విరుద్ధ సాహిత్య భావనలు

- జూకంటి జగన్నాథం,
9441078095



తొలి ఏకాదశి రోజున దళిత బహుజనుల సంస్కృతిలో కంచంలో బొక్క ఎగితే కాశీలో గంట మోగుతదనే సామెత వుంది. కానీ మొన్నటి ఏకాదశి రోజు ముఖ్యంగా మాంసాహారులు దళిత బహుజనులు శాఖాహారులుగా మారారు. ఆయా వర్గాలవారు ఒక్కరోజు కోసం ప్రాణం ఉగ్గ పట్టుకొని ఎప్పుడు తెల్లారుతుందా అని ఎదురు చూశారు. పైకి శాకాహారులుగా కనబడే అగ్రవర్ణాలవారు చాటుమాటుగా మాంసాహారులుగా, మద్యం సేవకులుగా మారిపోతున్న పరస్పర విరుద్ధ భావనల అసందర్భాల సందిగ్ధ కాలం కొనసాగుతున్నది.

ఒకవైపు మనిషి సమూహం నుంచి పాయలు పాయలుగా తన నుంచి తనను చేరుకోలేని దశకు విచ్ఛిన్నం అయిపోతున్నాడు. వినియోగ సంస్కృతి ముంచెత్తుతుంది. అవసరం ఉన్నా లేకున్నా పక్కా వినియోగదారుడుగా వ్యక్తి పరాయికరణలోకి జారిపోతున్నాడు. గ్యారంటీ, వారంటీ లేని సేవల రంగం విస్తరిస్తుంది. సహజంగానే ఈ మార్పులు చేర్పులన్నీ సాహిత్య వివిధ కళారంగాలపైన ఆయా ప్రక్రియలలో సృజన చేస్తున్న సాహిత్య కారులపై ప్రగాఢమైన ప్రభావం చూపుతుంది. వివిధ మాధ్యమాల ద్వారా ప్రకటించే ప్రక్రియలపై చర్యా ప్రతిచర్యల దోహదక్రియ నిరంతరంగా కొనసాగుతుంది. విభిన్న సాహిత్య వాదవివాదాలలో మెయిన్ స్ట్రీమ్ సంఘమ స్థలి పెనుగులాట కనిపిస్తున్నది స్థాపకతకు స్థితి ఎదురు తిరుగుతున్నది. ద్రవ్యాధునికత నేపథ్యంలో బౌమన్ చెప్పిన ద్రవాధునికతను దాటి కళారంగాలు కలవరపాటుకు గురవుతున్నాయి. ఇది 21వ శతాబ్దం ప్రథమార్థంలో సమూహం నుంచి వ్యక్తి వైక్తీకరణ పైన దాడి చేస్తుంటాయి. మనిషి తనం లుక్తమై, ఎడమ చేయితో చేసే పనులు కుడి చేయికి తెలువనీయకుండా గుప్తమై పోతున్నాడు.

సెల్ఫ్ ప్రమోషన్ పాకులాట, ఉనికి గుర్తింపు తండ్లాట, యావ ప్రవాహంలో మునిగి లక్ష్యం, గమ్యం లేకుండా ఆచూకీ రహితంగా కొట్టుకుపోతున్నాడు. ముందెప్పుడూ లేనంత మనిషి ఇటీవల అసంతులిత అసంతృప్తి భావనల పరస్పర విరుద్ధ మూర్ఛనల మధ్య గిరి గీసుకొని గురి అవుతున్నాడు. పునాదిలో ఉత్పత్తి సంబంధాల మధ్య ఒక కుదుపు ఏర్పడుతున్నది.

అందుకే నటి హేమామాలిని కెంట్ వాటర్‌ను తాగమని ప్రోత్సహిస్తున్నది. ధోని బూస్ట్ ఈస్ సీక్రెట్ ఆఫ్ మై ఎనర్జీ అని ప్రచారం చేస్తుంటాడు. ఒక బాలీవుడ్ హీరో బాత్రూం క్లీనింగ్ సామాను అమ్ముతుంటాడు. మహేష్ బాబు ఏదో డ్రింక్ తాగమంటాడు. వెంకటేష్ బాబు రామ్‌రాజ్ కాటన్ వస్త్రాలు ధరించమని కంపెనీ ఇచ్చే డబ్బుల కొరకు సెలబ్రిటీలు మన గ్రహచారం కొద్దీ ప్రచారం చేస్తూ ఒక అశాస్త్రీయ భావనలను తామరతంపరగా మార్కెట్ చేయబడుతుంది. గతంలో పొడచూపనంత అశాంతితో విలువలు లేక అనైతికతతో సమాజం సహజీవనం చేస్తుంది. 'నేను' అనే విపరీత పోకడలతో చిద్రుపల్‌గా రూపొంది, ప్రశ్నించని ఎన్నడూ ఇదేమిటని నోరుతెరచి అడగని మనిషి దేవాలయాలపై ఆధ్యాత్మిక చింతనలవైపు పరిగెడుతున్నాడు. తద్వారా గుడుల పైన ఒత్తిడి పెరిగిపోయింది. మనిషి నిర్వీర్యమైపోయి, సమాజం నిద్రాణమైపోయి సినిమాలలో, సీరియళ్లలో హీరోయిజాన్ని చూసి రోషాన్ని పెంచుకొని పైశాచిక ఆనందాన్ని పొందుతున్న చలనరహిత సంక్షోభ సమయం చుట్టుముడుతున్నది. ఇది పునాదిలో జరుగుతున్న కదలికలు. పైకి మాత్రం ప్రశాంత సముద్రాన్ని తలపించి లోన సుడిగుండాలు తుఫాన్లు చెలరేగుతున్న స్థితి అంతరంలో భూకంపాలు అగ్నిపర్వతాల అల్లకల్లోలం కొనసాగుతున్నది.

ఒకప్పుడు గొప్ప వ్యక్తిత్వాలతో విలువలతో పని చేసిన గోరా శాస్త్రి, ఖాసా సుబ్బారావు నార్ల వెంకటేశ్వరరావు లాంటి మహనీయుల నీడను తాకే స్వేచ్ఛ, అర్హత కోల్పోయి, నేటి పాత్రికేయులు యాజమాన్యాల టేబుల్ కు కట్టేయబడ్డ గుర్రాలు. అందుకని వీరి రాతలు పరిమితమైన పచ్చిక మైదానంలో సంచరించే తాడుతో కట్టేసిన అశ్వములాగా పేపర్ టైగర్లుగా గర్జిస్తుంటాయి . లేక ఏమీ చేయలేక కేవలం వేతన జీవుల స్థితికి చేరి తమలో తాము మదన పడుతుంటారు.

ఇది ఇలా ఉంటే మరోవైపు ప్రజాస్వామ్య వాహనాన్ని 'పెట్టుబడి' వెనుక సీట్లో ఉండి డ్రైవింగ్ ఫోర్సుగా ఇన్నినాళ్ళు పనిచేసింది. ఇటీవల వీరు ప్రజాస్వామ్య శాసన వేదికలలోకి నేరుగా ప్రజాప్రతినిధుల పేరున వచ్చి చేరుతున్నారు. ఇప్పుడు ప్రజలకు రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులు కుంచించుకుపోతున్నాయి. చట్టాలు క్రమక్రమంగా బలహీనపడుతున్నాయి. ప్రజాస్వామ్యం అమూర్త భావనగా పరిణామం చెందుతుంది. కులాల మధ్య అంతరం పూడ్చలేని అగాధంగా విస్తరిస్తుంది. సమాజం సమానతల ప్రాసంగికత కోల్పోతుంది. అభివృద్ధి పేరు చెబుతున్న స్వేచ్ఛ, మార్కెట్‌లోని డొల్లతనం మెల్లమెల్లగా బట్టబయలు అవుతున్నది. ఇది చాలదన్నట్టు ఇటీవల మనదేశంలోనే కాకుండా ప్రపంచ దేశాలలో మతాన్ని కూడా వెంట తీసుకొని ప్రజాస్వామ్య వ్యవస్థలు ముందుకు పోతున్నాయి. నాణ్యతలు ప్రామాణికతలు ఉత్పత్తి వ్యవస్థలలో నామమాత్రంగా మిగిలిపోతున్నాయి. రాజకీయ పార్టీల ప్రేరేపిత ఉద్యమాలే తప్ప నిజమైన ప్రజా ఉద్యమాలు అనేక కారణాల వలన వెనుకపట్టు పట్టాయి. వ్యవస్థలు, వ్యక్తులు అడ్డగోలుగా తప్పులు చేస్తూ చట్టం న్యాయస్థానాల నుంచి ఎలా తప్పించుకోవాలనే ప్రయత్నాలు చేస్తున్నారు.

2300 సంవత్సరాల క్రితం గ్రీకు తత్వవేత్త అరిస్టాటిల్ 'మనిషి సామాజిక జంతువు' అన్నాడు. అదే మనిషి క్రమక్రమంగా రాజకీయ జంతువుగా మారిపోయాడు. ఇప్పుడు అన్ని రకాల సాహిత్య వాదాలు రంగులు వెలిసిపోయి నోస్టాల్జియాలోకి తప్పించుకు వెన్ను చూపుతున్నాయి. అందుకే నేటి సాహిత్య ప్రక్రియలు ఫేస్‌బుక్‌గా, బ్లాగులుగా, కొన్ని లైకులుగా, మరికొన్ని షేరింగ్లుగా ఎవరికి వారే గుంపులుగా ఏర్పడి, పాయలు పాయలుగా చీలిపోయి సొంత కుంపట్లను పెట్టుకుంటున్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వెలుగులో యావత్తు సమాజం ఒక సంక్లిష్ట సంక్షోభం దిశగా జారుడుబల్లపై తూలి పడుతున్నది. అందుకే నేటి పెళ్లిళ్లు జరిగిన త్వరిత కాలంలోనే ఎక్కువ శాతం విముఖతలు విడాకులు జరుగుతున్నాయి. అలాగే పిల్లలు జన్మించక ఆసుపత్రిలో చుట్టూ ఆగమాగం తిరుగుతున్నారు. ఒక విధంగా భవిష్యత్తులో నపుంసకత్వ సమాజం ఆవిర్భవించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వీటి నేపథ్యంలో నేటి సాహిత్య ప్రక్రియలను పరిశీలించి విశ్లేషించుకుంటే పైన ఉదాహరించిన అనేకానేక సామాజిక ప్రతిఫలనాలు దృగ్గోచరం అవుతాయి. ఒక భావజాలానికి ఒక వాదానికి ఒక సిద్ధాంతానికి కట్టుబడి ఉండక మనిషి నిలకడ లేని తనంతో నిన్న చెప్పిన విషయాన్ని నేడు వాటికి విరుద్ధంగా తన భావనలను మార్చుకుంటుంటాడు. తద్వారా తను సూచిస్తున్న సాహిత్య ప్రక్రియల అన్నిటిలో నిలువ నీరైపోయి స్వచ్ఛతను కోల్పోయి కుళ్ళి కంపు కొడుతున్నాడు. పక్కా ఏ ప్రక్రియ సాహిత్య వాదమైన ఎటువంటి సృజన కారుడైన ఆకాశ అవకాశంలోకి తప్పుకుంటున్నాడు. చివరికి మనిషి ప్రకృతిపై ఆధిపత్యం సాధించుకుంటున్నాననే సరికి అతని ఉనికికే పూడ్చుకోలేని విపత్తు, ప్రమాదం పొంచి ఉన్నది. ఇందులో సాహిత్యకారులకు, సాహిత్యానికి రాయితీలు మినహాయింపులకు ఏమాత్రం పొసగని వైరి భావన మూర్ఛనలు కనిపిస్తుంటాయి. పరస్పర ఇచ్చిపుచ్చుకునే ధోరణి వలన వ్యక్తికి, సమాజానికి, రాజ్యానికి మధ్య ఒకానొక అవగాహన ఒప్పందం అంతఃసూత్రంగా ఇమిడి వుంటుంది. మర్యాదగా మాట పోగొట్టుకోని విధంగా సాహిత్యం సర్దుబాటుకు లోనవుతుంది. మధ్యేమార్గంగా రాజీకి ఒడిగడుతుంది. స్వతంత్రతను కోల్పోయి అంగవైకల్య సాహిత్యం ట్రై సైకిల్ పై విచికిత్స రహితంగా ప్రయాణం చేస్తుంది. బహుశా పెట్టుబడిలో ప్రతిష్టంభన ఏర్పడుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. అన్ని రకాల ప్రజాస్వామ్య వాదాలు అనతి కాలంలోనే యాంత్రికత వలన నిర్వీర్యమైపోయి రానున్న రోజుల్లో మళ్లీ మార్క్సిస్టు శాస్త్రాన్ని ఆశ్రయించే దిశగా ప్రస్తుత వాతావరణం ఏర్పడుతునట్టు తోస్తున్నది. అందుకే ఇప్పుడు అన్నీ తెంపు తెంపులుగా ఖండికలే తప్ప ఇతిహాసాలకు సాహిత్య ప్రక్రియలలో చోటుండే అవకాశం దుర్లభమవుతున్నది. వెరసి కళాసౌందర్యం అంశాలను పోషించే అనుభూతివాదులు కళ ప్రజల నుంచి ప్రజల కోసమని మార్క్సిస్టు తాత్విక పరస్పర విరుద్ధ అంశాలు సాహిత్య యవనికపై పొరలు పొరలుగా ప్రత్యన్న ఘర్షణకు దిగుతున్నాయి. ఇప్పుడు వర్చువల్‌గా 'కవులు అనధికార శాసనకర్తలు' తలమానికంగా నిలిచిన నిర్వచనం అసందర్భం అవుతున్నది. ఇవాళ్ల అత్యాధునిక సౌకర్యాలను అనుభవిస్తూ వచన సాహిత్యం బహుళ అంతస్తుల భవనం ముందు పద్యం పరిణామ క్రమాన్ని ఆమోదించ ఇచ్చగించలేక ఆయాసం రాగా టెంట్ వేసుకొని పునరుద్ధరణ దిశగా ప్రయాస పడుతున్నది. గతకాల వైభవం కోసం పాకులాడుతున్నది.

◆◆



దర్వాజ పేజీపై మీ అభిప్రాయాలను, సూచనలను, సలహాలను, రచనలను darwajapage@gmail.com కు పంపించగలరు. చిరునామా : దర్వాజ, నవతెలంగాణ, ప్లాట్‌నెం. 21/1, అజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్- 500020

తల్లాడ విద్యార్థికి బంగారు పతకం



- జాతీయ స్థాయిలో రాణింపు

నవతెలంగాణ-తల్లాడ

గోవాలో నిర్వహించిన 18వ జాతీయ యూత్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ గేమ్స్ ఛాంపియన్షిప్ పోటీల్లో తల్లాడ మండలం రంగం బంజర గ్రామానికి చెందిన ధరంసోత్ సింధు ప్రియ బంగారు పతకాన్ని సాధించింది. ఖమ్మం ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న సింధు జాతీయ స్థాయిలో 400 మీటర్ల పరుగు పందెంలో పతకం సాధించింది. అంతర్జాతీయ పరుగు పందెం పోటీలకు మన దేశం తరఫున పాల్గొనేందుకు అర్హత సాధించింది. ఇంటర్నేషనల్ యూత్ గేమ్స్ ఛాంపియన్షిప్ పోటీలు నేపాల్ దేశంలోని పోకారలో 2024 సెప్టెంబర్ 1 నుండి 6 వరకు నిర్వహించనున్నారు. నేషనల్ యూత్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ ఫెడరేషన్ ఇండియా తరఫున పాల్గొననున్నారు.



ఎర్రజెండా బిడ్డలను ఆదరించిన భద్రమ్మ

- తాళ్లూరి భద్రమ్మకు నున్నా నివాళి

నవతెలంగాణ -కూసుమంచి

మండలంలోని కేశవపురం గ్రామానికి చెందిన తాళ్లూరి భద్రమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మొదటి నుండి భద్రమ్మ ఎర్రజెండా పార్టీ బిడ్డలను ఎంతో గౌరవంగా చూసేదని, ఎర్రజెండా సభ్యులను తన కుటుంబ సభ్యులుగా భావించి ఆదరించేదని అన్నారు. భద్రమ్మకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒక కుమారుడు తాళ్లూరి వెంకటేశ్వరరావు సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. నివాళులు అర్పించిన వారిలో రాష్ట్ర కమిటీ సభ్యులు పి.సోమయ్య, పొన్నం వెంకటేశ్వరరావు, ఎర్ర శ్రీకాంత్, మెరుగు సత్యనారాయణ, ఎర్ర శ్రీనివాసరావు, పి. సంగయ్య, మండల కార్యదర్శి యడవల్లి రమణారెడ్డి, మండల కమిటీ సభ్యులు శీలం గురుమూర్తి, మల్లెల సన్మంత్ రావు, తోటకూరి రాజు, బిక్కసాని గంగాధర్, పందిరి వీరారెడ్డి, మూడు గన్య నాయక్, చిట్టూరి వెంకన్న, కొక్కిరేణి వెంకన్న, కేశవపురం గ్రామ శాఖ కార్యదర్శి బెల్లం నాగేశ్వరరావు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.



మురికి వాగా ? రైల్వే అండర్ బ్రిడ్జా?

- నిత్యం నీరు నిల్వ

నవతెలంగాణ-బోనకల్

మండల పరిధిలోని ఆళ్లపాడు రైల్వే అండర్ బ్రిడ్జి ప్రస్తుతం రైతులకు, వాహనదారులకు ఇబ్బందికరంగా తయారైంది. ఆనాడు ఆళ్లపాడు రైల్వే గేటు తీవ్ర ఇబ్బందికరంగా ఉండేది. బోనకల్ నుంచి ఆళ్లపాడు, మోటమర్రి, కలకోట, రాయన్నపేట, గోవిందాపురం ఏ గ్రామాలకు వెళ్లాలంటే ఆనాడు ఆళ్లపాడు రైల్వే గేటు అడ్డుగా ఉండేది. ఒక్కొక్కసారి అరగంట నుంచి ముప్పావు గంట వరకు గేటు వేసి ఉండేవారు. దీంతో వాహనదారులు, రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను స్థానికులు అనేకసార్లు రైల్వే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించి రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఏపీకి చెందిన కాంట్రాక్టర్ ఈ పనిని దక్కించుకున్నాడు. సదరు కాంట్రాక్టర్ పని ప్రారంభం నుంచే అనేక సమస్యలను సృష్టించుకుంటూ వచ్చాడు. నిర్మాణ పనులు ఆలస్యంగా చేస్తుండటంతో ప్రత్యామ్నాయ మార్గం చూపించకుండా పనులు చేస్తుండటంతో అఖిలపక్ష పార్టీల నాయకులు ఆధ్వర్యంలో అనేకసార్లు ఆందోళనలు కూడా నిర్వహించారు. నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన కూడా నిర్వహించారు. చివరకు రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేశారు. కానీ నిర్మాణ సమయంలో అండర్ బ్రిడ్జిలోకి వర్షపు నీరు, ఇతర మార్గాల ద్వారా వచ్చే నీరు బయటకు వెళ్ళటానికి తూతూ మంత్రంగా సైడ్ డ్రైనేజీ ని ఏర్పాటు చేశారు. నీరు వెళ్లే మార్గం సక్రమంగా లేకపోవడంతో నిత్యం నిల్వ ఉంటుంది. వర్షం వచ్చిన సమయంలో మోకాళ్ళ లోతు వరకు ఉంటుంది. దీంతో వాహనదారులు, మహిళలు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి నీరు నిల్వ లేకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజల కోరుతున్నారు. లేనియెడల రైల్వే అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా ఆందోళన నిర్వహిస్తామని వారు హెచ్చరిస్తున్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్‌కు చెందిన మహమ్మద్ షబ్బీర్, ఈగ రాజిరెడ్డి ఈ ఏడాది మార్చి నెలలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బాధిత కుటుంబాలకు ఖమ్మం గ్రానైట్ ఫ్యాక్టరీ అసోసియేషన్, ఖమ్మం గ్రానైట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి రూ.3,64,000 ఆర్థిక సాయంను ఆదివారం అసోసియేషన్ సభ్యులు అందజేశారు. మృతుల పిల్లల పేరుతో బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేసి ఆ పత్రాలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రానైట్ లారీ ఓనర్స్ అధ్యక్షుడు సురేందర్, ఉపాధ్యక్షుడు జనార్ధన్, కార్యదర్శి నాగరాజు, కోశాధికారి వెంకటేశ్వరరావు, గ్రానైట్ ఫ్యాక్టరీ అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల వెంకటరమణ, కార్యదర్శి రాజేశ్, రఘునందన్ రెడ్డి, బుచ్చిబాబు, మహిపాల్ రెడ్డి, వెంకట్, శ్రీనివాస్, మహేశ్ పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

మండలంలోని ఏదులాపురం గ్రామంలో అర్హులైన లబ్దిదారులకు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సిఫారసుతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు ఉరడీ సుదర్శన్ రెడ్డి ఆదివారం అందజేశారు. ఏదులాపురం గ్రామానికి చెందిన యడవల్లి వెంకటమ్మకు మంజూరైన రూ.17 వేలు, రేపాకుల ఉపేంద్రమ్మకు రూ.15,500, గణపారపు సీతయ్యకు 14,500, రజనీకి 9,500 రూపాయల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు మామిండ్ల విష్ణువర్ధన్ రెడ్డి, సీపీఎం నాయకులు దుండిగల నాగయ్య, గంధం నాగేశ్వరరావు, దిగుట్ల బ్రహ్మం, పొన్నెకంటి అనీష్, వేల్పుల జయప్రసాదరావు, ఆరెంపుల నరేష్, కొండ రవి, మామిండ్ల వెంకటరెడ్డి, మధు, ఆంజనేయులు, పెండ్లి ఉపేందర్ రెడ్డి, దుండిగల వినోద్, జగన్, వెంకటేష్, సాయి, సురేందర్, యమునాకర్, వీరభద్రం, మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు మేడిపల్లి విద్యార్థి ఎంపిక



- అభినందించిన కోచ్ కృష్ణయ్య

నవతెలంగాణ-ముదిగొండ

ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ క్రీడ ఎంపికల్లో మండల పరిధిలో మేడేపల్లికి చెందిన బొడ్డు విక్రమ్ ఎంపికయ్యారు. విక్రమ్ నాగార్జునసాగర్ లో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చదువుతున్నాడు. 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచి అండర్ 20 విభాగం నుండి ఎంపికయ్యారని కోచ్ బి.కృష్ణయ్య తెలిపారు. విక్రమ్ గత సంవత్సరం రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌తోపాటు, షూటింగ్ బాల్ లో జాతీయస్థాయికి ఎంపికయ్యారని ఆయన చెప్పారు. విక్రమ్ ఎంపిక కావడం పట్ల ఎంపీపీ సామినేని హరిప్రసాద్, గ్రామ మాజీ సర్పంచులు సామినేని రమేష్, కొత్తపల్లి నాగలక్ష్మి, గ్రామ పెద్దలు భాస్కరరావు, పోటు ప్రసాద్, ఉపేందర్, సామినేని శంకర్రావు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

భూమి ఉన్నంత వరకూ

ఎర్రజెండా పోరాటాలు ఉంటాయి

- రైతు రుణమాఫీకి రేషన్ కార్డు లింకు తొలగించాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-ముదిగొండ


ముదిగొండ అమరులకు నివాళి

భూమి ఉన్నంత వరకూ ఎర్రజెండా పోరాటాలు ఉంటాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. ముదిగొండ భూపోరాటంలో పోలీస్ తూటాలకు ఎదురొడ్డి అమరులైన యోధుల 17వ వర్ధంతి పార్టీ మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం అధ్యక్షతన ముదిగొండ స్థూపం వద్ద ఆదివారం జరిగింది. ఈ సభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముదిగొండ మృతవీరులు ఉసికల గోపయ్య, యలగందుల వీరన్న, కత్తుల లక్ష్మి, బంక గోపయ్య, పసుపులేటి కుటుంబరావు, జంగం బాలస్వామి, చిట్టూరి బాబురావు అమరత్వంతో తడిసిన నేల ముదిగొండ గడ్డని, వారి ఆశయ సాధనకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నిరుపేదలు, వ్యవసాయ కూలీలు జానెడు జాగా, ఇంటి స్థలాలకు 2007 జూలై 28న శాంతియుతంగా ఆందోళన చేస్తున్న పేదలపై ఆనాటి సీఎం రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం కర్కశంగా లాఠీచార్జి చేసి, బరితెగించిన పోలీసులు కాల్పులు జరిపి, ఏడుగురి ప్రాణాలను బలి తీసుకొని 18 మందిని క్షతగాత్రులను చేసిందన్నారు. మండలంలో బలమైన పార్టీగా ఉన్న సీపీఐ(ఎం)ను దెబ్బతీయాలని భావించిన కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలకు తెరలేపి అన్యాయానికి ఒడిగట్టిందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతు రుణమాఫీకి, రేషన్ కార్డు లింక్ పెట్టడం సరైనది కాదని, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో అరు గ్యారంటీలా ఊసే లేదన్నారు. ప్రజా ఉద్యమాల ద్వారా, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. నూతనంగా రేషన్ కార్డులు ఇవ్వాలని పొన్నం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు వాసిరెడ్డి వరప్రసాద్, వైస్ఎంపీపీ మంకెన దామోదర్, మండల నాయకులు టీఎస్ కళ్యాణ్, వేల్పుల భద్రయ్య, ఇరుకు నాగేశ్వరరావు, మందరపు వెంకన్న, కందుల భాస్కర్ రావు, మరికంటి వెంకన్న, మేడా నారాయణ, భట్టు రాజు, గ్రామ నాయకులు నెమిలి సైదులు, కటారి హుస్సేన్,రవి,రాజు అమరవీరుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

బాంబుల మోత తగ్గించకుంటే...

సింగరేణిని ముట్టడిస్తాం

- అధిక మోతాదు పేలుళ్లతో ఊగిపోతున్న ఇండ్లు
- ఓసీ అధికారులకు హెచ్చరిక చేసిన వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్



నవతెలంగాణ-సత్తుపల్లి

బాంబుల మోత తగ్గించకుంటే బాధిత ప్రజలతో కలిసి సింగరేణి ప్రాజెక్టు ఆఫీసర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ ఓసీ అధికారులను హెచ్చరించారు. ఇటీవల కాలంలో బొగ్గు వెలికితీత కోసం ఉపయోగిస్తున్న బాంబ్ బ్లాస్టింగ్ తీవ్రత గతంలో ఎన్నడూ లేని విధంగా పెరిగి సమీప ప్రాంతాల ఇండ్లు పునాదులు కదులుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ కాలనీలో సుమారు 300కు పైగా ఇండ్లు ఇప్పటికే బీటలు వారాయన్నారు. స్లాబు పెచ్చులు ఊడి నిద్రిస్తున్న వారిపై పడి గాయాల పాలవుతున్నారన్నారు. ఈ విషయమై ఆ కాలనీ ప్రజలు అనేకసార్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా వారి సమస్యకు ఇంత వరకు పరిష్కారం దొరకలేదని శ్రీనివాస్ మండిపడ్డారు. ఒక్క ఎన్టీఆర్‌నగరే కాకుండా అతి సమీపంలో ఉన్న వెంగళరావునగర్, జలగంనగర్, కొంత దూరంలో ఉన్న రాజీవ్‌నగర్ కాలనీలోని ఇండ్లు సైతం సింగరేణి బాంబ్ బ్లాసింగ్‌కు అదురుతున్నాయంటే వారు ఉపయోగిస్తున్న బ్లాస్టింగ్ మోతాదు తీవ్రత ఏ మేరకు ఉందో అర్థం అవుతుందని శ్రీనివాస్ తెలిపారు. ఇదిలా ఉంటే మండలంలోని కిష్టారంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లోని ఇండ్లు కిష్టారం ఓసీ బాంబుల ధాటికి చాలా వరకు దెబ్బతిన్నాయన్నారు. ఇటీవల పలువురి ఇండ్లు కూలిపోయాయన్నారు. స్లాబు పెచ్చులు మీదపడి పలువురు గాయాల పాలైన ఉదంతాలు కోకొల్లలుగా చోటుచేసుకున్నాయన్నారు. ఆయా కాలనీలకు చెందిన కొన్ని కుటుంబాలు ప్రాణభయంతో ఇండ్లను వదిలేసి వెళ్తున్నారని గ్రామస్తులు కొందరు తెలిపారని శ్రీనివాస్ పేర్కొన్నారు. సింగరేణి వచ్చాక సత్తుపల్లి బొగ్గుతో కాలుష్యమయమైందన్నారు. వేసవి తీవ్రత కూడా ఇతర ప్రాంతాల కంటే సత్తుపల్లిలో ఎక్కువ ఉంటుందన్నారు. బ్లాస్టింగ్ తీవ్రత తగ్గించకుంటే బాధిత ప్రాంతాల ప్రజలతో సింగరేణి కార్యాలయాన్ని దిగ్బంధనం చేస్తామని శ్రీనివాస్ హెచ్చరించారు. సింగరేణి కారణంగా ప్రభావిత ప్రాంతాల పడుతున్న ఇబ్బందులపై ప్రజా ప్రతినిధులు దృష్టిసారించాలని ఈ సందర్భంగా శ్రీనివాస్ కోరారు.

ఫిట్స్‌తో యువకుడు మృతి

నవతెలంగాణ-తిరుమలాయపాలెం



వరి పొలం దుక్కిలో వరి నారు కట్టలు విసిరి వేస్తుండగా ఫిట్స్ వచ్చి యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం మండల పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం...మండల పరిధిలోని బచ్చోడు గ్రామానికి చెందిన కుమ్మరి కుంట్ల సైదులు(42) ఆదివారం ఉదయం బచ్చోడు గ్రామానికి చెందిన పులిపలుపుల సుధాకర్‌కు వరి పొలం దుక్కిలో వరి నారు వేయడానికి కూలి పనిపై వెళ్లాడు. సైదులుకు ఫిట్స్ రావడంతో వరి పొలం దుక్కిలోనే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమార్తె సుజాత, కుమారుడు సురేందర్ ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ గిరిధర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గైర్హాజరైన అధికారులపై ఆగ్రహం

- ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, జెడ్పీటీసీ తిరపతి కిషోర్
- రసాభసగా మండల పరిషత్ సర్వసభ సమావేశం

నవతెలంగాణ బోనకల్ (చింతకాని)



చింతకాని మండల ప్రజా పరిషత్ సమావేశం రసాభసగా జరిగింది. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కోపూరి పూర్ణయ్య అధ్యక్షతన ఆదివారం జరిగింది. చివరి సర్వసభ్య సమావేశానికి చాలామంది పంచాయతీ కార్యదర్శులు డుమ్మా కొట్టారు. దీంతో ఎంపీపీ కోపూరి పూర్ణయ్య జడ్పిటిసి పరసగాని తిరుపతి కిషోర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరుకాని అధికారులకు షోకాజు నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవో రామయ్యను, ఎంపీవో మల్లెల రవీంద్ర ప్రసాద్ ను కోరారు. మాకు ఇంకా ఎనిమిది రోజులు పదవి ఉందని, ఈ రోజులలో మేమేంటో చూపిస్తామని మండిపడ్డారు. కనీసం చివరి వీడ్కోలు సమావేశానికి పంచాయతీ కార్యదర్శులు హాజరు కాకపోవడం చాలా బాధాకరమన్నారు. సమావేశం 10 గంటలకని సమాచారం ఇస్తే 12 గంటలకు రావటమేంటని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గడిచిన ఐదు సంవత్సరాలు మాకు సహకరించిన అన్ని రాజకీయ పార్టీల నాయకులకు,అధికారులకు, పంచాయతీ రాజ్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను ప్రవేశపెట్టారు. అనంతరం ఎంపీపీ, జడ్పిటిసి, ఎంపీటీసీలను అధికారులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఐదేళ్లపాటు మండల అభివృద్ధికి సహకరించిన ప్రజాప్రతినిధులందరికీ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో తహసీల్దార్ కె అనంతరాజు, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హాల్లప్, వ్యవసాయ శాఖ అధికారి పల్లెల నాగయ్య, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు పొంగులేటి శీనన్న కానుక

- గ్రూప్ 2, 3, ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ
- రైట్ ఛాయిస్ అకాడమీ కిరణ్ ఆధ్వర్యంలో కోచింగ్ క్యాంప్

నవతెలంగాణ-కూసుమంచి



పాలేరు నియోజకవర్గంలో పోటీ పరీక్షలకు సిద్ధమౌతున్న గ్రామీణ నిరుద్యోగులకు తెలంగాణ రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేయూతను అందించేందుకు ముందుకు వచ్చారు. రాష్ట్రంలో పోటీపరీక్షలకు అత్యున్నత శిక్షణా సంస్థ రైట్ ఛాయిస్ అకాడమీ సహకారంతో త్వరలో జరగనున్న గ్రూప్2, 3 పరీక్షలతో పాటు రాబోయే పోలీస్ ఉద్యోగాలకు సంబంధించి పొంగులేటి శీనన్న నిరుద్యోగ కానుక పేరిట ఉచిత కోచింగ్ క్యాంప్‌ను ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించిన గోడపత్రికను మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం మంత్రి విడుదల చేశారు. పాలేరు నియోజకవర్గంలోని నిరుద్యోగులంతా.. ఈ శిక్షణా శిబిరాన్ని ఉపయోగించుకొని తమ కలల ఉద్యోగాన్ని సాధించేందుకు కృషిచేయాలని పొంగులేటి ఆకాంక్షించారు. గతంలో కూడా తాను ఎంపీగా ఉన్న సమయంలో రైట్ ఛాయిస్ అకాడమీ కిరణ్ సహకారంతో ఏర్పాటు చేసిన కోచింగ్ క్యాంప్‌లో వందలాదిమంది ఉద్యోగాలు సాధించిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. రైట్ ఛాయిస్ అకాడమీ చైర్మెన్ మెండెం కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి ఫ్యాకల్టీల సహకారంతో పోటీ పరీక్షల శిక్షణతో పాటు, మాక్ టెస్టులు, ఉచిత స్టడీ మెటీరియల్‌ను ఈ శిక్షణా శిబిరంలో అందించనున్నట్లు తెలిపారు. పాలేరు నియోజవకర్గంలో పోటీ పరీక్షలకు సిద్ధమౌతున్న వారంతా.. ఆగస్ట్ 9లోపు అభ్యర్థి పేరు, గ్రామం, మండలం వివరాలను 8985096699 ఫోన్ నెంబర్‌కు వాట్సప్‌లో పంపాలని కోరారు. వేలకు వేలు ఫీజులు కట్టి కోచింగ్ తీసుకోలేని గ్రామీణ విద్యార్థుల కోసం మంత్రి పొంగులేటి ఉచిత శిక్షణా శిబిరం ఏర్పాటు చేయడం పట్ల నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాయల చంద్రశేఖర్ పోరాట జీవితం ఆదర్శం

నవతెలంగాణ-ఖమ్మం





అట్టడుగు వర్గాల ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసి అనేక పోరాటాలు నాయకత్వం వహించిన రాయల చంద్రశేఖర్ పోరాట జీవితం ఆదర్శమని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలో ఎస్ఆర్ గార్డెన్లో నిర్వహించిన రాయల్ చంద్రశేఖర్ సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సామాజిక శక్తులకు పురోగమి వాదులకు కమ్యూనిస్టులకు విప్లవాదులకు జీవితం చాలా అమూల్యమైనది విలువైనదని అలాంటి విలువైన జీవితాన్ని చివరివరకు ప్రజలకు అంకితం చేశారని ఆయన సేవలను కొనియాడారు.

రాయలకు పలువురు నేతల నివాళి

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావులు చంద్రశేఖర్ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ప్రజల తరపున పోరాడిన చంద్రశేఖర్ ధన్యడన్నారు. అనంతరం మాస్ లైన్ కేంద్ర కమిటీ సభ్యులు కేజీ రామచందర్, కె. రంగయ్య అరుణోదయ సంస్కృతి సమైక్య నాయకురాలు విమల న్యూడెమోక్రసీ ఏపీ రాష్ట్ర నాయకులు పోలారి, ధర్మాల సురేష్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు చంద్రన్న, గుమ్మడి నరసయ్య, చంద్ర, అరుణ, ప్రభాకర్, వి.కృష్ణ తదితరులు నివాళులర్పించారు. ఈ సభకు జాతీయ కార్యవర్గ సభ్యురాలు కే.రమ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎల్ పద్మ, అన్వేష్, గుర్రం అచ్చయ్య, వి. మనోహర్ రాజు, ఆవుల వెంకటేశ్వర్లు, ముద్ద బిక్షం, కల్పన, నాయని రాజు తదితరులు పాల్గొన్నారు.

'రాయల'కు సన్మానం

- ఖమ్మం గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అభినందన సభ
- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్‌గా నియామకంపై నాగేశ్వరరావుకు శుభాకాంక్షల వెల్లువ

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



తెలంగాణ రాష్ట్ర చిన్న తరహా గ్రానైట్ పరిశ్రమల అధ్యక్షులు రాయల నాగేశ్వరరావు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ గా నియమితులైన నేపథ్యంలో ఆత్మీయ అభినందన సభను ఆదివారం నిర్వహించారు. ఖమ్మం గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గొరిల్లా పార్కులో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వెంకటరమణ అధ్యక్షత వహించారు. గ్రానైట్ అసోసియేషన్ తో తనకున్న అనుబంధాన్ని ఎన్నటికీ మర్చిపోలేనని రాయల నాగేశ్వరరావు పేర్కొన్నారు. తాను ఈరోజు ఈ స్థాయిలో ఉన్నానంటే గ్రానైట్ రంగం ద్వారా తాను సాధించిన పేరు ప్రతిష్టలే కారణమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన సేవలను గుర్తించి గిడ్డంగుల సంస్థ చైర్మన్ గా నియమించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తనకు ఇచ్చిన బాధ్యతలను ఆదర్శవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కోల్డ్ స్టోరేజీలు, గిడ్డంగుల ద్వారా రైతులకు అందాల్సిన లబ్ధిని సమకూర్చే విధంగా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన తనకు రైతుల కష్టాలు, కన్నీళ్ల గురించి తెలుసని అన్నారు. రుణమాఫీ ద్వారా రూ.31వేల కోట్ల లబ్ది 45 లక్షల మంది రైతులకు సమకూరనున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు పక్షపాతి అని, రైతుకు సేవ చేసే అదృష్టం తనకు దక్కినందుకు ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రానైట్ అసోసియేషన్ ఫౌండర్ యలమద్ది శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షులు పారా నాగేశ్వరరావు, సాధు రమేష్ రెడ్డి, వేముల రవికుమార్, అసోసియేషన్ అధ్యక్షులు ఉప్పల వెంకటరమణ, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి దొడ్డ రాకేష్, పాటిబండ్ల యుగేందర్,



బుగ్గవీటి శ్రీధర్, తుళ్లూరి కోటేశ్వరరావు, వదినేపల్లి శ్రీనివాసరావు, టైల్స్ అసోసియేషన్ నాయకులతోపాటు గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ అభిమానులు పాల్గొన్నారు.



శేషు కుమార్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు ప్రదానం

నవతెలంగాణ-ఖమ్మం

సూరపనేని శేషు కుమార్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రదానం చేశారు. ఆదివారం నగరంలోని ఎస్ఆర్ కన్వెన్షన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి హాజరై.. శేషు కుమార్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. గతంలో తాను ఎంపీగా పోటీ చేసినప్పుడు, ఆ తర్వాత కూడా ప్రైవేటు పాఠశాలల సంఘం తరపున ఎంతో సహకరించారని తెలిపారు. ఆయన ద్వితీయ వర్ధంతి సందర్భంగా కుమారుడు యోగిరామ్, సతీమణి నిర్మల 257 మందికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేస్తుండడాన్ని అభినందించారు. మువ్వా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయం ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, ప్రైవేట్ పాఠశాలల సంఘం బాధ్యులు గుర్రం కాంతారావు, మహమ్మద్ జాఫర్ మతిన్, సాధుల మధుసూదన్, ప్రైవేట్ కళాశాల సంఘం నుంచి వీరారెడ్డి, ప్రైవేట్ అన్ని కళాశాలల సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.



పొలం బాట పట్టిన విద్యుత్ అధికారులు

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలోని న్యూలక్ష్మీపురంలో విద్యుత్‌శాఖ అధికారులు రైతు పొలం బాట ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి రైతుల పొలాల్లో ఉన్న విద్యుత్తు స్తంభాలు, మోటార్లను పరిశీలించారు. అనంతరం విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎ. సురేందర్ మాట్లాడుతూ విద్యుత్ శాఖ పొలంబాట ఉద్దేశాన్ని రైతులకు వివరించారు. రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని రైతులు భద్రత సూత్రాలతోపాటు, విద్యుత్ పొదుపు పాటించాలని కోరారు. "దీంతో రైతులు తమ సమస్యలను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్తూ," కెపాసిటర్లను ఏర్పాటు చేసుకుంటామని, విద్యుత్ అధికారులకు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు రైతు పొలంబాట కార్యక్రమంపై పలువురు రైతుల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ టెక్నికల్ ఇంజనీర్ వీ.బాబురావు, ముదిగొండ ఏడిఈ టీ.బీమ్ సింగ్, ఏఈ మేకపోతుల శ్రీనివాసరావు, గ్రామ మాజీ సర్పంచ్ వాగదాని కన్నయ్య, విద్యుత్ శాఖ సిబ్బంది పలువురు రైతులు పాల్గొన్నారు.



అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గోపాలరావు

నవతెలంగాణ-బోనకల్ (చింతకాని)

అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాల నిర్మిస్తామని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మడిపల్లి గోపాల్‌రావు అన్నారు. మండల పరిధిలోని పందిళ్ళపల్లి గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) నాయకులు, ప్రముఖ లాయరు, అమరజీవి అలవాల శ్రీనివాసరావు 11వ వర్ధంతి వేడుకలను పార్టీ పందిళ్ళపల్లి గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అలవాల శ్రీనివాసరావు స్థూపానికి మడిపల్లి గోపాలరావు, పార్టీ సీనియర్ నాయకులు వత్సవాయి జానకి రాములు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అలవాల శ్రీనివాసరావుని ఆనాడు చేసిన సేవలను కొనియాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అని వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) గ్రామ శాఖ కార్యదర్శి లింగం కోటేశ్వరరావు, నాయకులు కొల్లి నారాయణ, లింగం ప్రభాకర్, మంగు ప్రసాద్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

స్థానిక ఎంబి గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో ఖమ్మం జిల్లా సీనియర్ సిటిజన్స్ సర్వసభ్య సమావేశం ఆదివారం ఆ సంఘం అధ్యక్షులు డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెలిగేటి వయోవృద్ధులు పోషణ సంరక్షణ చట్టంపై అవగాహన కల్పించారు. ఎక్కువ సంఖ్యలో వయోవృద్ధులను సంఘములోనికి ఆహ్వానించారు. అనంతరం కోశాధికారి గత కొన్ని సంవత్సరములలో జరిగిన ఖర్చుల వివరాలను సభకు తెలియపరచి ఆమోదం పొందారు. నేలకొండపల్లి మండల అధ్యక్షులు ఉన్నం వెంకయ్య తను సర్పంచ్ గాను, స్వతంత్ర సమర యోధుల రాష్ట్ర అధ్యక్షులుగా చేసిన సేవలను వివరించారు. వీరమల్ల మున్నయ్య, జిల్లా సంక్షేమ అధికారి (రిటైర్డ్) సంస్థ నిర్వహించుచున్న కార్యక్రమాలను ప్రశంసించారు. జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికకు ఎన్నికల అధికారిగా, విధులు నిర్వహించి సేవా సంఘాలు ఎప్పుడు ఏకగ్రీవంగా ఎన్నిక జరగాలని కోరారు. తదనుగుణంగా సభ ఆమోదం తేలుపుగా సంఘ సభ్యులను సంప్రదించి నూతన కార్యవర్గాన్ని ప్రకటించి అభినందనలు తెలిపారు. ఈ సభలో శాస్త్రవేత్తలను, సీనియర్ సిటిజన్స్‌ను సన్మానించారు. సన్మానించిన వారిలో రాయల వెంకటేశ్వర్లు, ఉన్నం వెంకయ్య, మేకల బిక్షమయ్య, వి.మున్నయ్య, శ్రీనివాసరావు అసోసియేట్ ప్రొఫెసర్, ఝాన్సీ రాణి, జాల శ్రీలక్ష్మి, ఎం.సుబ్బయ్య, డాక్టర్ సుశీల, డాక్టర్ విజయలక్ష్మిను సన్మానించారు. తదుపరి ఎన్నికల అధికారి కార్యవర్గ వివరాలు ప్రకటించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ వితరణ

నవతెలంగాణ-తల్లాడ

పీడీజీ డాక్టర్ మురళీకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం నారాయణపురం గ్రామానికి చెందిన బంక మౌనికకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కర్నాటి లక్ష్మారెడ్డి, దారా శ్రీనివాసరావు, కాటికి వెంకటేశ్వరరావు, శీల వెంకటరెడ్డి దగ్గుల ప్రభాకర్ రెడ్డి, వేమిరెడ్డి చిన్న కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైరా పట్టణం నుండి గార్లఒడ్డు వరకు కార్ల ర్యాలీ

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా నియోజకవర్గ కేంద్రంలోని కారు ట్రావెల్స్, టాక్సీ స్టాండ్ యూనియన్ ఆధ్వర్యంలో గార్లఒడ్డు శ్రీలక్ష్మి నరసింహ స్వామికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వైరా పట్టణం నుండి టాక్సీ స్టాండ్ యూనియన్ ఆధ్వర్యంలో కార్లతో గార్లఒడ్డు దేవాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ రేచర్ల రామారావు, యూనియన్ కమిటీ సభ్యులు, డ్రైవర్స్ అండ్ ఓనర్స్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చేతి రాత పై శిక్షణ

నవతెలంగాణ-మధిర

జడ్పీహెచ్ఎస్ మడుపల్లి విద్యార్థులకు లూసిదా చేతి వ్రాతపై శిక్షణా కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వై.ప్రభాకరరావు పాల్గొని మాట్లాడారు.విద్యార్థులు శ్రద్ధతో క్రమశిక్షణతో చేతి వ్రాత నేర్చుకుంటే పరీక్షలలో ఉత్తమమైన ఫలితాలు పొందవచ్చని చెప్పారు. శంఖుచక్ర చేతి వ్రాత నేర్పే సంస్థ ద్వారా శిక్షణ ఇచ్చారు. రైటింగ్ ట్రైనర్స్ బీ.రవికుమార్, పి.ప్రశాంత్, హేమంత్ విద్యార్థులకు ఇంగ్లీష్, తెలుగు, హిందీ వ్రాతలో మెలుకువలు తెలియచేశారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక సహకారాన్ని అందించిన తోటమాల ఇఫ్రాయిమ్ కి ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు తోట నరసింహారావు, ఉపాధ్యాయులు బూసా కోటేశ్వరరావు, టీ.జ్యోతిర్మయి, పైడిపల్లి కిషోర్, ఆఫీస్ సబార్డినేట్ సీత పాల్గొన్నారు.

పొంగులేటి సామ్రాజ్యం రాఘవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

నవతెలంగాణ-వేంసూరు

పొంగులేటి సామ్రాజ్యం రాఘవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు కిమ్స్ హాస్పిటల్ వైద్యులచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో గుండె, మూత్రపిండాలు, నరాలు జనరల్ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మండలంలో గ్రామాల నుంచి వచ్చి 355 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో కిమ్స్ హాస్పిటల్ మేనేజర్ వెంకటేశ్వర్లు, అనిల్ వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీఎస్ అధ్యక్షుడు వీరభద్రరావుకు మాతృవియోగం

- రంగమ్మకు మాజీ ఎమ్మెల్యే సండ్ర నివాళి

నవతెలంగాణ-తల్లాడ



పీఏసీఎస్ అధ్యక్షుడు వీరభద్రరావు, నూతనకల్ మాజీ సర్పంచ్ తూము శ్రీనివాసరావు తల్లి తూము రంగమ్మ (85) ఆదివారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నూతనకల్‌లో రంగమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రంగమ్మ మృతితో నూతనకల్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎస్సై మధుబాబు

నవతెలంగాణ-బోనకల్



మండల పరిధిలోనే ఆళ్లపాడు గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మండల ఎస్సై కడగండ్ల మధుబాబు ఆదివారం ప్రారంభించారు. హైదరాబాద్ యశోద హాస్పిటల్ నందు సుదీర్ఘకాలం పని చేసిన అనుభవంతో డాక్టర్ మొహమ్మద్ ఆజాద్ షరీఫ్ ఎంబీబీఎస్ గోల్డ్ మెడలిస్ట్ ఆధ్వర్యంలో ఆళ్లపాడు గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో జ్వరాల బారిన పడిన వారికి ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా గ్రామంలోని ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు కందుల పాపారావు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బుంగ రాములు, సామాజిక కార్యకర్త మరీదు బరకయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇండ్ల స్థలాల ప్రక్రియ వేగవంతం చేయండి

- కలెక్టర్ ముజామిల్ ఖాన్‌కు మంత్రి తుమ్మల ఆదేశాలు

నవతెలంగాణ-ఖమ్మం



జర్నలిస్ట్ ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించి సత్వరమే ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు జారీ చేశారు. అర్హులైన జర్నలిస్ట్‌లకు ఇళ్ల స్థలాలు కేటాయించేలా ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఖమ్మం నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి తుమ్మల జిల్లా కలెక్టర్, నగర కమిషనర్ అభిషేక్ అగస్త్యలతో ఆదివారం క్యాంప్ కార్యాలయంలో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ముస్లిం మత పెద్దలతో చర్చించి ఖమ్మం నగరంలో అవసరమున్న చోట ఖబరస్థాన్, షాదిఖానా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలోనీ అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం ఉండేలా చూడాలన్నారు. శిథిలావస్థలో ఉన్న సోషల్ వెల్ఫేర్ , మైనార్టీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ తో పాటు ఇతర ప్రభుత్వ స్కూల్స్ ఏవైనా ఉంటే తక్షణమే ఖాళీ చేసి వాటిని కూలగొట్టి నూతన భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అవసరమున్న చోట తాత్కాలిక భవనాల్లో నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలనీ మంత్రి తుమ్మల సూచించారు. ఖమ్మం కార్పొరేషన్‌లో శానిటేషన్ విషయంలో అపరిశుభ్రత ఉందని, అసౌకర్యంగా ఉందని ప్రజల నుంచి పిర్యాదులు ఉన్నాయని, మున్సిపల్ కమిషనర్ సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. నగరంలో వరద నీరు ఎక్కడ నిలవకుండా డ్రైనేజ్ వ్యవస్థ పటిష్టంగా ఉండేలా మెరుగు పరచాలని సూచించారు. సారథి నగర్ రైల్వే అండర్ బ్రిడ్జి సత్వరమే ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. గోళ్ళపాడు ఛానల్ ఆధునీకరణ పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ పరిధిలోని ప్రైవేట్ స్థలాల్లో పరిశుభ్రత ఉండేలా యజమానులకు తగిన ఆదేశాలు జారీ చేసి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పౌర సమాజానికి పెను విపత్తుగా మారిన గంజాయి డ్రగ్స్ మహమ్మారి ఖమ్మం లో కనపడకుండా చేయాలన్నారు. వెలుగు మట్ల అర్బన్ పార్క్ ప్రజలకు ఆహ్లాదం పంచేలా మౌలిక వసతుల కల్పన చేయాలనీ, మెయిన్ రోడ్ నుంచి పార్క్ వరకు రహదారి మంజూరు అయిన నిర్మాణం సత్వరమే చేపట్టాలని మంత్రి తుమ్మల ఆదేశాలు ఇచ్చారు. అర్బన్ పార్క్ లో ఆహ్లాదం కోసం ఏయే శాఖలు నిర్మాణం చేపట్టాలో శాఖల వారీగా నివేదిక తయారు చేయాలని, వెలుగుమట్ల అర్బన్ పార్క్ ను మణిహారంలా తీర్చిదిద్దాలనీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి సరైన ప్రాధాన్యత లేదు

- సీతారామ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లకు పెంచాలి
- రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవతెలంగాణ-వైరాటౌన్



కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలో వ్యవసాయ రంగంకు సరైన ప్రాధాన్యత లేదని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు.ఆదివారం బోడేపూడి వెంకటేశ్వరరావు భవనంలో నిర్వహించిన స్టడీ సర్కిల్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2024-25 ఆర్థిక సంవత్సరంకు ప్రవేశపెట్టిన బడ్జెట్లో వ్యవసాయ రంగంకు నిధులు కోత పడిందని అన్నారు. రుణమాఫీ 40,000 కోట్ల రూపాయలు మొదటి అంచనా వేసి తర్వాత 31,000 కోట్ల రూపాయలుకు తగ్గింపు చేసి రాష్ట్ర బడ్జెట్లో 2,60,000 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారని, రైతు భరోసాకి 15,000 కోట్ల రూపాయలు గత ప్రభుత్వం కాలంలో కేటాయింపు ఉంటే ఎకరాకు ఐదు వేల రూపాయలు పెంచిన తర్వాత మరింత కేటాయింపు పెంచాలి అలాకాకుండా అదే నిధులు కేటాయింపుతో సాగులో ఉన్న భూమికి కూడా కోత పడే అవకాశం ఉందన్నారు. కౌలు రైతులకు భరోసా అందించే ప్రయత్నం బడ్జెట్లో లేదని చెప్పారు. సాగు నీటి ప్రాజెక్టులకు కూడా ప్రాధాన్య క్రమంలో నిధులు కేటాయింపు లేదని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 7 లక్షల ఎకరాల సాగు భూమికి సాగునీరు అందించే సీతారామ ప్రాజెక్టుకు 687 కోట్ల రూపాయలు కేటాయింపు కంటితుడుపు చర్య అన్నారు. సీతారామ ప్రాజెక్ట్ సత్వరమే పూర్తి చేయాల్సిన అవసరం ఉందని, అందుకు రెండు వేల కోట్ల రూపాయలు ఈ బడ్జెట్ సవరించి కేటాయింపు పెంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎరువులు సబ్సిడీ, ఫసల్ భీమాకు నిధులు కోత విధించిందని తెలిపారు. మారిన వాతావరణ పరిస్థితుల్లో వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడులు గణనీయంగా తగ్గి రైతులు పెట్టుబడులు కూడా తిరిగి రాక రైతులు ఆర్థిక సంక్షోభంలో ఉన్న నేపథ్యంలో వ్యవసాయ రంగంకు మరింత ప్రోత్సాహం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కోట ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లో ఇరవై శాతం అప్పులు, వడ్డీ చెల్లింపులుకు పోతాయని తెలిపారు. కార్పొరేట్ టాక్స్ పెంచకుండా సంక్షేమ పథకాలను అమలు చేయడం సాధ్యం కాదని, లేదంటే ప్రజలపై భారం వేయడం మార్గం అన్నారు. ఈ కార్యక్రమంలో స్టడీ సర్కిల్ వ్యవస్థాపక సభ్యులు పారుపల్లి చంద్రశేఖర్ బాబు, సీపీఐ(ఎం) వైరా పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ బొంతు సమత, వడ్లమూడి మధు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



'విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

నవతెలంగాణ-ఖమ్మం

విద్యుత్ శాఖలో కార్మికులు గత అనేక సంవత్సరాలుగా పలు రకాల సమస్యలు ఎదుర్కొంటూ పరిష్కారం కాక తీవ్ర ఆందోళనలకు గురి అవుతున్నారని, వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలని డిస్ట్రిబ్యూషన్ కంపెనీ కార్యదర్శి ఎం. ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన ఒక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్టిజన్ల కన్వర్షన్ లేక గత అనేక సంవత్సరాలుగా పెండింగ్ ఉండటం, అనేక సమస్యలు తీవ్రంగా ఉన్నాయని వీటిని వెంటనే ప్రభుత్వం, యాజమాన్యం కలగచేసుకుని పరిష్కరించాలని లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కామినేని నాగేశ్వరరావు, పుష్ప రాణి, ఎస్‌పీఎం అధ్యక్షులు రాజశేఖర్, కార్యదర్శి దావూద్, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, రూరల్ కార్యదర్శి ఎస్. సీతయ్య, ఎదులపురం సబ్ డివిజన్ కార్యదర్శి గంట శ్రీను, జిల్లాసెంటర్, కమలాకర్, ఎల్‌వీ. కృష్ణారావు, కూసుమంచి సబ్ డిజనల్ అధ్యక్షులు కే.రామయ్య, జిల్లా ట్రెసెరర్‌నే ఏ.కృష్ణమూర్తి, టౌన్ డివిజన్ కార్యదర్శి ఎల్ఎం.లాలయ్య, వైరా సబ్ డివిజన్ కార్యదర్శి అశోక్, వైరా డివిజన్ కారదర్శి జీ. గురునాథం, వర్కింగ్ ప్రెసిడెంట్ బీ. రాజేష్, మహిళా ప్రతినిదిలు, రాధా, సంధ్య రాణీ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

చికిత్స పొందుతూ ఓ మహిళా మృతిచెందిన సంఘటనపై ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఏన్కూర్ మండలం ఇందిరానగర్ కాలనీకి చెందిన నిన్నెకంటి పార్వతి(34) తన భర్త రమేశ్‌తో విభేదాల కారణంగా రెండేళ్లుగా చింతకాని మండలం కొదుమూరులోని తన తల్లిగారి ఇంటి వద్దనే ఉంటుంది. ఈనెల 26వ తేదీన ఖమ్మం వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన పార్వతి మండల పరిధిలోని తీర్థాల వద్దకు వచ్చి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసింది. పార్వతిని గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. సంఘటనపై మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ.రామారావు తెలిపారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

- డీవైఎఫ్ఐ త్రీ టౌన్ 8వ మహాసభలల్లో జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం, స్వచ్ఛమైన రాజకీయాలు చేసేందుకు నేటి యువత రాజకీయాల్లోకి రావాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ యువతకు పిలుపునిచ్చారు. ఖమ్మం త్రీ టౌన్ వర్తక సంఘం భవనంలో సారంగి పాపారావు, యర్రా నగేష్ అధ్యక్షతన డివైఎఫ్ఐ ఖమ్మం త్రీ టౌన్ ఎనిమిదో మహాసభలు నిర్వహించారు. ఈ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి యువత రాజకీయాలకు దూరంగా ఉంటున్నారని, రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తులు, కులం, మతం ప్రాంతం, ఆధారంగా వస్తున్నారని, అట్లాంటి రాజకీయాలకు దూరంగా ఉంటూ సమాజ మార్పుకు ఉపయోగపడే రాజకీయాలు చేయాలన్నారు. కొన్ని రకాల రాజకీయ పార్టీలు యువతను అన్ని రకాలుగా ఉపయోగించుకొని వారి భవిష్యత్తును నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిలో భాగంగానే యువతకు మత్తు, మాదకద్రవ్యాలు అలవాటు చేస్తున్నారని, సినిమాలు, సెల్ ఫోన్లు, వస్తువేమోహాన్ని పెంచి పోషిస్తున్నారని, ఎన్నికలు వచ్చినప్పుడు బీరు బిర్యానీ పొట్లాలు ఇచ్చి వారి చుట్టూ తిప్పుకున్నారని విమర్శించారు. సమాజం మారాలంటే స్వచ్ఛమైన రాజకీయాలు కావాలని, రాజకీయాలు కావాలంటే యువత రాజకీయాల్లో పాల్గొనాలని యువతకు పిలుపునిచ్చారు. యువతలో ఉన్న సృజనాత్మకతను బయటికి తీసేందుకు అనేక సందర్భాల్లో క్రీడా పోటీలు పెడుతుందని, యువత చదువులో ముందుండాలని అనేక రకాలమోడల్ తేస్టులు నిర్వహిస్తుందని, సేవా కార్యక్రమాలు, సంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. సమాజ మార్పుకు యువత కృషి చేయాలంటే డివైఎఫ్ఐ లాంటి సంఘంలో కచ్చితంగా పనిచేయాలని సూచించారు. ఈ మహాసభల ప్రారంభం సందర్భంగా డివైఎఫ్ఐ జెండాను అధ్యక్షులు సారంగి పాపారావు ఆవిష్కరించారు. అనంతరం కార్యదర్శి శీలం వీరబాబు త్రీ టౌన్ వ్యాప్తంగా గత రెండు సంవత్సరాలుగా జరిగిన కార్యక్రమాలను వివరిస్తూ ప్రసంగించారు. ఈ మహాసభలో సీఐటీయూ జిల్లా నాయకులు భూక్య శ్రీను, గుమస్తాల సంఘం రాష్ట్ర నాయకులు బండారి యాకయ్య, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కూరపాటి శ్రీను పాల్గొని ప్రసంగించారు. ఈ మహాసభ సందర్భంగా నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని, విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించాలని, ఖమ్మం త్రీ టౌన్ కేంద్రంగా మినీ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, గంజాయి డ్రగ్స్ ను ప్రభుత్వం నిర్మూలించాలని, యువతులపై లైంగిక వేధింపులు ఆపాలని, అందరికీ విద్య ఉపాధి కల్పించాలని నివేదిక ప్రవేశ పెట్టడం జరిగింది. ఈ మహాసభలో డివైఎఫ్ఐ నాయకులు కీత యశ్వంత్, దాసరి గణేష్, బోళ్ల సాయి, బొమ్మకంటి పాపారావు, బొమ్మకంటి అయ్యప్ప, శ్రావణ్ కుమార్, సిహెచ్.దావీద్, వై.సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

సీఐ సాగర్‌ను కలిసిన కాంగ్రెస్ నేత బీపీ నాయక్

నవతెలంగాణ-బోనకల్



వైరా సిఐ కార్యాలయంలో సీఐ సాగర్‌ను బోనకల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువనేత బీపీ.నాయక్ శనివారం మర్యా దపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిఐని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో గంజాయి బెడద ఉందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికే గంజాయి మహమ్మారిపై పలు చర్యలు తీసుకుంటున్నప్పటికీ రాబోయే రోజుల్లో టెక్నాలజీతో కూడిన పటిష్టమైన రాపిడ్ యాక్షన్ ఏజెన్సీ బృందాలను ఏర్పాటు చేసి గంజాయి రహిత సమాజాన్ని తీసుకురావాలని సిఐని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బోనకల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు భూక్యా భద్రు నాయక్, బుక్యా రమేష్ నాయక్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

రీజియన్ వ్యాప్త కార్మిక సమస్యలను పరిష్కరించాలి

- స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్
- ఆర్టీసీ కార్మికులకు నిరంతరం అండగా మేముంటాం
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-ఖమ్మం



రీజియన్ వ్యాప్తంగా ఉన్న కార్మిక సమస్యలను పరిష్కరించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(సిఐటియు అనుబంధం) రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ గడ్డం లింగమూర్తి డిమాండ్ చేశారు. తెలంగాణ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ-అనుబంధం) రీజన్ కమిటీ సమావేశం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం బాణాల రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహాలక్ష్మి పథకం పెట్టినప్పటినుండి తెలంగాణ ఆర్టీసీకి మంచి ఆదరణ వచ్చిందని హర్షం వ్యక్తం చేస్తూ ప్రజల రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని, కార్మికులపై విపరీతమైన భారం పడుతున్న దృష్ట్యా పని భారాన్ని తగ్గించాలని ఒక్కో కార్మికుడు రోజుకి 15 నుండి 16 గంటలు పనిచేస్తున్నారని పని భారాన్ని వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులకు రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని, ఇంకా ఆర్టీసీ సంస్థలో ఎన్నో సమస్యలు నెలకొని ఉన్నాయని వాటన్నింటిని సత్వరమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అల్లంశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిరంతరం కార్మికులకు అండగా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఉంటుందని కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం సాగిస్తుందని తెలియజేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మొదటినుంచి ఆర్టీసీ కార్మికులకు నిరంతరం అండగాతమ సంఘం ఉంటుందని, ఆర్టీసీ కార్మికుల ప్రతి సమస్యపై రాబోయే రోజుల్లో అనేక ఉద్యమాలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రీజియన్ కార్యదర్శి పిట్టల సుధాకర్ మాట్లాడుతూ కొత్త బస్టాండులో కార్మికులకు రెస్ట్ రూమ్‌లో బెడ్స్, మంచి నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, ఇల్లందు డిపోలో డీజిల్ బంకు ఏర్పాటు చేయాలని తదితర సమస్యలు పరిష్కరించాలని, పలు అంశాలపై కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. నివేదికపై డిపో కార్యదర్శిలు అందరూ చర్చల్లో పాల్గొన్నారు. ఆగస్టు 11వ తారీఖు నాడు హయ్యర్ పెన్షన్ పై వస్తున్న సమస్యలు పై రాష్ట్రస్థాయి సమావేశం ఖమ్మంలో నిర్వహిస్తున్నామని ఈ సమావేశానికి కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రచార కార్యదర్శి తోకల బాబు, రీజియన్ అధ్యక్షులు బాణాల రాంబాబు, రీజియన్ ప్రచార కార్యదర్శి తోకల బాబు, కోశాధికారి పర్వీన్, ఖమ్మం డిపో కార్యదర్శి గుగ్గిల రోశయ్య, కోశాధికారి డి.సరిత, సత్తుపల్లి కార్యదర్శి కృష్ణారెడ్డి, మణుగూరు కార్యదర్శి కేవీ.రామారావు, కొత్తగూడెం శంకర్, జే.ఉపేంద్ర చారి, ఎస్.కే.నజీరుద్దీన్,డి. వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రుల ఫొటోలకు పాలాభిషేకం

నవతెలంగాణ-ముదిగొండ

కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి 72 వేల కోట్లు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండలపరిధిలో వెంకటా పురం వ్యవసాయ పత్తి క్షేత్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫోటోలకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఫ్లెక్సీతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మధిర నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ, బిబ్లాక్ అధ్యక్షులు కందిమల్ల వీరబాబు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉసికల రమేష్, బుల్లెట్ బాబు, గుడిపూడి బుచ్చిరామయ్య, కందుల బాలచందర్, మందరపు ఉపేందర్‌రావు, కట్ల సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మహిళా సంఘం మండల అధ్యక్షులు గుడిపూడి ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

నూతన లేబర్ కోడ్‌ల అధ్యయనానికి ఎంపికైన 'రామాంజనేయులు'

నవతెలంగాణ-బోనకల్

కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌ల అధ్యయనం కోసం తెలంగాణ రాష్ట్రం నుండి ఏఐటీయూసీ తరఫున కేంద్ర ప్రభుత్వం నిర్వహించే శిక్షణా తరగతులకు ఆ సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి, బోనకల్ మండల పరిధిలోని రాపల్లి గ్రామానికి చెందిన తోట రామాంజనేయులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కార్మికులకు సంబంధించిన అంశాలపై ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని నోయిడా నగరంలోని వివి గిరి కార్మిక శిక్షణా కేంద్రం నందు శిక్షణలు జరుగుతాయన్నారు. రాష్ట్ర నాయకత్వం తనపై ఉంచిన నమ్మకంతో ఐదు రోజుల సమయాన్ని వృధా చేయకుండా తనపై ఉంచిన బాధ్యతను పూర్తిస్థాయిలో నెరవేర్చుతానాన్ని తెలిపారు. తనను ఎంపిక చేసిన ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎండి.యూసఫ్, ఎస్.బాలరాజు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహలతోపాటు రాష్ట్ర సమితికి కృతజ్ఞతలు తెలిపారు. యువ న్యాయవాది సామాజిక స్పృహ ఉన్న వ్యక్తి నూతన లేబర్ కోడులను అధ్యయనం చేయడానికి ఎంపికవటం కార్మికులోకానికి మంచి విషయమని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, తూము రోషన్ కుమార్, ఆకిన పవన్‌లు అభినందనలు తెలిపారు.

బోనాల వేడుకలు

నవతెలంగాణ-బోనకల్

మండల కేంద్రంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ పండుగను పురస్కరించుకొని మహిళలు బోనాలు ఎత్తుకొని డప్పు వాయిద్యాలతో మండల కేంద్రంలో గల నవ దుర్గ దేవాలయానికి ఊరేగింపుగా వెళ్లారు. నవదుర్గ అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. పాడిపంటలతో రైతులు కలకలలాడాలని కోరుతూ మహిళలు పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో పూజలు గావించి దేవాలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మధిర : మండల పరిధిలో వంగవీడు గ్రామంలోనిలో ఆషాఢ మాసం సందర్భంగా గంగమ్మ దేవాలయంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బోనాలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, మహిళలు బోనాలు ఎత్తుకుని డప్పు చప్పుళ్లతో పోతురాజుల నృత్యాలుతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. గ్రామ పెద్దలు, తండా నాయకులు భక్తులకు బోనాల జాతర శుభాకాంక్షలు తెలిపారు.



జడ్పీటీసీ పైడి సేవలు అమోఘం

- జడ్పీ చైర్మెన్ చంద్రశేఖర్

నవతెలంగాణ-దమ్మపేట

జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు సేవలు మండల వ్యాప్తంగా అమోఘమని జడ్పీ చైర్మెన్ చంద్రశేఖర్ అన్నారు. కొత్తగూడెంలో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జిల్లావ్యాప్తంగా ఉన్నా జడ్పీటీసీలకు చివరి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావుకు సన్మానం చేసి మండలం వ్యాప్తంగా వారు చేసిన సేవలను జడ్పీ చైర్మెన్ గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పైడికి మండల వ్యాప్తంగా ప్రతి వ్యక్తితో సత్సంబంధాలు కలిగిన వ్యక్తి అన్నారు. గ్రామాల్లో ఆయన చేసిన అభివృద్ధిని గుర్తు చేశారు. వెంకటేశ్వరరావు కేవలం ఒక రాజకీయ నాయకుడిలా కాకుండా కుటుంబ సభ్యుడిగా ప్రతి ఒక్కరికీ జడ్పీటీసీగా సేవలందించారని గుర్తు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉత్తమ జడ్పీటీసీలో ఆయన ఒకరని, కల్మషం లేని వారిని, ప్రతి వ్యక్తికి ప్రతి గ్రామానికి సేవ చేసిన వారిని అన్నారు. ఆయన తన పదవీకాలంలో చివరి సర్వసభ్య సమావేశంలో పాల్గొనడం బాధాకర విషయం అయినాసరే జడ్పీటీసీ పదవికి తగిన న్యాయం చేశారని తెలిపారు.

ఆదివాసీ సంఘాలతో ప్రత్యేక సమావేశం : పీఓ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

09 ఆగస్టు 2024 నాడు ఐటీడీఏ హెడ్ కోటర్స్ భద్రాచలం నందు జరుగు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ సంఘాల సభ్యులందరికీ 01 ఆగస్టు 2024 ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్టు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. కావునా ఆదివాసీ సంఘాల ప్రాతినిధ్య సభ్యులందరూ 01 ఆగస్టు 24 సాయంత్రం నాలుగు గంటలకు ఐటీడీఏ సమావేశం మందిరంలో జరుగు కార్యక్రమానికి తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

గుండెపోటుతో లోకేశ్వరరావు మృతి

- సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు నాగేశ్వరరావు నివాళి

నవతెలంగాణ-మణుగూరు






మాజీ సింగరేణియన్ ఉడతానని లోకేశ్వరరావు (68) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. ఆయనకు భార్య కమల, కుమారుడు అక్షయ్ ఉన్నారు. సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొడిశాల రాములు నాయకత్వంలో లోకేశ్వరరావు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాన సానుభూతి తెలిపారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు నివాళి అర్పించి, మాట్లాడారు. లోకేశ్వరరావు నేత్రాలను ఎల్వి ప్రసాద్ హాస్పిటల్‌లో నేత్ర దానం చేశారు. చనిపోయిన కూడా బతికున్న వారికి నేత్రదానాలు చేసి ఔదార్యం చాటుకున్న లోకేశ్వరరావు అమరజీవి అన్నారు. మణుగూరు గ్రామవాసీ, బాల్యమిత్రుడు ఉడతనేని లోకేశ్వరరావు అకాల మృతికి తీవ్ర సంతాపాన్ని తెలిపారు. ఇద్దరం కలిసి చదువుకున్నామని, 1972లో బూర్గంపాడులో ఒకే గదిలో ఉండి పదో తరగతి పరీక్ష రాశామని, ఆ తరువాత ఫిబ్రవరి 2, 1977 ఇద్దరం ఒకే ఆఫీస్ ఆర్డర్‌పై సింగరేణిలో జాయిన్ అయ్యామన్నారు. ఇద్దరం కూడా పీకే ఓసి-2 లోనే పని చేశామన్నారు. ఇద్దరం కూడా అక్కడే రిటైర్ అయ్యామన్నారు. పట్టణంలోని అధికార ప్రతిపక్ష పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు సందర్శించి సంతాప సానుభూతి తెలిపారు.

ఐటీసీలో కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు సకాలంలో చెల్లించాలి

- సీఐటీయూ

నవతెలంగాణ- బూర్గంపాడు



ఐటీసీ పీఎస్పీడీలో కాంటాక్ట్ కార్మికులు పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు సకాలంలో చెల్లించాలని కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆదివారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జనరల్ సెక్రెటరీ ఎస్.కే.పాషా మాట్లాడుతూ పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ప్రతి నెల 10వ తారీకులోపు వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఐటీసీ ఏస్పీడీ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను యజమాన్యం పరిష్కరించాలని ఆయన అన్నారు. కాంట్రాక్టులు 10 తారీకు లోపు చెల్లించకపోతే యజమాన్యం చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. అదేవిధంగా 13వ వేతనం ఒప్పందంలో చేసుకున్నటువంటి స్కిల్డ్ మ్యాట్రిక్స్, వి.ఆర్ఎస్ స్కిమ్‌ను వెంటనే అమలుపరచాలని ఆయన పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికులకు పని ప్రదేశంలో భోజనం వచ్చే విధంగా యజమాన్యం చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కందాల వెంకటరెడ్డి, మర్రి వెంకట్ రెడ్డి, బత్తుల గోపాల్ రావు, డి.రాము తదితరులు పాల్గొన్నారు.



గ్యాస్ సబ్సిడీ అందరికీ ఇవ్వాలి

- అర్హులైన వారందరికీ ఉచిత కరెంటు అందించాలి
- ఐద్వా ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా పట్టణ కార్యదర్శి డి.సీతాలక్ష్మి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్యాస్ సబ్సిడీ అందడం లేదని అన్నారు. 200 యూనిట్ల లోపు కరెంటు వాడిన వారికి ఉచిత కరెంటు ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ అది అమలు కావడం లేదని విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్లో గృహ నిర్మాణం కోసం కేటాయించిన నిధులు సక్రమంగా ఖర్చు చేసి అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షలు ఇంటి నిర్మాణం కోసం ఇవ్వాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా టౌన్ ఆఫీసు బేరర్స్ నాదెళ్ల లీలావతి, జి.జీవన జ్యోతి, ఏ.సక్కుబాయి, జి.రాధా, ఎస్.కె.చోటమ్మా, కే.సుశీల, డి.నాగ లక్ష్మి, సియెచ్ హైమావతి, బేబీ, సరోజిని, అలిమ, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ ప్రతులు దహనం

- విద్యారంగానికి 30% నిధులు కేటాయించాలి

నవతెలంగాణ-ఇల్లందు

విద్యారంగానికి 7.31% నిధులు కేటాయించడం అన్యాయమని 30% నిధులు కేటాయించాలని పీవైఎల్, పీడీఎస్యు డిమాండ్ చేసింది. విద్యరంగానికి తక్కువ నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ ఇల్లందులో మెయిన్ రోడ్ దగ్గర కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీవైఎల్ రాష్ట్ర కమిటీ సభ్యులు మోతిలాల్, పీడీఎస్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి కార్యదర్శి గోకినపల్లి మస్తాన్ మాట్లాడారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే జాబ్ క్యాలెండర్ ప్రకటించి కాంగ్రెస్ పార్టీ తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు.

ఆశ్రమ పాఠశాల ఫర్నీచర్ అమ్మకం

- తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండల పరిధిలోని రామచంద్రుని పేట గిరిజన బాలికల వసతి గృహం నుండి ఆటోలో తరలిస్తున్న ఫర్నిచర్‌ను గ్రామస్తులు ఆదివారం అడ్డుకున్నారు. వసతి గృహంకు చెందిన ఇనుప టేబుల్స్, ఐరన్ మంచాలు, ట్రంకు పెట్టెల లోడుతో వసతి గృహం లోపటి నుండి వస్తున్న అశోక్ లేలాండ్ వాహనాన్ని గ్రామస్తులు అడ్డుకొని అనుమతులు చూపెట్టాలంటూ వాహనదారుడుని గ్రామస్తులు నిలదీశారు. ఆ సమయంలో వాహనదారుడు దగ్గర ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో విషయాన్ని వసతి గృహం ప్రధానోపాధ్యాయురాలి దృష్టికి తీసుకెళ్లాడు. ఆ సమయంలో ప్రధానోపాధ్యాయురాలు వీరమ్మ ఫర్నిచర్ తరలింపుకు సంబంధించి తీర్మానం కాపీతో పాటు సర్క్యులర్ కాపీ చూపెట్టకపోవడంతో గ్రామస్తులతో పాటు ఆదివాసీ సంఘాల నాయకులు సైతం అక్రమంగా ఫర్నిచర్ తరలిస్తున్న ప్రధానోపాధ్యాయురాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై నవతెలంగాణ ప్రధానోపాధ్యాయురాలను వివరణ కోరగా... ఆశ్రమ పాఠశాలలో ఉన్న తుప్పు పట్టిన పాత వస్తువులను తీసివేయాలని ఉన్నతాధికారులు సర్క్యులర్ జారీ చేసినట్టు తెలిపారు. ఈరోజు అమ్మిన ఫర్నిచర్ పూర్తిగా తుప్పు పట్టి ఉందని వీటికి సంబంధించి తన వద్ద ఉపాధ్యాయులు విద్యార్థులచే తీర్మానం చేసిన కాపీ ఉన్నట్లు తెలిపారు.

ముంపులోనే లోతట్టు ప్రాంతాలు

శాంతించిన గోదారమ్మ

- కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక
- శబరి నదికి పోటెత్తిన వరద
- పునరావాస కేంద్రాలలో తలదాచుకుంటున్న
- 15వేల కుటుంబాలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం వద్ద గోదారమ్మ కొంత మేరకు శాంతించినా ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్య ఫలితంగా లోతట్టు ప్రాంత ప్రజలు పునరావస కేంద్రాలలోనే తలదాచుకునే పరిస్థితి ఏర్పడింది. శనివారం అర్ధరాత్రి వరకు ఉగ్రరూపం ప్రదర్శించి 55 అడుగుల వరకు చేరుకొని ప్రమాదకర స్థాయిలో ప్రవహించిన గోదారమ్మ ఆదివారం ఉదయం నుండి క్రమ క్రమంగా తగ్గుతూ మూడవ, రెండవ ప్రమాద హెచ్చరికలను సైతం ఉపసంహరించే దిశగా సాగుతూ ఆదివారం సాయంత్రం ఏడు గంటలకు 45 అడుగులకు చేరుకోగా భద్రాచల పట్టణవాసులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. పట్టణంలో ఉన్న స్లూఈజ్‌ల వద్ద పూర్తి స్థాయిలో మోటర్లు ఏర్పాటు చేయకపోవడంతో పాటు ఆంధ్ర-తెలంగాణ సరిహద్దులో ఉన్నటువంటి ఎనిమిదవ స్లూయిజ్ వద్ద కనీస మరమ్మతులు చేపట్టక పోగా



ఏపీలో నీటమునిగిన కూనవరం, వీఆర్‌పురం మండలాలు

మోటార్లను కూడా ఏర్పాటు చేయని ఫలితంగా పట్టణంలోని కొత్త కాలనీ, ఏఎంసీ కాలనీలకు వరద పోటెత్తి సుమారు 125 కుటుంబాలు నిర్వాసితులైన విషయం తెలిసిందే. ఆంధ్ర తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో ఉన్నటువంటి ఎనిమిదవ స్లూఈజ్ వద్ద నుండి భారీగా వరద నీరు కొత్త కాలనీ, ఏఎంసీ కాలనీలోకి చేరడంతో అధికారులు లోతట్టు ప్రాంత ప్రజలను పురావస కేంద్రాలకు తరలించగా ఆ కాలనీ ముంపు నుండి తొలగాలంటే కనీసం 40 అడుగులలోపు గోదారి వెనక్కి



భద్రాచలం



భద్రాచలం

తగ్గితే తప్ప లాకులు ఎత్తని పరిస్థితి ఉన్నది. ఈ నేపథ్యంలో ముంపుకి గురైన 125 కుటుంబాలు మరొక రెండు రోజుల పాటు పునరావస కేంద్రాలలోని తలదాచుకునే పరిస్థితి ఏర్పడింది. ఇరిగేషన్ అధికారులు తమ నిర్లక్ష్యాన్ని విడకపోతే ఆగస్టు, సెప్టెంబర్ నెలలలో భారీ మూల్యమే చెల్లించక తప్పదని పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా పోలవరం ముంపు మండలాలైన కూనవరం, వీఆర్ పురం, చింతూరు మండలాలకు ఇప్పుడప్పుడే వరద కష్టాలు వీడేలాగా కనిపించడం లేదు. గోదారమ్మ శాంతించినా శబరి ఉధృతంగా ప్రవహించి కూనవరం, చింతూరు మండలాలను ముంచిత్తుతుండగా సుమారు 15 వేల కుటుంబాలను అధికారులు హుటాహుటిన పునరావస కేంద్రాలకు తరలించారు. శబరి ఉగ్రరూపానికి చింతూరు కూనవరం మండలాలలోని సుమారు 135 గిరిజన గ్రామాలకు బహయ ప్రపంచంతో సంబంధం తెగిపోగా పోలవరం పేరుతో ఆంధ్రాలో విలీలమైన ముంపు మండలాలలో 260 పైచిలుకు గిరిజన గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. విలీన మండలాల్లో పర్యటించిన కూటమి ప్రజాప్రతినిధులు పునరవాస కేంద్రలలోనే తలదాచుకుంటున్న వరద బాధితులకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని నాణ్యమైన భోజనాన్ని బాధితులకు అందించాలని అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని ముంపు ప్రాంతాల్లో పర్యటించిన తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పట్టణాన్ని వరద ముంపు నుండి శాశ్వతంగా కాపాడుకుంటామని హామీ ఇచ్చినప్పటికీ ఆ మాటలు కార్యరూపం దాల్చాలంటే కనీసం కరకట్ట పునర్ నిర్మాణానికి రూ.1000 కోట్లు అవసరం ఉందని అంత ఎక్కువ మొత్తాన్ని ప్రస్తుత ప్రభుత్వం కేటాయించి భద్రాచలం పట్టణాన్ని కాపాడుకుంటుందా అన్నది ఇప్పుడు సమాధానం లేని ప్రశ్నగా మిగిలిపోతుంది.

పునరావాస కేంద్రాలలో పులిహోర ప్యాకెట్ల పంపిణీ

- మదర్ ఎన్జీవో వ్యవస్థాపకులు మాగంటి వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-బూర్గంపాడు



గోదావరి వరద ప్రభావంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన నాలుగు పునరావాస కేంద్రాలలో కస్తూర్బా పాఠశాల, బూర్గంపాడు జడ్పీ హెచ్ఎస్ రెడ్డిపాలెం, తాళ్లగొమ్మూరు, కమ్యూనిటీ హాల్, ఐటీసీ పునరావాస కేంద్రాలలో మదర్ ఎన్జీవో స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మాగంటి వెంకటేశ్వరరావు నిర్వాసితులకు అక్కడే ఉంటూ సేవలందిస్తున్న సిబ్బందికి అందరికీ ఆదివారం పులిహోర ప్యాకెట్‌లను పంపిణీ చేశారు. అలాగే గతంలో కూడా వరదలు వచ్చినప్పుడు భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సుభాష్ నగర్ తదితర ముంపు ఆవాస కేంద్రాలలో 500 మందికి దుప్పట్లు, చెప్పులు మదర్ ఎన్జీవో వితరణ చేసినట్టు ఆయన తెలిపారు. గోదావరి ఉధృతాన్ని బట్టి నిర్వాసితులకు మరిన్ని సేవలు అందించడానికి అధికారులకు, సిబ్బందికి సహాయ, సహకారాలు తమ వంతుగా అందించడానికి మదర్ ఎన్జీవో అన్నివేళలా ముందుంటుందని తెలియజేశారు.

ప్రమాద బీమా సద్వినియోగం చేసుకోవాలి : జీఎం

నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వారు అందించే ప్రమాద భీమా, ఇతర ప్రయోజనాలు సద్వినియోగం చేసుకోవాలని జీఎం జాన్ ఆనంద్ అన్నారు. సీఅండ్ఎండీ యాన్.బలరాం ఆదేశాల మేరకు, డైరెక్టర్(పా) యాన్.వి.కే శ్రీనివాస్ సూచనలమేరకు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా గత కొన్ని రోజులుగా ఇల్లందు ఏరియాలో వివిధ గనులు, విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వారిచే నూతన అకౌంట్లను అందించే కార్యక్రమం యుద్ధ ప్రతిపాదనగా నిర్వహించినట్లు తెలిపారు. జేకే కాలనీలోని సివిల్ విభాగం నందు నిర్వహించబడుతున్న ఈ కార్యక్రమాన్ని జీఎం ఆదివారం తనిఖీ చేసారు. యస్ఓటూ జీఎం మల్లయ్య, బ్యాంకు సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలి

- సీపీఐ(ఎం) సింగరేణి పరిరక్షణ యాత్రను జయప్రదం చేయాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య

నవతెలంగాణ-మణుగూరు



తెలంగాణలో బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని, కేంద్ర బీజేపీ ప్రభుత్వ బొగ్గు గనుల వేలంపాట ఆపాలని రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ(ఎం) సింగరేణి పరిరక్షణ యాత్ర నిర్వహిస్తున్నామని, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. ఆదివారం స్థానిక శ్రామిక భవనంలో ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో బొల్లం రాజు అధ్యక్షతన సీపీఐ(ఎం) సింగరేణి పరిరక్షణ యాత్ర పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు మూడో తేదీన సీపీఐ(ఎం) సింగరేణి పరిరక్షణ యాత్ర మణుగూరులో ప్రవేశిస్తుందన్నారు. బొగ్గు గనులలోని వివిధ పని ప్రదేశాలలో యాత్ర నాయకులు పర్యటిస్తారని తెలిపారు. మూడు గంటలకు అంబేద్కర్ సెంటర్‌లో బహిరంగ సభ ఉంటుందన్నారు. సింగరేణి పరిరక్షించుకోవడం కోసం అధిక సంఖ్యలో మణుగూరు సబ్ డివిజన్‌లోని ప్రజలందరూ పాల్గొనాలన్నారు. 4, 5వ తేదీలలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెం, ఇల్లందు, సత్తుపల్లిలో బస్సు యాత్ర ఉంటుందన్నారు. 5న మూడు గంటలకు కొత్తగూడెంలో ముగింపు సభ జరుగుతుందని ఆయన తెలిపారు. ముగింపు సభకు అధిక సంఖ్యలో కార్మికులు, ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌కు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వేలంపాట నిర్వహించిందన్నారు. కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి దాని ప్రారంభించారని అన్నారు. బొగ్గు గనుల తవ్వకాల కోసమే సింగరేణి సంస్థ ఏర్పడిందని గుర్తు చేశారు. చౌకగా విద్యుత్ ఉత్పత్తికి ఉపయోగపడే బొగ్గును ప్రయివేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఇస్తుందన్నారు. సింగరేణి సంస్థను నీరుగార్చి, దానిని దెబ్బతీసేలా బొగ్గు బ్లాకులను వేలం పాటను నిర్వహిస్తుందని విమర్శించారు. బొగ్గు బ్లాక్‌ల వేలం పాటను కాపాడుకునేందుకు సీపీఐ(ఎం) సింగరేణి పరిరక్షణ యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. జులై 29న బెల్లంపల్లిలో రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రారంభిస్తారని అన్నారు. ఈ యాత్రకు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు గోపాల్, పి.ఆశయ నాయకత్వంలో బస్సు యాత్ర కొనసాగుతుందన్నారు. ఆగస్టు 5న కొత్తగూడెంలో ముగింపు సభ ఉంటుందని తెలిపారు. బొగ్గు గనులకు కేంద్రాలైన మణుగూరు, ఇల్లందు, కొత్తగూడెం నుంచి అధిక సంఖ్యలో కార్మికులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రయివేటీకరణ వలన ప్రజల ఆర్థికంగా దెబ్బతింటారు

సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మచారి

బొగ్గు బ్లాక్ ప్రయివేటీకరణ వలన ప్రయివేటు సంస్థలు లాభపడతాయి. ప్రజలు ఆర్థికంగా దెబ్బతింటారు. అధిక ధరలకు బొగ్గును అమ్మడం వలన విద్యుత్ చార్జీలు పెరుగుతాయి. ప్రజలపై మరింత భారం పడుతుంది. దీనివలన నిత్యావసర ధరలు కూడా పెరుగుతాయి. ప్రధానంగా ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు గురవుతారు. అభివృద్ధి కుంటుపడుతుంది.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొడిశాల రాములు, కార్యదర్శివర్గ సభ్యులు దామల్ల లెనిన్ బాబు, సీఐటీయూ జిల్లా నాయకులు సత్ర పల్లి సాంబశివరావు, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి వల్లూరి వెంకటరత్నం, మున్సిపాలిటీ నాయకులు పల్లపు నాగేశ్వరరావు, గిరిజన సంఘం మండల అధ్యక్షురాలు కోంద్రుగౌరీ, వ్యకాస మండల అధ్యక్షులు బొల్లం రాజు, మధ్యాహ్న భోజనం కార్మికుల సంఘం అధ్యక్షురాలు శైలజ, వెంకన్న, సదానందం, ములకల ఉత్తమ్, గ్రామపంచాయతీ కార్మిక సంఘం నాయకులు రంగా తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైనే సేద తీరుతున్న పశువులు



- ఇబ్బందులు పడుతున్న వాహన దారులు
- పట్టింపు లేని మున్సిపాలిటీ
- యజమానులకు కౌన్సెలింగ్ ఇస్తాం : కమిషనర్

నవతెలంగాణ-ఇల్లందు

గత కొంతకాలంగా ఇల్లందు మెయిన్ రోడ్డుపై ఆవులు, గేదలు సేద తీరుతున్నాయి. కరెంట్ ఆఫీస్ నుండి గోవింద్ సెంటర్ వరకు సాయంత్రం నాలుగు గంటల నుంచి తెల్లవారే దాకా పశువులు రోడ్లపై కూర్చుంటున్నాయి. ఈ పరిస్థితి జగదాంబ సెంటర్ నుండి పాత బస్టాండ్ వరకు ఎక్కువగా ఉంటుంది. కుక్కలు కూడా రోడ్లపై గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. ఇల్లందుకు ఇదొక్కటే ప్రధాన రహదారి. ఈ రోడ్డు మీద నుంచి ఖమ్మం, కొత్తగూడెం, వరంగల్, హనుమకొండ, గోదావరిఖని, భద్రాచలం, మహబూబాబాద్, కారేపల్లి ఇలా అనేక ఊర్లకు బస్సులు తిరుగుతుంటాయి. ఈ రహదారిపై నుండే ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మెన్, తహసీల్దార్, డీఎస్పీ, సీఐ ఇలా అనేక శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల వాహనాలు తిరుగుతూ ఉంటాయి. అయినప్పటికీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వినవస్తున్నాయి.

వచ్చి పోయే వాహన దారులు ఇబ్బందులకు గురౌతున్నారు. రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సాయంత్రానికల్లా ఈ పశువులన్నీ ఎక్కడి నుంచి వస్తున్నాయో అర్థం కావటం లేదని చాలా కాలంగా ఇలా జరుగుతున్నా మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గతంలో బంజరు దొడ్లు ఉండేటివి. రోడ్లమీద సంచరించే ఆవులు, గేదలలను మున్సిపాలిటీ, మండల పరిషత్ సిబ్బంది తీసుకెళ్లి తహసీల్దార్ కార్యాలయం దగ్గరలో ఉన్న బంజర దొడ్లో కట్టేసేవారు. జరిమానా చెల్లించి యజమానులు పశువులను తీసుకెళ్లేవారు. దశాబ్ద కాలం నుంచి బంజర దొడ్లు మూసివేశారు. పశువుల యజమానులు వారు ఇళ్ల వద్ద పెట్టుకోకుండా బయటకు వదిలేయడంవల్లే సమస్య ఉత్పన్నమవుతోంది. మున్సిపాలిటీ, ట్రాఫిక్ అధికారులు సంయుక్తంగా సమస్య పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

బంజరు దొడ్లు ఏర్పాటు చేయాలి

కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శన్ కోరి



రోడ్లపై పశువులు నిత్యం ఉండటంవల్ల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నారు. బంజరు దొడ్లు ఏర్పాటు చేయాలి. యజమానులకు పెనాల్టీ విధించాలి. తద్వారా మున్సిపాలిటీకి ఆదాయం వస్తుందని, ట్రాఫిక్ ఇబ్బందులు తొలుగుతాయి.

ప్రమాదాలకు మున్సిపాలిటీదే బాధ్యత

సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అబ్దుల్ నబీ



ఎప్పుడు చూసినా రోడ్లపైనే పశువులు ఉంటున్నాయి. వీటి మూలంగా ట్రాఫిక్ ఇబ్బందులు, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటికి మున్సిపాలిటీ అధికారులు, పాలకవర్గమే బాధ్యత వహించాలి.

యజమానులకు కౌన్సిలింగ్ ఇస్తాం : కమిషనర్



రోడ్లపై పశువులు ఉండటం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఈ విషయమై కమిషనర్ యాదగిరిని నవతెలంగాణ వివరణ కోరగా స్పందించారు. పశువుల యజమానులను పిలిపించి కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. పరిస్థితిలో మార్పు రాకపోతే పశువులను గోశాలకు తరలిస్తామన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-బూర్గంపాడు

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం మోరంపల్లిబంజరలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మండల పరిధిలోని మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన నగులూరి రామిరెడ్డి(35) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం మృతుడి భార్య వరలక్ష్మి వరి నాటుకు వెళ్లగా ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కౌలు వ్యవసాయం చేస్తూ జీవనం సాగించే రామిరెడ్డి అప్పులు కావడంతో అప్పులు బాధలు తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పునరావాస కేంద్రాలను కొనసాగించాలి

- ఐటీడీఏ పీఓ బి.రాహుల్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలంలోని గోదావరి వరద క్రమంగా తగ్గుతున్నందున వరద ముంపునకు గురి అయిన కొత్త కాలనీ, ఏఎంసీ కాలనీ, అశోక్ నగర్ కాలనీ ప్రజలను వరద పూర్తిస్థాయిలో తగ్గేవరకూ పునరావాస కేంద్రాల్లోనే ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. ఆదివారం ముంపుకు గురి అయిన కొత్త కాలనీ, విస్తా కాంప్లెక్స్‌లోని స్లూయిస్ పాయింట్ను ఆయన పరిశీలించారు. స్లూయిస్ పాయింట్ నుండి గోదావరిలోకి వరద నీరు వెళ్లే మార్గాన్ని ఆయన పరిశీలించారు. అలాగే కొత్త కాలనీ వద్ద దగ్గర ఉన్న బురద నీటిని గోదావరిలోకి వదిలే ప్రక్రియను ఆయన పరిశీలించిన అనంతరం మాట్లాడారు. గోదావరి వరదలు క్రమంగా తగ్గుతూ వస్తుందని కానీ వరద అనేది ఎప్పుడు వస్తుందో తగ్గుతుందో చెప్పలేమని వరద పూర్తిస్థాయిలో తగ్గేవరకు సిడబ్ల్యుసి అధికారులు ఎప్పటికప్పుడు స్లూఈజ్ పాయింట్ దగ్గర మోటార్లు ద్వారా వరద నీటిని గోదావరిలోని వదులుతూ ఉండాలని అన్నారు. సిబ్బంది 24 గంటలు గోదావరి వరద ప్రవాహాన్ని కనిపెడుతూ ఉండాలని అన్నారు. నన్నపనేని మోహన్ పాఠశాలలో ఉంటున్న వరద బాధితులకు అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ అంకిత్, సీడబ్ల్యూ సీడీఈ మస్తానావు, ఏఈ వెంకటేశ్వర్లు, గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ అధికారికి ఆత్మీయ సన్మానం

నవతెలంగాణ-ఇల్లందు



ఈ నెలలో పదవీ విరమణ పొందనున్న జీఎం (ఎన్విరాన్మెంట్) కార్పొరేట్ జెవియల్ గణపతిను సింగరేణి ఇల్లందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ ఆధ్వర్యంలో ఆదివారం ఏరియా అధికారులు శాలువా పుష్ప గుచ్ఛం, జ్ఞాపిక అందజేసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు ఏరియా అధికారులకు ఎన్విరాన్మెంట్ పై ప్రత్యేక పవర్ పాయింట్ ద్వారా సింగరేణి సంస్థ నందు అవలంబిస్తున్న విధానాలను తెలియజేశారు. తదుపరి ఏరియా జీఎం జాన్ ఆనంద్ మాట్లాడారు. వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యస్ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, జేకే ప్రాజెక్ట్ ఆఫీసర్ బొల్లం వెంకటేశ్వర్లు, కోయగూడెం ప్రాజెక్ట్ ఆఫీసర్ వి.శ్రీనివాస్, ఏజీఎం(ఐఈ) గిరిధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతతో పని చేస్తేనే ప్రజా సమస్యలకు పరిష్కారం

- జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో కూనంనేని

నవతెలంగాణ-కొత్తగూడెం



అధికారులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు బాధ్యతతో, సమన్వయంతో పనిచేస్తేనే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిస్కారం లభిస్తుందని, ప్రభుత్వ సేవలపట్ల ప్రజల్లో విశ్వాసం కలుగుతుందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం కొత్తగూడెం క్లబ్‌లో జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జెడ్పిచైర్మెన్ కంచర్ల చంద్రశేఖర్ రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన కూనంనేని మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు, సమస్యలు పరిష్కరించేందుకు సమిష్టిగా కృషిచేయాల్సిన భాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ, వ్యవసాయ శాఖా, మున్సిపల్, గ్రామపంచాయతీ శాఖల పారిశుద్ధ్య విభాగాలు, అటవీశాఖలు కీలకమైనవని ఈ శాఖలు ప్రజాక్షేత్రంలో ఉండేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సీతారామ ప్రాజెక్టు డిజైన్ మార్చడం ద్వారా జిల్లా రైతాంగానికి సాగునీటి అవసరాలు తీరతాయనే విషయాన్ని పలుమార్లు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసికెళ్ళానని, ఈ విషయంలో వెనక్కుతగ్గేదిలేదన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే పరిస్థితులు ఉన్నందున వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉండాలని, పోడు భూముల విషయంలో అటవీశాఖ సంయమనం పాటించాల్సివుందన్నారు. మున్సిపల్, జీపి శాఖలు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం పాలక మండలి సభ్యులు కూనంనేని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

సేవకు పరిధి ఎక్కువ : కలెక్టర్

రాజకీయ నాయకులకు ప్రజా సేవ చేయడానికి సమయం ఎక్కువగా ఉంటుందని, అధికారులకు, ఉద్యోగులకు నిర్ణీత సమయంలోనే సేవలందించాల్సిన ఉంటుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. అనేక సమస్యల మీద ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలని కోరారు. జిల్లాలో రైతులు మునగ సాగు చేయాలని కోరారు.మునగ సాగువలన తక్కువ పెట్టుబడి, తక్కువ కాలంలో అధిక లాభం వస్తుందని వివరించారు.అందుకు కావల్సిన ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు.

గంజాయి నిర్మూలనకు సహకరించాలి : ఎస్పీ

రాష్ట్రంలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అధిక మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని, గంజాయిని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు ప్రజా ప్రతినిధులు పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఎస్పీ రోహిత్ రాజు కోరారు. ప్రజా ప్రతినిధులు వారి పరిధిలోని గ్రామాలు, పట్టణాలలో గంజాయి గంజాయి నిర్మల కోసం యువత, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, వారికి పోలీసులు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య, వైరా ఎమ్మెల్యే రాములు నాయక్, డిసిసిబి చైర్మెన్ కొత్వాల శ్రీనివాసరావు, పలుశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జెడ్పీ చైర్మెన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు దంపతులను జెడ్పీ సిబ్బంది, పలువురు ఘనంగా సన్మానించారు.

ఎంపీఈఓ నియామకం...

- ప్రజల అవస్థలు వేళ బదిలీలకు స్పందన

నవతెలంగాణ-అశ్వారావుపేట

ప్రజల అవస్థలు వేళ బదిలీలు అనే శీర్షికన శనివారం నవతెలంగాణలో ప్రచురితం అయిన కథనానికి అధికారుల నుండి స్పందన లభించింది. ఇక్కడ ఎంపీఈఓ సీతారామరాజు దీర్ఘకాలిక సెలవుపై వెళ్ళిన సంగతి పాఠకులకు విదితమే. ఈ క్రమంలో దుమ్ముగూడెం ఎంపీఈఓ ఎస్.ప్రసాద్ రావును అశ్వారావుపేటకు 15 రోజులు పాటు ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన శనివారమే ఇక్కడ విధుల్లో చేరారు. ఇదిలా ఉండగా నియోజక వర్గానికి కేంద్రం అయిన అశ్వారావుపేట ఎంపీడీఓ సైతం ఈ నెల 31 నే పదవీవిరమణ చేయనున్నారు. ఈయన స్థానంలో అయినా పూర్తి కాల పరిపాలనా పరం అయిన అనుభవం ఉన్న సీనియర్ అధికారిని రెగ్యులర్ నియమించాలని ప్రజాప్రతినిధులు జిల్లా ఉన్నతాధికారులను కోరుతున్నారు. అంతేగాకుండా మండలంలోనే ఏకైక మేజర్ పంచాయతీకి సైతం కార్యదర్శి లేకపోవడంతో పాలన కుంటు పడే అవకాశం ఉందని వాపోతున్నారు. ఇక్కడ పని చేసిన కార్యదర్శి హరిక్రిష్ణ ఇటీవల బదిలీల్లో ఖమ్మం జిల్లాకు బదిలీ పై వెళ్ళారు. ఈయన స్థానంలోనూ మేజర్ పంచాయతీకి కార్యదర్శిని నియమించాలని పంచాయతీ వాసులు కోరుతున్నారు.

ఇంజనీరింగ్ కాలేజీకి పూర్వవైభవం...

యూనివర్సిటీగా మార్చేందుకు ప్రతిపాదనలు

- త్వరలో బీటెక్ ఫర్ వర్కింగ్ ప్రొఫెషనల్ కాలేజీ
- సీఎస్ఆర్ నిధులతో పలు అభివృద్ధి పనులు

నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకతీయ యూనివర్సిటీ (కేఎస్ఎం) ఇంజనీరింగ్ కళాశాలకు పూర్వ వైభవం రానుంది. గత కొంతకాలంగా నిరాధారణకు గురైన కళాశాల నేడు పూర్వ వైభవాన్ని సంతరించుకునేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్లకు వినతి పత్రాలు అందజేశారు. ప్రభుత్వాలు సుముఖత చూపడంతో రానున్న రోజుల్లో గత వైభవాన్ని సంతరించుకునే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయని తెలుస్తుంది.

కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైనింగ్ కళాశాల (కేఎస్ఎం) కాలేజీ పేరుగాంచిన మైనింగ్ కాలేజ్, గత కొంత కాలంగా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కాకతీయ యూనివర్సిటీ కళాశాలగా రూపాంతరం చెందింది. ఇందులో చదువుకున్న అనేకమంది విద్యార్థులు వివిధ రంగాల్లో ఇంజనీరింగ్ మేధావులుగా ఘనత సాధించారు. గత కొన్ని ఏళ్లగా నీలి నీడలు కమ్ముకున్న కళాశాల ఇప్పుడు పూర్వ వైభవాన్ని సంతరించుకునేందుకు కృషి జరుగుతుంది. అనేక ఒడుదుడుకులను ఎదుర్కొన్న కళాశాల కొత్త హంగులు కూర్చుకుంటుంది.

మైనింగ్ యూనివర్సిటీ చేయాలి

యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉన్న ఈ కళాశాల ఇంజనీరింగ్ కళాశాలను మైనింగ్ యూనివర్సిటీగా పునరుద్ధరించాలని అనేక దఫాలుగా ప్రభుత్వానికి, యూనివర్సిటీకి వినతులు అందజేసిన విషయం పాఠకులకు విధితమే. టెక్నికల్ యూనివర్సిటీగా చేయాలని ప్రభుత్వం యోచిస్తుంది. తెలంగాణ దక్షిణ ప్రాంతానికి టెక్నికల్ యూనివర్సిటీ లేనందున ఈ ప్రాంతంలో ఈ యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం పూనుకోవాలని మేధావులు కోరుతున్నారు. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బిపిఎల్, కేటీపీఎస్, హెవీ వాటర్ ప్లాంట్, ఎన్ఎండిసీ, నవభారత్, సింగరేణి లాంటి భారీ పరిశ్రమలు ఈ జిల్లాలోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో టెక్నికల్ యూనివర్సిటీ పెట్టాలని గతంలో ప్రభుత్వం నుండి వినిపించింది. కానీ, మైనింగ్ యూనివర్సిటీగా ఇప్పటికే ప్రతిపాదనలు పలు దఫాలుగా ప్రభుత్వానికి పంపడం జరిగింది. ఏది ఏమైనా ఈ ఇంజనీరింగ్ కాలేజి యూనివర్సిటీగా రూపాంతరం చెందితే తెలంగాణ ప్రాంతంలోనే అనేకమంది విద్యార్థులకు నాణ్యమైన ఇంజనీరింగ్ విద్య అందే అవకాశం మెండుగా ఉంది. సుమారు 390 ఎకరాల విస్తీర్ణంలో కళాశాల ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని కళాశాల కంటే ఈ కళాశాలను యూనివర్సిటీగా మారేందుకు అనువుగా ఉంటుందని పలువురు భావిస్తున్నారు.

కబ్జాకు గురవుతున్న కళాశాల భూమి...

యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాలేజీ సుమారు 390 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉంది. కళాశాల ఖాళీ స్థలం భూ కబ్జాల పాలవుతుంది. ఈ విషయంలో కళాశాల యాజమాన్యం అనేక పర్యాయాలు కబ్జాదారులకు నోటీసులు జారీ చేసినప్పటికీ, భూ కబ్జా ఆగడం లేదని అధికారులు అంటున్నారు. నూతనంగా నిర్మించిన కలెక్టరేట్, మెడికల్ కాలేజీ, ఎస్పీ కార్యాలయానికి సుమారు 80 ఎకరాల వరకు ప్రభుత్వం కేటాయించింది. మెడికల్ కాలేజీకి 30 ఎకరాలు, జిల్లా కలెక్టరేట్ 25 ఎకరాలు, ఎస్పీ కార్యాలయానికి 25 ఎకరాలు చొప్పున మొత్తంగా 80 ఎకరాలు కేటాయించడం జరిగింది. వీటితోపాటు ఇతర సాధారణ ప్రజానీకం కళాశాల భూములను కబ్జా చేస్తున్నారని అధికారులు చెబుతున్నారు.

బీటెక్ ప్రొఫెషనల్ కోర్స్....

కళాశాలలో బీటెక్ ఫర్ వర్కింగ్ ప్రొఫెషనల్ బీటెక్ ప్రొఫెషనల్ నైట్ కాలేజ్ ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు



కూడా వచ్చినట్టు తెలుస్తుంది. ఇందులో మూడు కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. డిప్లమా పూర్తి చేసి ఉద్యోగాలు పొందిన వారికి అనుకూలంగా ఉండేందుకు, వారు బీటెక్ ఇంజనీరింగ్ పూర్తి చేసే విధంగా వారికి ఉపయోగపడేందుకు ఈ కోర్సును ప్రవేశ పెడుతున్నారు.

పారిశ్రామిక నిధులు...

జిల్లాలోని వివిధ పరిశ్రమలు వారి సిఎస్ఆర్ నిధుల నుండి కాలేజీ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు నిధులు కేటాయించడం జరిగింది. ఇందులో కేటీపీఎస్ రూ.1 కోటి నిధులను అందజేసింది. ఈ నిధులతో కాలేజికి కావాల్సిన ప్రాక్టికల్ లాబ్స్ ఆధునికరించారు. సింగరేణి పరిశ్రమ నుండి రూ.2.97 లక్షల నిధులతో అకడమిక్ బ్లాక్, మెస్ భవణం నిర్మిస్తున్నారు. నవభారత్ పారిశ్రామిక సంస్థను సిఎస్ఆర్ నిధులు కేటాయించాలని కళాశాల ప్రిన్సిపాల్ లేఖలు రాశారు. వారు కూడా కొంత నిధిని ఏర్పాటు చేసే ముందుకు వచ్చినట్లు సమాచారం. దీంతో కళాశాల మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు కృషి



కొత్తగూడెం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. పూర్వ విద్యార్థులతో సమ్మేళనం ఏర్పాటుచేసి, విద్యార్థుల్లో స్ఫూర్తిని, ప్రేరణ నింపుతున్నాం. జిల్లాలోని పలు పరిశ్రమలు సిఎస్ఆర్ పాలసీ కింద నిధులు కేటాయి చడంతో కళాశాల ఆధునీకరణ పనులు, అవసరమైన భవనాల నిర్మాణాలు చేస్తున్నాం. ఈ కాలేజీని మైనింగ్ యూనివర్సిటీగా చేసేందుకు పలువురు ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చాము. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం అందజేశాం. తనవంతు కృషి చేస్తానని, ప్రభుత్వంకి విన్నవిస్తానని తెలిపారు. నేను స్థానికున్ని కావడంతో ఈ ప్రాంత అభిమానంతో కాలేజిని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాను. -

- ప్రిన్సిపాల్ జగన్మోహన్ రాజు

మూఢ నమ్మకాలపై విన్నూత కార్యక్రమం

- కల్పిత పాత్రలతో అచ్యుతాపురం గ్రామంలో పోలీసుల అవగాహన

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ప్రజల్లో ఉన్న మూఢనమ్మకాలపై అపోహలు తొలగించేందుకు దుమ్ముగూడెం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విన్నూత రీతిలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. మండలంలో ఓ వ్యక్తి భూత వైద్యం పేరుతో అమాయక ప్రజలను మోసం చేస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. ఆలోచన వచ్చింది తడువుగా దుమ్ముగూడెం సీఐ బొడ్డు అశోక్ అమాయక గిరిజన ప్రజలు భూత వైద్యం పేరుతో మోసపోతున్నారని గ్రహించి ప్రజలకు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించేందుకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ఆదివారం అచ్చుతాపురం గిరిజన గ్రామంలో కల్పిత పాత్రలతో గ్రామంలో భూత వైద్యుడు చేసే మోసాలకు ప్రజలు తమ విలువైన సమయంతో పాటు డబ్బు ఎలా పోగొట్టుకుంటున్నారో అనే దానిపై భూత వైద్యుడు వేషధారణలో ఉన్న ఓ వ్యక్తిని ఇంటింటికి తిప్పుతూ అతను చేసే మోసాలు వారికి తెలిసేలా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు భూత వైద్యుడు చేస్తున్న మోసాలను ప్రత్యక్షంగా గ్రామస్తులకు తెలపడంతో పాటు వైద్యం పేరుతో గ్రామాల్లోకి ఎవరైనా వ్యక్తులు వస్తే సమాచార ఇవ్వాలని తెలిపారు. మూఢనమ్మకాలపై అవగాహన కల్పించే విధంగా పోలీసులు తీసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దుమ్ముగూడెం పోలీసుల విన్నూత కార్యక్రమానికి పోలీస్ శాఖ జిల్లా ఉన్నతాధికారులతో పాటు మండల ప్రజల నుండి ప్రశంసలు అందుతున్నాయి.

ఉపాధ్యాయులు విద్యార్థులలో మానవీయ విలువలను పెంపొందించాలి

నవతెలంగాణ-మణుగూరు

ఉపాధ్యాయులు, విద్యార్థులలో మానవీయ విలువలు, సమాజంలో ఇతరుల పట్ల ఎలా మెలగాలి వంటి సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించాలని సీఐ సతీష్ కుమార్ అన్నారు. ఆదివారం లయన్స్ క్లబ్ మణుగూరు రెండు రోజుల టీచర్ల ట్రైనింగ్ ప్రోగ్రాం క్వెస్ట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మణుగూరు లయన్స్ క్లబ్ సమాజసేవతో పాటు సామాజిక చైతన్య కార్యక్రమాలను నిర్వహించడం ఎందరికో స్ఫూర్తిదాయకం అన్నారు. అనంతరం 30 మంది టీచర్లకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్, ప్రతిభ చూపినటువంటి టీచర్లకు ప్రత్యేక బహుమతులు, టీచర్లందరికీ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో లైయన్స్ క్లబ్ మణుగూరుప్రెసిడెంట్, నల్లగట్ల సత్య ప్రకాష్, సెక్రటరీ షేక్ మీరా హుస్సేన్, చార్టర్ ప్రెసిడెంట్ పిల్లర్ శెట్టి హరిబాబు, సభ్యులు గాజుల పూర్ణచంద్రరావు, గాజుల రమేష్, చంద్రమోహన్, వెంకటేశ్వర్లు, ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల 30 మంది టీచర్లు పాల్గొన్నారు.

9న ఆదివాసీ దినోత్సవం

దమ్మపేట : ఆగస్టు 9వ తేదీన అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంను ఘనంగా నిర్వహించాలని నియోజకవర్గ ఆదివాసీ నాయకులు వాడె వీరాస్వామి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం దమ్మపేటలో సోయం రామ్మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో ఆదివాసీ ప్రజాప్రతినిధులు, ఆదివాసీ పెద్దలు, ఉద్యోగ సంఘాల నాయకులు, ఆదివాసీ నాయకులు పాల్గొనాలన్నారు. అదే విధంగా ప్రభుత్వం 9న సెలవు రోజుగా ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు యాట్ల మంగారావు, యాట్ల శివ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల వాచ్ మెన్ పై చర్యలు తీసుకోవాలి

- విద్యార్థుల తల్లిదండ్రులు

దుమ్ముగూడెం : ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో వాచ్ మెన్‌గా విధులు నిర్వహిస్తున్న శివ, చైతన్య అనే వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఏకలవ్య పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో మా పిల్లలను చూడటానికి వెళ్తే అక్కడ ఉన్న వాచ్ మెన్ శివ, లేడి వాచ్ మెన్‌గా ఉన్న చైతన్య అనేవాళ్ళ మమ్మల్ని ఇష్టానుసారంగా అనవసరమైన పదజాలంతో కించపరిచినట్టు మాట్లాడారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఐటీడీఏ పీవో తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి : ఐద్వా

కొత్తగూడెం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఐద్వా పట్టణ కార్యదర్శి సందకూరి లక్ష్మీ అన్నారు. ఆదివారం టౌన్ అధ్యక్షురాలు అప్పికట్ల జయశ్రీ అధ్యక్షతన ప్రగతి నగర్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి మూసే ఎత్తటం లేదన్నారు. గ్యాస్ రూ.500 రూపాయలకే ఇస్తామని, బ్యాంకు ఖాతాలో చేరుతాయని చెప్పారు. ప్రతి పేద మహిళకి నెలకి రూ.2500లు ఇస్తానని ఇంతవరకు వాటి యూసే లేదని, గృహలక్ష్మి పథకం కింద రూ.5లక్షలు ఇస్తామని వాగ్దానాలు చేసి ఇంతవరకు మహిళలకు సంక్షేమ పథకాలు అందడం లేదని వాపోయారు. అర్హులైన వారికి కొత్త పింఛన్లు, పేద లందరికీ రేషన్ కార్డులు కొత్తవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకురాలు ఆలేటి లక్ష్మి, అంబాల దుర్గమ్మ, సైనస్, జయ, సన, గౌస్య, రేష్మ సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ కోల్‌తో కార్మికుల ప్రాణాలకు ముప్పు

- నివారణ చర్యలు చేపట్టని యాజమాన్యం

నవతెలంగాణ-మణుగూరు



సింగరేణి ఏరియా ఓసీ 4 నుంచి కేసీహెచ్‌పీకి నిరంతరం లారీల ద్వారా రవాణా చేస్తున్న ఫైర్ కోల్ బంకర్‌లో అన్ లోడ్ చేసే సమయంలో దట్టమైన పొగ వెలువడుతుందని ఆ పొగ కేసీహెచ్‌పీ కార్మికులకు ప్రాణ సంకటంగా మారిందని నివారణా చర్యలు చేపట్టవలసిన అధికారులు పట్టింపు లేనట్టుగా వ్యవహరిస్తున్నారు. దీని వల్ల కార్మికుల విలువైన ప్రాణాలు అర్ధయుషతో ముగిసే ప్రమాదం ఉందని కార్మికులు భయపడుతున్నారు. కేసీహెచ్‌పీలో వెలువడే దుమ్ము, ధూళితోనే కార్మికులు ఓ పక్క సతమతం అవుతున్నారు. దమ్ము, ధూళితో పాటు ఫైర్ కోల్ ద్వారా వెలువడే పొగ పీల్చడం వల్ల కార్మికులు శ్వాసకోశ వ్యాధులకు గురై, నిమ్ము, ఆయాసంతో ఊపిరితిత్తులు దెబ్బతిని గుండెజబ్బుల బారిన పడి విలువైన ప్రాణాలను పోగొట్టుకునే ప్రమాదం ఉందని కార్మిక సంఘాలు హెచ్చరిస్తున్నాయి. కార్మిక ప్రయోజనాలను కాపాడతామని కార్మిక ఓట్ల ద్వారా గెలిచిన కార్మిక సంఘాలు కార్మిక ఆరోగ్య శ్రేయస్సుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని గొప్పలు చెప్పే యాజమాన్యం ఆ దిశగా అడుగులు వేయడం లేదని కార్మికులు తెలిపారు. ఇకనైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి ఫైర్ కోల్ ద్వారా వెలువడే దట్టమైన పొగ వెలువడకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టి కార్మిక ప్రాణాలకు అండగా నిలవాలని కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు కోరుతున్నారు.

వరద బాధిత కుటుంబాలకు రూ.20వేలు పరిహారం ఇవ్వాలి

- పునరావాస కేంద్రంలోని పిల్లలకు పాలు, రొట్టె అందించాలి
- ముంపు బాధితులను పరామర్శించిన సీపీఐ(ఎం) బృందం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



వరద బాధిత కుటుంబాలకు నష్టపరిహారం రూ.20వేలు ఇవ్వాలని, పునరావాస కేంద్రంలో పిల్లలకు పాలు, రొట్టె అందించాలని సీపీఐ(ఎం) పార్టీ పట్టణ కమిటీ బృందం తెలిపింది. ఆదివారం భద్రాచలం పట్టణం నన్నపనేని స్కూల్ నందు ఏర్పాటు చేసిన వరద బాధితుల పునరావాస కేంద్రాన్ని పార్టీ బృందం పరిశీలించింది. పునరావాస కేంద్రంలోని వసతులు భోజనాలు ఏర్పాట్లు పరిశీలించారు. వరద బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బి.నర్సారెడ్డి, పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామిలు మాట్లాడారు. ప్రతియేటా ప్రజలకు కాలనీవాసులకు వరద ముంపు తిప్పలు తప్పడం లేదని అన్నారు. భద్రాచలం పట్టణం గోదావరి వరద ముంపుకు గురికాకుండా శాశ్వత పరిష్కారం చూపే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కరకట్ట స్లూఈజ్‌ల లీకులు, వర్షపు నీరు బ్యాక్ వాటర్‌తో పట్టణంలోని అశోక్ నగర్, కొత్త కాలనీ, ఏఎంసీ కాలనీలు ముంపుకు గురైనాయని అన్నారు.



పట్టణంలోకి చుక్క నీరు రానివ్వం అని ప్రకటించిన మంత్రి తుమ్మలకి నీట మునిగిన రెండు కాలనీలు కనిపించలేదా అని ప్రశ్నించారు. అశోక్ నగర్, కొత్త కాలనీ స్లూఈజ్ వద్ద ఏర్పాటు చేసిన 50హెచ్‌పీ మోటార్లు రెండు మోటార్లు పనిచేయడం లేదని ఇప్పటివరకు అవి మరమ్మతులకు నోచుకోలేదని అన్నారు. ఆంధ్ర-తెలంగాణ భూభాగం అనే పేరుతో కరకట్ట లాకులు లీక్ అవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం సరైనది కాదని వారు అన్నారు. పురావస కేంద్రంలో గదులలో ఫ్యాన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్ బాబు, పట్టణ కమిటీ సభ్యులు నకిరేకంటి నాగరాజు, సంద్ర భూపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

లెఫ్ట్ ఓవర్ ప్రమోషన్స్ లిస్ట్ తయారీలో జిల్లా విద్యాశాఖ నిర్లక్ష్యం

- ఆర్ఓఆర్ (రూల్ అఫ్ రిజర్వేషన్) పాటించక పోవడంతో నష్టపోతున్న ఉపాధ్యాయులు
- టీఎస్‌యూటీఎఫ్ భద్రాద్రి జిల్లా కమిటీ ఖండన

నవతెలంగాణ-కొత్తగూడెం

స్కూల్ అసిస్టెంట్, (ఎస్ఏ) ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల (పీఎస్‌హెచ్ఎం) ప్రమోషన్‌లో రెండు లేక మూడు పోస్టులలో ప్రమోషన్స్ వచ్చిన వారివలన మిగిలిపోయిన ఖాళీల్లో లెఫ్ట్ ఓవర్ ప్రమోషన్స్ ఇస్తున్న సందర్భంలో సీనియార్టీ లిస్టు, వేకెన్సీ లిస్ట్ తయారు చేస్తున్న క్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి గందరగోళం సృష్టిస్తున్నారని టీఎస్‌యూటీఎఫ్ భద్రాద్రి జిల్లా కమిటీ తీవ్రంగా విమర్శించారు. ముందు ఒక లిస్టు ప్రకటించి తర్వాత మార్పులతో రూల్స్‌కి విరుద్ధంగా మార్పులతో మరో లిస్ట్ తయారు చేశారన్నారు. ప్రమోషన్స్ లిస్ట్ తయారు చేయడంలో ఇష్టం వచ్చినట్లుగా మార్పులు చేస్తున్నారని, జాయినింగ్ డేట్‌తో ఒకసారి, డీఎస్సీ ప్రాతిపదికగా మరోసారి, మార్కులతో ఒకసారి, పేర్లు లేకుండా చేసి ఒకసారి, రోస్టర్ పాయింట్లు తప్పులతో ఒకసారి ఒక సబ్జెక్టులోనూ, మరొకసారి మరో సబ్జెక్టులోనూ తేడాలతో లిస్టు తయారు చేస్తున్నారని విమర్శించారు. ఎవరి కోసం ఇలా చేస్తున్నారో అర్థం కావటం లేదని, పీఎస్ హెచ్ఎం, సోషల్ స్టడీస్ (ఎస్ఎస్) విభాగంలో అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ "నో కాండిడెట్ అవలబుల్.." అని లిస్టులు పెట్టారని మండి పడ్డారు. అందువలన ఎస్సీ సామాజిక వర్గ ఉపాధ్యాయులకు నష్టం జరిగిందన్నారు. ఒకసారి విల్లింగ్ తీసుకున్న తర్వాత 1:1 తయారు చేసిన లిస్టులు ప్రదర్శించాలి. ఆ తరువాతనే ఫైనల్ లిస్ట్‌లు నిర్ధారణ చేయాలి. లిస్టులను బయట పెట్టకుండా రహస్యంగా ఎందుకు ఉంచుతున్నట్లు..?, జిల్లాలో లిస్టులు ప్రదర్శించ కుండా డైరెక్ట్‌గా డీఎస్సీకి పంపడంలో మతలబు ఏమిటి..?, లిస్ట్ మార్చాల్సిన అవసరం ఏమిటి..? ఎలా మారుస్తారని ప్రశ్నిస్తున్నారు.

ఉపాధ్యాయులను గందరగోళానికి గురిచేస్తున్న జిల్లా విద్యాశాఖ

వేకెన్సీ లిస్టులను పదే పదే మార్చడం జరిగింది. ప్రత్యేకంగా కొంతమందికి లబ్ది చేయటం కోసం పోస్టులను ఓపెన్ చేసినట్లుగా ఉంది. ఇలా ఉపాధ్యాయుల జీవితాలతో ఆడుకోవడం ఎంత వరకు సమంజసం..? ఏళ్ల తరబడి ప్రమోషన్ల కోసం ఎదురు చూసి చివరి నిమిషంలో జరిగిన ఈ అన్యా యంతో ఉపాధ్యాయులు ఎంతో వేదనకు గురి అవుతున్నారు. ఆందోళన చెందుతున్నారు. లెఫ్టఓవర్‌లో ఏర్పడిన లిస్టులు పలుకుబడి లిస్టులు అయినాయి.

తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

అన్యాయం జరిగిన టీచర్స్‌కు న్యాయం చేయాలని రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బి.కిషోర్ సింగ్, ఎన్.కృష్ణ డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయాలన్నీంటిపై కలెక్టర్‌కి, రాష్ట్ర విద్యాశాఖాధికారులకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఫైబర్ గోతులతో పంచాయతీ నీటి పైపులు ధ్వంసం

- కలుషితమవుతున్న తాగునీరు

నవతెలంగాణ-అశ్వారావుపేట



ఎయిర్‌టెల్ ఆప్టిక్ ఫైబర్ కోసం తీస్తున్న గోతులతో పంచాయతీ నీటి సరఫరా పైపులు ధ్వంసం అవుతున్నాయి. ఈ గోతులు లోతుల్లో ఎడతెరిపి లేని వానలకు నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. వావన దారులు ప్రమాదాలకు లోను అయ్యే అవకాశం ఉంది. మండల పరిధిలోని గుర్రాల చెరువు నుండి అశ్వారావుపేట వరకు ఎయిర్టెల్ ఫైబర్ కేబుల్ ఏర్పాటు కోసం తారు రోడ్ సైడ్ బర్మ్‌లో సుమారు ఇరవై గోతులు తీసారు. ఆ గోతులు కొన్ని పూడ్చారు, మరి కొన్ని గోతులు అస్సలు పూడ్చనే లేదు. ఇంకొన్ని అసంపూర్తిగా వదిలేసారు. సుమారు 40 రోజుల నుండి వీళ్ళు పనులు నిర్వహిస్తున్నారు. ఈ పనులతో ఊరి మధ్యలో పంచాయతీ నీటి సరఫరా పైప్ లైన్ మూడు చోట్ల ధ్వంసం అయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధ్వంసం అయిన చోట మరమ్మతులు చేసినప్పటికీ అక్కడ నీరు లీక్ అవుతున్నాయని, దీంతో తాగు నీరు కలుషితం అవుతుందని వాపోతున్నారు. ఫైబర్ ఏర్పాటు కోసం జాయింట్ దగ్గర మార్జిన్ మట్టి కొట్టుకుపోయి రోడ్డు చాలాచోట్ల ధ్వంసం అవుతుంది. మారుతీ కాలనీ నుండి దొంతికుంట చెరువు వరుకు మార్జిన్ మొత్తం మట్టి తొలిగించి పూడ్చి నా రోలింగ్ చేయని కారణంగా మట్టి వర్షానికి కొట్టుకుపోయింది.

చర్యలు తీసుకుంటాం : ఇన్‌చార్జి కార్యదర్శి స్వతంత్ర తేజ్

పనులు ప్రారంభించారు...ఎడతెరిపిలేని వానలు సంభవించాయి. ఈ విషయం కంపెనీ ప్రతినిధులతో మాట్లాడాను. చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరిస్తాను.




ముదిగొండ అమరవీరుల స్ఫూర్తితో పేదలకు భూమి దక్కేవరకూ పోరాటం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు

నవతెలంగాణ-కొత్తగూడెం

అర్హులైన పేదలకు భూమి దక్కేవరకూ పోరాడటమే ముదిగొండ భూ పోరాట అమరవీరులకు ఇచ్చే ఘనమైన నివాళి అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు అన్నారు. ముదిగొండ అమరవీరుల 17వ వర్ధంతి కార్యక్రమం స్థానిక మంచికంటి భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ముందుగా అమరవీరుల స్థూపానికి పార్టీ సీనియర్ నాయకులు వై.వెంకటేశ్వరరావు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బాలరాజు మాట్లాడుతూ 17 సంవత్సరాల క్రితం పేదలకు ఇల్లు స్థలాలు కావాలని రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ(ఎం) నిర్వహించిన పోరాటాలు ఎంతోమంది పేదలను భూమి కోసం ప్రభుత్వాల మీద ఒత్తిడి తీసుకొచ్చేలా చేసాయని గుర్తు చేశారు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి హెచ్చరికలు లేకుండా పాశవికంగా ముదిగొండలో కాల్పులు జరిపిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాగించిన నరమేధానికి ఏడుగురు అమరవీరులు బలయ్యారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇల్లు అర్హులైన వారందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, భూక్య రమేష్, పట్టణ కమిటీ సభ్యులు సందకూరి లక్ష్మి, జునుమాల నగేష్, నందిపాటి రమేష్, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి కూరపాటి సమ్మయ్య, నాయకులు ఊపేశ్, సూరం ఐలయ్య, చంద్రన్న, రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఇల్లందు : ఉద్యమంలో మృతి చెందిన ముదిగొండ అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఐ(ఎం) మండల పార్టీ కార్యదర్శి అబ్దుల్ నబి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ముదిగొండ అమరవీరుల 17వ వర్ధంతిని పురస్కరించుకొని పార్టీ కార్యాలయం ఎదుట ఆదివారం నివాళులర్పించారు. ఆలేటి కిరణ్ అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, వాసం రాము, అభిమన్యు, శ్రీను వెంకటేశ్వర్లు, సాధిక తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | జూలై 29, 2024 | www.navatelangana.com

కలాం ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలి : డిప్యూటీ సీఎం భట్టి



నవతెలంగాణ-ఖమ్మం రూరల్

మాజీ రాష్ట్రపతి, భారతరత్న అబ్దుల్ కలాం ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు.హైదరాబాదులోని ప్రజాభవన్ లో అబ్దుల్ కలాం 9వ వర్ధంతి సందర్భంగా వైబ్రెట్ ఆఫ్ కలాం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ సినీ సంగీత దర్శకులు చరణ్ అర్జున్ రూపొందించిన అబ్దుల్ కలాం స్ఫూర్తి గీతం కలాం ఇజం గీతాన్ని భట్టి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడారు.నేటి యువత కలాంను ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడిచి,దేశాన్ని అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేయాలన్నారు.కలాం ఆశయ సాధనకు కృషి చేస్తున్న వైబ్రెంట్స్ ఆఫ్ కలాం వ్యవస్థాపకులు నల్లమోతు విజయ్ కలాంను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ బాధ్యులు తోళ్ల శ్రీను, ఓరుగంటి రంజిత్, జహీర్ భాషా, కిషోర్, శివ, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఉడికీ ఉడకని అన్నం.. నీళ్ల చారు...!

- పునరావాస కేంద్రాల్లో వరద బాధితుల ఆందోళన



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఉడికీ ఉడకని అన్నాన్ని వడ్డిస్తూ గోదావరి నీళ్లకంటే దారుణమైన చారును పోస్తూ వరద బాధితుల పట్ల భద్రాచలం ప్రభుత్వ అధికారులు అత్యంత కర్కాషంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ పునరావాస కేంద్రంలోని వరద బాధితులు ఆందోళన బాట పట్టారు. గోదారమ్మ ఉగ్రరూపానికి పట్టణానికి చెందిన అశోక్ నగర్, కొత్త కాలనీ, ఏఎంసీ కాలనీలకు చెందిన సుమారు 125 కుటుంబాలు ఇల్లూ, వాకిలి వదిలేసి ప్రభుత్వాన్నే నమ్ముకొని పునరావాస కేంద్రాలలో తలదాచుకుంటున్నారు. బాధితుల పట్ల ప్రభుత్వ అధికారుల తీరుతో వారు ఆందోళన చేపట్టారు. పునరావాస కేంద్రాలలో ఉదయం అల్పాహారంతో పాటు చిన్నారులకు పాలు, రొట్టెలు, నాణ్యమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్, ఐటీడీఏ పీవో తదితర ఉన్నతాధికారులతో పాటు మంత్రులు సైతం ఆదేశించినా భద్రాచలం అధికారుల తీరు మారడం లేదు.పాలు, రొట్టెల మాట దేవుడెరుగు, మధ్యాహ్నం భోజనం 2, 3 గంటల సమయానికి తీసుకురావడమే కాకుండా ఉడికీ, ఉడకని అన్నంతో పాటు నీళ్ల చారును పోసి చేతులు తెలుపుకుంటున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) పట్టణ కమిటీ సభ్యులు పునరావాస కేంద్రాలకు వెళ్లి బాధితుల ఆవేదనను విన్నారు. వెంటనే ఉన్నతాధికారులకు దృష్టి తీసుకువెళ్లారు. ఇటువంటి ఘటనలు మళ్లీ జరగకుండా చూస్తామని వారు పార్టీ బృందానికి హామీ ఇచ్చారు. వరద బాధితుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పెద్ద స్థాయిలో ఉద్యమిస్తామని సీపీఐ(ఎం) నాయకత్వం అధికారులను హెచ్చరించింది.

గురుకులాల్లో మెరుగైన వసతులు కల్పించాలి



నవతెలంగాణ-ఖమ్మం రూరల్

గురుకులాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి(కెవిపిఎస్) రాష్ట్ర కమిటీ సభ్యుడు పాపిట్ల సత్యనారాయణ అన్నారు. పాలేరు నియోజకవర్గంలోని సంక్షేమ గురుకుల హాస్టలల్లో విద్యార్థుల సమస్యలపై కెవిపిఎస్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మండలంలోని పెద్దతండా బైపాస్ వద్ద గల కస్తూరిబా గాంధీ ఆశ్రమ పాఠశాలను ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ విద్యాసంవత్సరం మొదలై రెండు నెలలు అవుతున్నా విద్యార్థులకు దుస్తులు, కాస్మోటిక్ చార్జీలు అందలేదన్నారు. విద్యార్థులకు సరిపడా మరుగు దొడ్లు లేవని దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మెనూ చార్జీలు పెంచాలని, విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలల సర్వే అనంతరం సమస్యల పరిష్కారానికి త్వరలోనే కలెక్టరేట్ ముట్టడి నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల సహాయ కార్యదర్శి వెల్తురు పుల్లారావు, మండల కమిటీ సభ్యులు నూకల బాలరాజు, నాగేశ్వరరావు ఏపూరి వరకుమార్, రామనాథం తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తిన ఆడబిడ్డలు

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో ఆదివారం బోనం ఎత్తారు. కారేపల్లి క్రాస్ రోడ్, దుబ్బతండా గ్రామాల్లో మహిళలు బోనాలతో ఊరేగింపుగా బొడ్రాయి, గ్రామదేవతల ఆలయాలకు చేరుకొని అభిషేకాలు, చేసి మొక్కులు చెల్లించుకున్నారు. దేవతలకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా కారేపల్లి క్రాస్ రోడ్ లోని ఎర్రమ్మ తల్లి ఆలయానికి మాజీ వార్డు సభ్యులు సిద్ధంశెట్టి చిన్న నాగయ్య(ట్రాక్టర్ మెకానిక్) మైకుసెట్ ను వితరణ చేశారు. ఈ కార్యక్రమలలో ఎర్రమ్మ తల్లి దేవాలయ కమిటీ సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి : అన్నపురెడ్డిపల్లి గ్రామంలో ఆడబిడ్డలు బోనాలు ఎత్తుకొని గ్రామంలో గల అమ్మవారి ఆలయానికి వెళ్లి సమర్పించారు. గ్రామంలో నూతనంగా వివాహం చేసుకున్న ఆడబిడ్డలతోపాటు మహిళలు, చిన్నారులు ఆశాడమాసం సందర్భంగా నూతన వస్త్రాలను ధరించి సాంప్రదాయ నృత్యాలతో అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేణుక, లక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పేరువంచ ఉపాధ్యాయురాలి సస్పెన్షన్‌ను ఖండించండి

- టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీ

నవతెలంగాణ-కల్లూరు

పేరువంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఇంగ్లీష్ టీచర్ డి.శిరీషకి ఇచ్చిన సస్పెన్షన్ ఆర్డర్స్‌ను వెంటనే రద్దు చేసి విధుల్లోకి తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీ ఒక ప్రకటనలో ప్రభుత్వ డిమాండ్ చేసింది. పెరిగిన జుట్టుతో పాఠశాలకు హాజరవుతున్నారని పలుమార్లు చెప్పినా జుట్టు కత్తిరించుకోవడంతో, వారిని సంస్కరించాలనే ఉద్దేశంతో, జుట్టు కత్తిరించే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. దానికి తల్లిదండ్రులకు సర్ది చెప్పడం జరిగింది. కానీ సోషల్ మీడియా, ఇతర మీడియాలలో ఈ వార్త వ్యాప్తి చెందడం వల్ల సస్పెన్షన్ ఆర్డర్ ఇవ్వడం సరైనదని తెలిపారు. ఇటువంటి చర్య పిల్లల క్రమశిక్షణ, బాగును కోరుకునే ఉపాధ్యాయుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయడంతో పాటు, క్రమశిక్షణ లేని విద్యార్థులకు ఊతం ఇచ్చినట్లు అవుతుందని పేర్కొన్నారు. శిరీష 23 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో అనేక సేవలు అందించారు. ఏదైనా పొరపాటు జరిగితే ముందుగా షోకాజ్ నోటీస్ ఇచ్చి తర్వాత విచారణ చేసి సదరు ఉపాధ్యాయురాలు ఇచ్చిన వివరణతో సంతృప్తి చెందకపోతే చర్య తీసుకోవాలన్నారు. ఆ వివరణ తీసుకోకుండా సస్పెండ్ చేయడం సరికాదన్నారు.

జోరుగా గిరి గిరి వ్యాపారం

- ప్రజల అవసరాలను 'సొమ్ముగా' మార్చుకుంటున్న వ్యాపారులు
- వడ్డీల దాటికి విలవిలలాడుతున్న బాధితులు
- రూ.100కి రూ. 10 నుంచి రూ. 15 వరకు వడ్డీ వసూలు
- రోజువారి వసూళ్లు
- అప్పుల భారంతో అజ్ఞాతంలోకి..



నవతెలంగాణ - బోనకల్

ప్రజల అవసరాలను కొంతమంది గిరి గిరి వ్యాపారులు పెద్ద ఎత్తున సొమ్ముగా మార్చుకొని లక్షలకు పడగలెత్తుతున్నారు. డబ్బు తీసుకున్న వారు మాత్రం గిరి గిరి వ్యాపారులకు వడ్డీల మీద వడ్డీలు చెల్లించలేక అప్పుల పాలవుతున్నారు. రూ. 100 కు రూ. 10 నుంచి రూ.15 వరకు వడ్డీ వసూలు చేస్తున్నారు.

మండల కేంద్రంలో ఓ నలుగురైదుగురు గిరి గిరి వ్యాపారంపైనే అనత కాలంలోనే లక్షలాది రూపాయలకు అధిపతులయ్యారు. ఐదు సంవత్సరాల క్రితం ప్రధానంగా మండలంలో ఓ వ్యక్తి మాత్రమే గిరి గిరి వ్యాపారం నిర్వహించాడు. కానీ ప్రస్తుతం అతనికి దీటుగా మరో వ్యక్తి రంగంలోకి వచ్చాడు. గతంలో గుంటూరు జిల్లా నుంచి వచ్చినవారు బోనకల్‌తో పాటు, వివిధ గ్రామాలలో గిరి గిరి వ్యాపారాలు పెద్ద ఎత్తున నిర్వహించేవారు. అప్పటికప్పుడు అత్యవసర పరిస్థితులలో మరో మార్గం లేక ప్రజలు వీరిని ఆశ్రయించారు. ప్రస్తుతం బోనకల్‌లో ఓ ఇద్దరు తోపాటు మరో మహిళ గిరి గిరి వ్యాపారం పైనే ఆధారపడి లక్షలాది రూపాయలను పెద్ద మొత్తంలో కూడబెడుతున్నారు. ఏ సమయంలో వారి దగ్గరకు వెళ్లిన టక్కుమని ఎంత అవసరం అయితే అంత ఇస్తున్నారు. ఆ తర్వాత డబ్బు తీసుకున్న వారికి చుక్కలు చూపిస్తున్నారు. చిరు వ్యాపారులు ఎక్కువగా వీరిని ఆశ్రయిస్తున్నారు. తీసుకున్న రుణాన్ని రోజువారిగా వారికి చెల్లించాలి.

మండల కేంద్రానికి చెందిన ఓ చిరు వ్యాపారి చిట్టి పాట ద్వారా రూ. 20 లక్షల పాడుకున్నాడు. ఈ డబ్బులను ప్రతిరోజు రోజువారీగా రూ.3,000 చొప్పున 30 రోజులకు గాను రూ.90 వేలు చెల్లించాడు. నెలకు రూ.90 వేల చొప్పున 36 నెలలకు (3 సంవత్సరాలు) గాను రూ. 32. 40 లక్షలు చెల్లించాడు. అంటే అదనంగా 12 లక్షల 40 వేల రూపాయలు గిరి గిరి వ్యాపారికి ఆ రుణగ్రస్తుడు చెల్లించాడు. ఈ విధంగా గిరి గిరి వ్యాపారికి రుణగ్రస్తుడు నుంచి రూ. 10 రూపాయల నుంచి రూ. 15 రూపాయల వరకు వడ్డీ వసూలు చేసినట్లు అర్థమవుతుంది. ఈ విధంగా గిరి గిరి వ్యాపారులు ప్రజల అవసరాలను 'సొమ్ముగా' చేసుకుంటూ పెద్ద ఎత్తున అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారు. బహిరంగంగానే వీరు గిరి గిరి వ్యాపారం చేస్తున్నప్పటికీ పోలీసు అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా ఓ వ్యక్తి విలేకరి ముసుగులో పెద్ద ఎత్తున గిరి గిరి వ్యాపారం చేస్తూ అక్రమంగా లక్షలాది రూపాయలు సంపాదిస్తూ రుణగ్రహితలకు సింహ స్వప్నం లాగా తయారయ్యాడు. గిరి గిరి వ్యాపారులు వస్తున్నారంటే రుణగ్రహితలు (చిరు వ్యాపారులు) గడగడ వణికి పోవాల్సిందే. వారి వ్యాపారం ఆరోజు నడిచినా, నడవకపోయినా వారికి చెల్లించి తీరాల్సిందే. ఈ విధంగా మండల కేంద్రంలో వారి వ్యాపారులు పెద్ద ఎత్తున జరుగుతోంది.

ఈ క్రమంలో ఓ హెూటల్ యజమాని గిరి గిరి వ్యాపారుల దాటికి అప్పుల పాలై అజ్ఞాతంలోకి వెళ్లాడు. గిరి గిరి వ్యాపారులపై పోలీసులు దృష్టి పెట్టకపోతే బాధితులు సంఖ్య భవిష్యత్తులో పెరిగిపోయి, ఆత్మహత్యలకు కూడా దారిచే ప్రమాదం ఉందని పలువురు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అంగన్వాడీ ఆయా మృతి

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని వెన్నవల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ ఆయా దయమ్మ (59) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. ఆమె మరణం పట్ల సీడీపీఓ, సూపర్వైజర్లు, టీచర్లు, గ్రామస్తులు ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబానికి సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



జెడ్పీటీసీ సూది రెడ్డి దంపతులకు సన్మానం

నవ తెలంగాణ-అశ్వాపురం

కొత్తగూడెం క్లబ్‌లో ఆదివారం జిల్లా పరిషత్ సభ్యుల ఐదేళ్ల పదవీకాలం ముగుస్తున్న సందర్భంగా అశ్వాపురం జడ్పీటీసీ సూది రెడ్డి సులక్షణ గోపిరెడ్డి దంపతులను జిల్లా పరిషత్ చైర్మెన్, సీఈవో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఐదేళ్ల కాలం పాటు ప్రజాసేవ చేయడం సంతృప్తినిచ్చిందన్నారు. ప్రజలు నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు.

వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ

జిల్లా పరిషత్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన పాలకవర్గ వీడ్కోలు కార్యక్రమంలో అశ్వాపురం ఎంపీపీ ముత్తినేని సుజాత పాల్గొని జిల్లా పరిషత్ చైర్మన్ చంద్రశేఖర్ కు పుష్పగుచ్చం అందజేసి వీడ్కోలు శుభాకాంక్షలు తెలిపారు. ఐదేళ్లపాటు జిల్లా ప్రజలకు మీరందించిన సేవలు విశిష్టమైనవని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆప్షన్ షరీఫ్, కాంగ్రెస్ నాయకులు వలబోజు మురళీకృష్ణ పాల్గొన్నారు.



పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

నవతెలంగాణ-కరకగూడెం

పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. ప్రజారోగ్యం ప్రశ్నార్థకంగా మారిందని మండల ప్రజలు వాపోతున్నారు. చినుకు రాలితే రోడ్లు చిత్తవుతున్నాయి. ప్రజా ప్రతినిధుల పర్యటనలప్పుడు గుప్పెడు బ్లీచింగ్ అదికూడా ప్రధాన రహదారులపై చల్లి పంచాయతీ అధికారులు శభాష్ అనిపించుకుంటున్నారు. ఏటా రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు కుమ్మరిస్తున్న పల్లె రాత మారడం లేదు. అదే వ్యథ.. అవే సమస్యలు. గ్రామాల్లో వర్షాకాలం రాకముందే పారిశుధ్య పనులు ప్రారంభించాల్సి ఉంది. డ్రైనేజీల్లో పూడికతీత, నీటినిల్వ కుంటల్లో ఆయిల్ బాల్స్, బ్లీచింగ్, దోమల మందు పిచికారి వంటి పనులు చేపట్టాలి. అయితే నిధులు లేవనే సాకుతో పంచాయతీ కార్యదర్శులు, అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైన ఉన్నతాధికారులు దృష్టి పెట్టి పరిష్కార మార్గం చూపాలని భట్టుపల్లి, కరకగూడెం, మండలంలోని పలు పంచాయతీ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పోలీసుల వాహన తనిఖీలు

నవతెలంగాణ -దుమ్ముగూడెం

మావోయిస్టు అమరవీరుల వారోత్సవాల నేపథ్యంలో ఆదివారం సీఐ బొడ్డు అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానిత వ్యక్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారోత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 24 గంటలు వాహన తలిఖీలు చేపట్టనున్నట్లు సీఐ తెలిపారు. మావోయిస్టులు వారి ఉనికి కాపాడుకోవడం కోసమే వారోత్సవాల పేరుతో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడటంతో పాటు అమాయక ప్రజలను బలి తీసుకుంటున్నారని సీఐ అన్నారు. వాహన తనిఖీలలో సివిల్ పోలీసులతోపాటు సిఆర్పిఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.

గుడ్లను సరఫరా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల శ్రీనివాసరావు



నవతెలంగాణ-అశ్వాపురం

బూర్గంపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గల అశ్వాపురం మండలంలోని కొన్ని అంగన్వాడీ సెంటర్లకు నిబంధనలకు విరుద్ధంగా నాణ్యతలేని కోడిగుడ్లను సరఫరా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల శ్రీనివాసరావు కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ద్వారా నాణ్యమైన కోడిగుడ్లు అందించాలని లక్షలు ఖర్చు పెడుతున్న అవి దళారుల పాలవుతున్నాయన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడుతున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ సెంటర్లకు నాణ్యమైన కోడిగుడ్లను నిబంధనల ప్రకారం సప్లై చేయాలని కోరారు. బాధ్యతాయుతంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు బాధ్యతారాహితంగా వ్యవహరిస్తూ తప్పిదాన్ని టీచర్లపై నెట్టివేసే ప్రయత్నం చేస్తారన్నారు. వాటిని ఎందుకు దించుకున్నారనే సాకును చూపెట్టి టీచర్లపై కూడా చర్యలు తీసుకునేటువంటి అవకాశం ఉన్నదన్నారు. అటువంటి చర్యలకు పాల్పడితే టీచర్, ఆయాలని ఐక్యం చేసి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ టౌన్ -3 ఫీడర్ పరిధిలో మరమ్మతు కారణంగా సోమవారం ఉదయం 8:30 గంటల నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఉబ్బన శరత్ తెలిపారు. టౌన్ -3 పరిధిలోని జవహర్ నగర్, రాజీవ్ రోడ్డు, న్యూ కొమ్మేపల్లి కాలనీ, ఆర్కే హాస్పిటల్ రోడ్డు, గుడిపాడు రోడ్డు, వెంగళరావునగర్ ప్రాంతాల్లో చెట్ల కొమ్మల నరికివేత కార్యక్రమం చేపడుతున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏఈ తెలిపారు.

మంజులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం



నవతెలంగాణ-కామేపల్లి

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని మంజుల ఆదివారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీద అందుకున్నారు. జిల్లాలో ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించడంలో భాగంగా న్యూ శ్లోకా పాఠశాలలో పనిచేస్తున్న మంజులను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా గుర్తించి పురస్కారంతోపాటు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మంజులను పలువురు ఉపాధ్యాయులతో పాటు న్యూశ్లోక పాఠశాల కరస్పాంటెండెంట్ కొర్ర సదన్ లాల్, నవీన్ అభినందించి ఘనంగా శాలువాలు, బొకేలతో సన్మానించారు.

బస్సు ఢీకొని యువకునికి గాయాలు

నవతెలంగాణ-తల్లాడ

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకునికి గాయాలైన సంఘటన ఆదివారం తల్లాడ బస్టాండ్ దగ్గర చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం తల్లాడ బస్టాండ్ నుండి ఖమ్మం వెళ్తున్న పల్లె వెలుగు బస్సు అంజనాపురం గ్రామానికి చెందిన నల్ల గొర్ల కృష్ణను ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని క్షతగాత్రుని 108 వాహనంలో వైద్యం కోసం ఖమ్మం తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మారథాన్ పోటీలో సత్తా చాటిన కారేపల్లి పోలీసులు

నవతెలంగాణ-కారేపల్లి

సిద్దిపేటలో ఆదివారం జరిగిన హాఫ్ మారథాన్ పోటీలో కారేపల్లి పోలీసులు సత్తా చాటారు. మారథాన్ 21.1 కిలోమీటర్ల పరుగు పందెంలో కారేపల్లి పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న కానిస్టేబుళ్ల వెంకన్న, సీతారాములు, రమేష్‌లు విజయవంతంగా పూర్తి చేసి నిర్వహకుల నుండి మెడల్స్ పొందారు. మారథాన్ పోటీలో సత్తా చాటిన పోలీసు సిబ్బందిని సీఐ తిరుపతి రెడ్డి, ఎస్సై రాజారాంలు అభినందించారు.

ఆనంద్‌కు పొంగులేటి శుభాకాంక్షలు

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా ఇటీవల నియమితులైన దోమ ఆనంద్‌కు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుభాకాంక్షలు తెలుపుతూ అభినందించారు. ఆదివారం వైరా పర్యటనకు వచ్చిన మంత్రి పొంగులేటిని ఆనంద్ మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి ఆనంద్‌ను సన్మానించారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి : ఏఓ సరిత



నవతెలంగాణ-బోనకల్

28 జూన్ 2024 లోపు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు, రైతు బీమా పథకానికి అర్హులని మండల వ్యవసాయ శాఖ అధికారిని సర్వశుద్ధి సరిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల రైతులు అర్హులని ఆమె తెలిపారు. ఆగస్టు 05లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారం, పట్టాదారు పాస్ పుస్తకం, పట్టాదారు ఆధార్ కార్డ్, నామినీ ఆధార్ కార్డ్ నకలును, దరఖాస్తు ఫారానికి జతచేసి సంబంధిత గ్రామానికి చెందిన వ్యవసాయ విస్తరణ అధికారికి(ఏఈవో) దరఖాస్తు అందజేయాలని ఆమె కోరారు.

బస్సులు ఆపట్లేదు సారూ..

- పాఠశాలకు లేటుగా వెళుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు..!



నవతెలంగాణ-అశ్వాపురం

మణుగూరు డిపో నుండి భద్రాచలానికి వెళుతున్న ఆర్డినరీ బస్సులను పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు సకాలంలో ఆపడం లేదని మల్లెల మడుగు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న సీతారాంపురం గ్రామానికి చెందిన వారు, అదేవిధంగా జగ్గారం నుండి మిట్ట గూడెం ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయాన్నే పాఠశాల తెరవడానికి గంట ముందే రోడ్డుపైకి వచ్చి బస్సు కోసం ఎదురు చూస్తే తీరా బస్సు వచ్చిన తర్వాత కొందరు డ్రైవర్లు స్టేజీలలో ఆపకుండా వెళ్తున్నారని విద్యార్థులు చెబుతున్నారు. ఇలా సమయానికి బస్సులు ఆపకపోవడం వల్ల పాఠశాలకు నిర్ణీత సమయానికి వెళ్లలేకపోతున్నామని పది, 9వ తరగతి చదువుతున్న వారు చెబుతున్నారు. ఈ బస్సులు ఆపకపోవడంపై ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ అధికారికి కూడా ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తోంది.

ఉచిత ప్రయాణంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు

ప్రభుత్వం పల్లె వెలుగు, ఎక్స్ప్రెస్ సర్వీసులను మహిళలకు ఉచితంగా ప్రయాణం చేసేందుకు వెసులుబాటు కల్పించింది. ఈ ఉచిత ప్రయాణం అమలైన దగ్గర నుండి ఆర్టీసీ డ్రైవర్లు ప్రయాణికుల పట్ల తీవ్రమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని పలువురు ప్రయాణికులు అంటున్నారు. ఉచితం పెట్టక మునుపు ప్రయాణికులు ఎక్కడ చెయ్యెత్తిన బస్సు ఆపిన డ్రైవర్లు ఉచితం వచ్చిన తర్వాత కొన్ని అనివార్య సమయాలలో మహిళలు బస్సులకు చేతులు అడ్డంపెట్టిన ఆపకుండానే వెళ్తున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ప్రతి పల్లె వెలుగు, ఎక్స్ప్రెస్ బస్సును స్టేజీలలో ఆపేలా చర్యలు తీసుకోవాలని స్కూల్ విద్యార్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.

సకాలంలో బస్సు ఆపకపోవడం వల్ల పాఠాలు జరిగిపోతున్నాయి : సురకంటి మాధవి పదో తరగతి విద్యార్థిని



సకాలంలో బస్సు ఆపకపోవడం వల్ల ఆలస్యంగా పాఠశాలకు వెళుతుండడంతో కొన్ని పాఠాలు వినకుండానే జరిగిపోతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులకు తప్పనిసరిగా బస్సును ఆపేలా చర్యలు తీసుకోవాలి.

బస్సు ఆపకుండా వెళ్తే డ్రైవర్ పై చర్యలు తీసుకోవాలి సట్ల గోవర్ధన్ : 9వ తరగతి విద్యార్థి



స్కూల్ విద్యార్థులకు బస్సులు ఆపకుండా వెళితే డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలి. బస్సు పాసులు ఉండి కూడా సమయానికి స్కూల్ కి వెళ్లలేక పోతున్నాము. అధికారులు ఈ విషయంపై దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలి.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీ నిలుపుకోవాలి

- అమరవీరుల స్థూపానికి వినతిపత్రం

నవతెలంగాణ - ఖమ్మం

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, అమరవీరుల స్థూపానికి ఆదివారం వినతిపత్రం ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఈ అంశంపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి, పరిష్కరించాల్సిందిగా తెలంగాణ ఉద్యమకారులు కోరారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో పొందుపరచిన విధంగా ప్రకటించిన ఆరు గ్యారంటీలలో ఐదు గ్యారంటీలపై స్పష్టమైన ప్రకటన చేశారు. కానీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను మాత్రం వదిలేశారని పేర్కొన్నారు. ముఖ్యంగా 250 చదరపు గజాల స్థలం, ఇంటి నిర్మాణం కోసం రూ.10,00,000/- హామీలు వచ్చే డిసెంబర్ 9న సోనియా గాంధీ పుట్టిన రోజు నాటికి పూర్తిస్థాయి అమలు చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నామినేటెడ్ పోస్టులలో తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ఉద్యమకారులు కోరారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల కష్ట ఫలితమే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఉద్యమకారులను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మెన్ డాక్టర్ కె.వి కృష్ణారావు, ఉద్యమకారులు బొమ్మెర రాంమూర్తి, పగడాల నరేందర్, లింగబోయిన సతీష్, బచ్చల పద్మావారి, పెళ్లూరి విజయ్ కుమార్, బోడా వీరన్న, భూక్యా రాంబాబునాయక్, భూక్యా శ్రీనివాస్ నాయక్, ఎస్డి బురాన్ పాల్గొన్నారు.



డాక్టర్స్ మెడికల్ అకాడమీ ఆధ్వర్యంలో "గిగా సక్సెస్ మీట్"

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో డాక్టర్స్ మెడికల్ అకాడమీ "గిగా సక్సెస్ మీట్" చాలా విజయవంతంగా జరిగింది. ఖమ్మంలో ఈ మీట్ నిర్వహించడం ఇదే ప్రథమం. ఎందుకంటే ఒకే సంస్థ నుంచి, ఒకే సంవత్సరం 150 మంది ప్రభుత్వ మెడికల్ సీట్లు సాధించడం అనేది ఎంతో గర్వకారణం నిర్వహకులు అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మంత్రివర్యులు పొంగులేటి. శ్రీనివాసరెడ్డి హాజరై మాట్లాడుతూ దూర ప్రాంతాలకు వెళ్లి మెడికల్ సీట్ తెచ్చుకోవడం అనేది అంతకుముందు జరుగుతూ వస్తుంది కాని, మన పట్టణంలో అందుబాటులో ఉన్న సౌకర్యాలతో ఇంత అమోఘమైన ఫలితాలను ఒకే సంస్థ డాక్టర్స్ అకాడమీ సాధించడం అనేది మన తెలంగాణకే తలమానికంగా ప్రశంసించారు. ఇలాంటి విజయాలు ముమ్ముందు ఇంకా అందజేయాలని యాజమాన్యాన్ని కోరారు. ఇలాంటి విజయం కేవలం విద్యార్థుల అంకితభావం, అధ్యాపకుల అకుంఠిత దీక్ష, తల్లిదండ్రుల సహకారం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా తుమ్మల యుగంధర్ హాజరై మాట్లాడుతూ.. మెడికల్ విద్య అందుకోవడం చాలా కష్టమని, అంత కష్టమైన విద్యను ఎంతో మంది రాస్తున్నా సరే ఎక్కువమంది విద్యార్థులు ఖమ్మం డాక్టర్స్ మెడికల్ అకాడమి నుంచి ఉండడం నిజంగా ప్రశంసనీయమని కొనియాడారు. విద్యార్థిని, విద్యార్థులకు స్టేటస్కోప్, ఆప్రాన్లు, మెమోంటోలు అందజేసారు. అనంతరం దయాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరూ బాగా చదువుకోని మంచి ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. ఎస్‌బీఐటీ చైర్మెన్ ఆర్‌జెసి కృష్ణ, ఖమ్మం ట్రాఫిక్ ఏ.సి.పి. శ్రీనివాసరావు, 2 టౌన్ సీఐ బాలక్రిష్ణ, అంతేకాకుండా ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా. రాజేశ్వరరావు మాట్లాడారు. ఫెమా కన్వీనర్ మువ్వా శ్రీనివాసరావు విద్యార్థిని విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. గెలిచిన వారికి బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమానికి స్టేట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.వీరారెడ్డి, డిస్ట్రిక్ జూనియర్ కాలేజెస్ మేనేజ్ మెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చల్లా. శేషగిరిరావు పాల్గొన్నారు. అకాడమీ యాజమాన్యం రాయల సతీష్ బాబు, ఈగా భరణి కుమార్‌లు హాజరైన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాకే సర్పంచుల ఎన్నికలు నిర్వహించాలి

- 2న సచివాలయం ఎదుట నిరసన :

సుర్వి యాదయ్య గౌడ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్ డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లుల కోసం ఆగస్టు రెండో తేదీన హైదరాబాద్‌లోని సచివాలయం ఎదుట గాంధేయమార్గంలో నిరసన తెలుపుతామని ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సర్పంచులు వడ్డీలకు డబ్బులు తెచ్చి గ్రామాలను అభివృద్ధి చేశారనీ, గత ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని తెలిపారు. అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వమైన పెండింగ్ బిల్లులపై స్పందించకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. వడ్డీలకు అప్పులు తెచ్చి మరీ సర్పంచులు అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. రెండు, మూడేండ్ల నుంచి అప్పులు చెల్లించకపోవడంతో వేధింపులు ఎక్కువ అయ్యాయని వాపోయారు. సర్పంచుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వమైనా పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు.

పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

- రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



నవతెలంగాణ-ఎల్లారెడ్డిపేట

పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రధానోపాధ్యాయుడికి, పాఠశాల సిబ్బందికి సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని దుమాల గ్రామంలో గల ఏకలవ్య పాఠశాలను ఆదివారం ఆయన ఆదివారం తనిఖీ చేశారు. తరగతి గదులు, మైదానం, డైనింగ్ హాల్, టాయిలెట్స్‌ను పరిశీలించారు. వంటశాలలోని భోజనాలను పరీక్షించారు. ఆవరణ పరిశుభ్రంగా ఉండాలని ఉపాధ్యాయులకు, సిబ్బందికి సూచనలు వేశారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు.

టీపీసీసీ అంతర్జాతీయ వ్యవహారాల సమన్వయకర్తగా నంగి దేవేందర్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



టీపీసీసీ అంతర్జాతీయ వ్యవహారాల సమన్వయకర్తగా కాంగ్రెస్ యువనేత నంగి దేవేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం టీపీసీసీ ఎన్ఆర్ఐ రాష్ట్ర చైర్మెన్ డాక్టర్ బీఎమ్. వినోద్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ నియోజకవర్గానికి చెందిన దేవేందర్‌రెడ్డి పార్టీకి వివిధ హోదాల్లో సేవలు అందిస్తున్నారు.

కార్మికులను పరామర్శించిన సింగరేణి సీఎమ్‌డీ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రామగుండం-1 ఏరియాలోని జీడీకే-2 ఇంక్లైన్‌లో శనివారం రూఫ్ ఫాల్ జరిగిన ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న సింగరేణి ఉద్యోగులను ఆ సంస్థ సీఎమ్‌డీ ఎన్ బలరాం పరామర్శించారు. ఇక్కడి ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంపత్, శంకర్, నోయల్‌రాజ్‌లను ఆదివారం రాత్రి కలిశారు. వారికి మనోధైర్యం చెప్పారు. వైద్యులతో మాట్లాడారు. ప్రాణాపాయం లేదని డాక్టర్లు చెప్పడంతో ఖర్చుకు వెనుకాడకుండా మెరుగైన వైద్యం అందించాలని కోరారు. క్షతగాత్రుల కుటుంబసభ్యులను కలసి, వారికి ధైర్యం చెప్పారు. యాజమాన్యం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వారి వైద్యం వివరాలను ఎప్పటికప్పుడు తనకు చెప్పాలని డివైసీఎంవో డాక్టర్ బాలకోటయ్యను ఆదేశించారు.

చోరీ సెల్‌ఫోన్ల రికవరీలో రాష్ట్రానిది రెండో స్థానం

- ఏడు నెలల్లో 21,193 ఫోన్లు స్వాధీనం
- సీఐడీ పోలీసుల ఘనత

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో చోరీ అయిన సెల్‌ఫోన్ల రికవరీలో సీఐడీ విభాగం దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. గడిచిన ఏడు నెలల్లో 21,193 సెల్‌ఫోన్లను చోరుల నుంచి సీఐడీ అధికారులు రికవరీ చేశారు. ఇందుకోసం సీఈఐఆర్ పోర్టల్‌ను అధికారులు విరివిగా ఉపయోగించుకొన్నట్టు సీఐడీ అదనపు డీజీ, సీఈఐఆర్ ప్రాజెక్ట్ నోడల్ అధికారి షికా గోయెల్ ఆదివారం తెలిపారు. దేశ టెలికాం విభాగంతో సమన్వయమై ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చోరీ అయిన సెల్‌ఫోన్లను గుర్తించటానికి అనువైన సీఈఐఆర్ పోర్టల్‌ను రూపొందించినట్టు ఆమె గుర్తు చేశారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులు వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌కు వెళ్లి అందులో అడిగిన సమాచారాన్ని వెంటనే భర్తీ చేసి ఫిర్యాదు నమోదు చేయాలన్నారు. ఆ వివరాల ద్వారా దొంగిలించిన వాటిని కనుక్కోవటానికి సీఐడీ అధికారులకు సులభంగా ఉంటుందని ఆమె తెలిపారు. సీఐడీ కేంద్ర కార్యాలయంతో పాటు రాష్ట్రంలోని 780 పోలీస్ స్టేషన్లలో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోయిన సెల్‌ఫోన్లను కనుక్కోవటంలో స్థానిక పోలీస్ స్టేషన్ల అధికారులకు శిక్షణనిచ్చినట్టు ఆమె వెల్లడించారు. ఫలితంగా ప్రతిరోజు సగటున 88 వరకు చోరుల పాలైన సెల్‌ఫోన్లను రికవరీ చేస్తున్నట్టు స్పష్టం చేశారు. ఇప్పటివరకు 3,500 సెల్‌ఫోన్ల రికవరీలో హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ మొదటి స్థానంలో, 2100 ఫోన్ల రికవరీతో సైబరాబాద్ కమిషనరేట్ రెండో స్థానంలో ఉన్నాయని షికా గోయెల్ వివరించారు.

మన అథ్లెట్స్‌ను ఉత్సాహపరచండి

- మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ


నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ 'పారిస్ ఒలింపిక్స్'లో ఆడేందుకు వెళ్లిన అథ్లెట్లను ప్రజలంతా ఉత్సాహపరచాలని, అథ్లెట్లకు శుభాకాంక్షలు చెప్పాలని ప్రధాని నరేంద్ర మోడీ కోరారు. ఈ మేరకు ప్రధాని 'మన్ కీ బాత్' 112వ ఎపిసోడ్‌లో ఆదివారం మాట్లాడారు. పారిస్ ఒలింపిక్స్ ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తోందని, ప్రపంచ వేదికపై మన క్రీడాకారులు త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించేందుకు పారిస్ ఒలింపిక్స్ ద్వారా అవకాశం వచ్చిందన్నారు. దేశానికి ఎప్పటికీ గుర్తిండిపోయే విజయాలు సాధించడానికి వెళ్లిన మన అథ్లెట్లను ప్రోత్సహించాలని కోరారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'హర్ ఘర్ తిరంగా' ప్రచారాన్ని పున్షప్రారంభించాలని ఆయన దేశ పౌరులను మరోసారి కోరారు.

ముంచుకొస్తున్న ముప్పు

ఎన్నికల్లేక పైసలకు 'గండం'

- కరువులో పంచాయతీలు
- 15వ ఆర్థిక సంఘం నిధులు ఆగిపోయే ప్రమాదం
- స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగేనా ..?



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

గ్రామీణ సమాజంలో గొంతులేని వాళ్లకు గొంతునిచ్చేదే గ్రామపంచాయతీ. ఇప్పుడా పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించక పల్లెల్లో ఆ గొంతులు మూగబోయాయి. నిధుల కొరతతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కుంటుపడుతున్నాయి. కేంద్రం నుంచి సాధారణంగా వచ్చే 15 ఆర్థిక సంఘం నిధులు ఆగిపోయే ప్రమాదం ముంచుకొస్తున్నది. రాష్ట్రంలో పంచాయతీలలో ఈ ఏడాది జనవరి నుంచే ప్రత్యేకాధికారుల పాలన అమల్లో ఉంది. అప్పటి నుంచి ఇప్పటిదాకా గ్రామాల్లో అధికారుల హవా నడుస్తున్నది. ఎన్నికైన ప్రజాప్రతినిధులు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహారాలు సాగుతున్నాయి. ప్రత్యేకాధికారులు అధికార పార్టీ నేతలు చెప్పినట్లో, లేక ఎమ్మెల్యేల ఆదేశాలనో పాటిస్తుండడంతో గ్రామాల్లో ఘర్షణలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో గ్రామాల్లో పరిపాలనంతా అధికారపార్టీ నేతల కనుసన్నల్లో నడుస్తున్నది.

పంచాయతీల ప్రస్తుత పరిస్థితి

రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాల్లో 13,769 గ్రామపంచాయతీలు ఉన్నాయి. కొత్తగా మరో 234 రానున్నాయి. గవర్నర్ ఆమోదిస్తే వచ్చే సెప్టెంబరు లేదా అక్టోబరులో మొత్తం 13003 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అలాగే ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు సైతం జరగనున్నాయి. రాజకీయ పార్టీల గుర్తులపై కాకుండా సాధారణ గుర్తులను రాష్ట్ర ఎన్నికల సంఘం కేటాయిస్తుంది. బ్యాలెట్ పద్ధతిలోనే నిర్వహించనున్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలను ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నుకుంటారు. మండల పరిషత్ అధ్యక్షులు, జిల్లా పరిషత్ అధ్యక్షులు పరోక్షపద్ధతిలో ఎన్నికవుతారనే సంగతి తెలిసిందే.

15వ ఆర్థిక సంఘం

కేంద్ర ప్రభుత్వ ద్వారా వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు రాష్ట్రానికి మొత్తం రూ.7201.0 కోట్లు రావాల్సి ఉంది. ఇప్పటివరకు రాష్ట్రానికి రూ. 3495 కోట్లు వచ్చినట్టు అధికారిక సమాచారం. ఇంకా రూ.3706 కోట్లు రావాల్సి ఉంది. ఈ నిధులను కేంద్రం ప్రతియేటా జూన్, అక్టోబర్‌లో ఇస్తుంది.

ఖర్చు ఎలా ?

15వ ఆర్థిక సంఘం నిధులను బేసిక్(అన్‌టైడ్)గ్రాంట్లు (60 శాతం), టైడ్(40 శాతం) గ్రాంట్లుగా విభజించారు. దాదాపు 29 రకాల పనులకు బేసిక్ గ్రాంట్లను వాడుకోవచ్చు. ఉద్యోగుల జీతభత్యాల కోసం వినియోగించకూడదని రాజ్యాంగంలోని 11వ షెడ్యూల్ చెబుతున్నది. అలాటే టైడ్ గ్రాంట్లల్లో 50 శాతం నిధులతో పారిశుధ్యం, ఓడిఎఫ్ నిర్వహణ చేయాలి. అలాగే మరో 50 శాతం నిధులను తాగునీరు, నీటి సంరక్షణ పనులకు వాడుకోవాలి. ఈ నిధులు 85:10:5 నిష్పత్తిలో ఉపయోగించాలి. వరుసగా పంచాయతీలకు 85 శాతం నిధులు, మండల పరిషత్‌లకు 10 శాతం, జిల్లా పరిషత్‌లకు ఐదు శాతం నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. రెండు వాయిదాల్లో కేంద్రం ఈ నిధులను రాష్ట్రాలకు విడుదల చేస్తుంది.

చర్చోపచర్చలు

రాష్ట్రంలోని పంచాయతీలు ప్రస్తుతం నిధుల గండాన్ని ఎదుర్కొంటున్నాయి. ఈ సమస్యపై అటు క్యాబినెట్‌లోనూ, ఇటు అసెంబ్లీలోనూ చర్చలు చోటుచేసుకున్నాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. నిధుల్లేక ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేసే పరిస్థితి లేదు. దాదాపు రూ. 57 వేల కోట్ల మేర లోటుబడ్జెట్ ఉన్న సంగతి తెలిసిందే. ఈపరిస్థితుల్లో పంచాయతీలకు నిధులు ఇస్తుందనే ఆశలు అంతంతగానే ఉన్నాయి. దీంతో సాధారణంగా కేంద్రం నిధులను సైతం వినియోగించుకునే పరిస్థితులు కనిపించడం లేదు. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చే అక్టోబర్ వాయిదా నిలిచిపోయే ప్రమాదం కనిపిస్తున్నది.

కులగణన

పంచాయతీ ఎన్నికలను కులగణన చేసిన తర్వాతే నిర్వహించాలని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. రిజర్వేషన్ల పరంగా బీసీలు నష్టపోతున్నారని అంటున్నాయి. ఎన్నికల్లో కులగణన చేస్తామని కాంగ్రెస్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ మేరకు కులగణన చేశాకే పంచాయతీల ఎన్నికలు జరపాలని కోరుతున్నారు. ఇదంతా ఇప్పట్లో సాధ్యం కాదని అధికారులు అంటున్నారు. చాలా సమయం పట్టే అవకాశం ఉండటంతో ఎన్నికలకు విఘాతం కలిగే అవకాశముంది. ఒకవేళ ఎన్నికలు జరగకపోతే 15వ ఆర్థిక సంఘం నిధులపై ఆశలు వదులుకోవాల్సి ఉంటుంది.

నిధులు వివరాలు(రూ.కోట్లలో)

సంవత్సరం	బేసిక్‌గ్రాంట్లు	టైడ్‌గ్రాంట్లు	మొత్తం	ఇచ్చినవి
2021-22	546	819	1365	1365
2022-23	566	849	1415	1415
2023-24	572	858	1430	715
2024-25	605.6	908.4	1514	0
2025-26	590.8	886.2	1477	0
మొత్తం	2880.4	4320.6	7201.0	3495

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- కూసుమంచి మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-కూసుమంచి

పల్లెల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో ఆదివారం విస్తృతంగా పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. తొలుత పాలేరులో సైడ్ డ్రెయిన్ల నిర్మాణానికి, అనంతరం తురకగూడెం నుంచి కిష్టాపురం వరకు, తురకగూడెం నుంచి చింతల తండా వరకు రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. వివిధ అనారోగ్య సమస్యలతో ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన 37మందికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పాలేరులోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పల్లెల్లో మురుగునీటి సమస్య లేకుండా చూస్తామని తెలిపారు. ఇందుకోసం సీసీ, బీటీ రోడ్ల వెంట, వీధుల్లో పూర్తిస్థాయిలో డ్రైనేజీలు నిర్మిస్తామని అన్నారు. పారిశుధ్య సమస్య రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని, అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమాల్లో కూసుమంచి, తిరుమలాయపాలెం ఎంపీపీలు బానోత్ శ్రీనివాస్, మంగీలాల్, మాజీ ఎంపీపీలు జూకూరి గోపాలరావు, కొప్పుల అశోక్, జిల్లా నాయకులు చావా శివరామకృష్ణ, జొన్నలగడ్డ రవి, రామ సహాయం మాధవి రెడ్డి, హఫీజుద్దీన్ పాల్గొన్నారు.

మహిళా కూలీలతో మంత్రి మాటామంతి

"ఏం అక్కా.. ఎలా ఉన్నారు.. ఓ.. చెల్లే.. పనులు ఎలా జరుగుతున్నయ్.. ఏం రకం విత్తనాలు వేశారు.." అంటూ మంత్రి పొంగులేటి మహిళా కూలీలను ఆత్మీయంగా పలకరించి.. ఆనందింపజేశారు. తురకగూడెం పర్యటన ముగించుకొని తిరిగి వస్తుండగా రోడ్డు వెంట ఓ పొలంలో నాటు వేస్తున్న కూలీలను చూసి.. తన వాహనాన్ని ఆపారు. వారి వద్దకు వెళ్లి.. యోగ క్షేమాలు తెలుసుకున్నారు.

మాస్ లైన్ నేత సంస్మరణ సభలో మంత్రి

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మెన్ రాయల చంద్రశేఖర్ నిరంతరం పేదల బాగు కోసం తపించి చేసిన పోరాటాలు మరువలేనివని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన రాయల చంద్రశేఖర్ సంస్మరణ సభకు హాజరై.. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వైద్యారోగ్యశాఖ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఆగస్టు ఒకటిన హైదరాబాద్‌లో మహా ధర్నా : టీయుఎంహెచ్ఇయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యారోగ్యశాఖలోని కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, ఆగస్టు ఒకటిన హైదరాబాద్‌లోని ఆ శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట మహాధర్నాను నిర్వహిస్తున్నట్టు తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ-సీఐటీయూ అనుబంధం) తెలిపింది. ఆదివారం హైదరాబాద్‌లోని యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మహ్మద్ ఫసియొద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రధాన కార్యదర్శి కె.యాదనాయక్ మాట్లాడుతూ ఉద్యోగులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వైద్యారోగ్యశాఖలోని రెండో ఏఎన్ఎంలు, ఈసీఏఎన్ఎంలు, అర్బన్ హెల్త్ సెంటర్ ఏఎన్ఎంలు, వైద్యవిధాన పరిషత్ ఏఎన్ఎంలు, హెచ్ఆర్డీ ఏఎన్ఎంలు, 104 ఉద్యోగులు తదితర విభాగాలున్నాయని తెలిపారు. డీఎంఈ, టీవీవీపీ పరిధిలోని ఆస్పత్రుల్లో పని చేస్తున్న సెక్యూరిటీ, శానిటేషన్, పేషెంట్ కేర్, టిసాక్స్, ఆర్ఎన్టీపీసీ, టి హబ్, స్టాఫ్ నర్సులు, ఆయుష్, అర్బన్ హెల్త్ సెంటర్ తదితర ఉద్యోగులు ఉన్నారని చెప్పారు. హార్మోన్ ఏజెన్సీ ద్వారా పనిచేస్తున్న ఏఎన్ఎంలతో సహా వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న వారందరిని యథావిధిగా రెగ్యులర్ చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనీ, ఇతర అన్ని సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్లతో గురువారం ఉదయం 10 గంటలకు హైదరాబాదులోని కోఠిలో వైద్యారోగ్యశాఖ కమిషనర్ కార్యాలయం ముందు "మహా ధర్నా" తలపెట్టినట్టు వారు తెలిపారు.

యాదనాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్యా ఆరోగ్య రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలనీ, పని భారం తగ్గించాలంటూ గతంలో వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని విమర్శించారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ బదిలీలకు అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను చర్చించి వేతనాలు పెంచి, రెగ్యులర్ చేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆఫీస్ బేరర్లు భూపాల్, బలరాం, కవిత, విజయ వర్ధన్ రాజు, భూలక్ష్మి, హరి శంకర్, కిరణ్మయి, మరియమ్మ, సంజు జార్జ్, నవీన్ కుమార్, ఏడుకొండలు, సుధాకర్, వేణుగోపాల్, శ్రీనివాస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఒడిశాలో కుండపోత

- రోడ్లపై విరిగిపడిన కొండ చరియలు
- జలదిగ్బంధంలో పలు గ్రామాలు

ఒడిశా : ఒడిశాలో భారీ వర్షాలు కురుస్తుండటంతో పలు ప్రాంతాల్లో కొండ చరియలు విరిగిపడ్డాయి. పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వందలాది ఇళ్లు నేలమట్టమయ్యాయి. కొండచరియలు విరిగిపడటంతో మల్కన్‌గిరి జిల్లాలోని 18 గ్రామాలకు ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయి. ఉత్తర ఒడిశాలోని గంగా మైదానాల్లో అల్పపీడనం ప్రభావంతో.... జూలై 31 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) బులెటిన్‌లో పేర్కొంది. సముద్రం అల్లకల్లోలంగా ఉండే అవకాశం ఉండటంతో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని అధికారులు సూచించారు.

జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

కోట్‌పాడ్, బోయిపరిగూడ, లమటపుట్, కుంద్ర, జైపూర్‌లోని పలు గ్రామాల్లో రహదారుల పక్కన కొండచరియలు విరిగిపడ్డాయి. విశాఖపట్నం, రాయ్‌పూర్‌లను కలిపే ఎన్‌హెచ్-26లో కోటపాడ్, సుంకి మధ్య వాహనాలు నిలిచిపోయాయి. మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ బ్లాక్ పరిధిలోని బయపదర్ ఘాట్ రోడ్డులోని తుంబపదర్ గ్రామ సమీపంలో కొండచరియలు విరిగిపడటంతో మల్కన్‌గిరి, కోరాపుట్‌లోని లమటాపుట్, నందాపూర్ ప్రాంతాల నుంచి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

కమలా హారిస్, ట్రంప్ మధ్య తగ్గుతున్న తేడా



వాల్ స్ట్రీట్ జర్నల్, ఫోర్బ్స్ తాజా పోల్ సర్వేల ప్రకారం వైట్‌హౌస్ రేసులో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్‌పై కొద్దిపాటి ముందంజలో ఉన్నాడు. గత వారం అధ్యక్షుడు జో బైడెన్ తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకున్న తర్వాత కమలా హారిస్ డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి అయింది. ఈ వారం ప్రారంభంలో విడుదలైన రాయిటర్స్/ఇప్సోస్ పోల్‌లో హారిస్ కంటే రెండు పాయింట్ల తేడాతో ట్రంప్ ఆధిక్యంలో నిలిచాడు.

శుక్రవారం విడుదలైన వాల్ స్ట్రీట్ జర్నల్ పోల్‌లో ట్రంప్‌కు 49 శాతం, హారిస్‌కు 47 శాతం ఓట్లు వచ్చాయి. జులై 23-25 వరకు నిర్వహించిన ఈ పోల్‌లో 1,000 మంది నమోదిత ఓటర్లు పాల్గొన్నారు. సోమవారం నుంచి బుధవారం వరకు నిర్వహించిన హారిస్‌ఎక్స్/ఫోర్బ్స్ ఆన్‌లైన్ పోల్‌లో ట్రంప్ 47 శాతం, హారిస్ 45 శాతం వద్ద కేవలం రెండు పాయింట్ల తేడాతో నిలిచారు. రేసు నుంచి వైదొలగాలని బైడెన్ తీసుకున్న నిర్ణయానికి అత్యధిక మద్దతు (81 శాతం) ఉన్నట్టు సర్వేలో తేలింది. "వైస్ ప్రెసిడెంట్ హారిస్ డెమొక్రాటిక్ స్థావరాన్ని ఉత్తేజపరిచారు, సబర్బన్ మహిళలతో ఆధిక్యాన్ని పెంచారు, స్వతంత్రులతో అంతరాన్ని మూసివేశారు" అని హారిస్ ఎక్స్ సీఈఓ డ్రిటన్ నేషో చెప్పారు. "ఆమె ఇప్పటికీ ఆఫ్రికన్ అమెరికన్ పురుషులతో పోరాడుతోంది, ట్రంప్ మొత్తంగా ఇప్పటికీ మరింత ఏకీకృత ఓటర్లను కలిగి ఉన్నారు. బైడెన్ తప్పుకోవాలనే నిర్ణయం రేసును మళ్లీ పోటీగా మార్చిందని" నెషో వాదించాడు.

తన ఆరోగ్యం క్షీణించడం, నవంబర్‌లో ట్రంప్‌ను ఓడించగల సామర్థ్యంపై డెమొక్రాట్‌లు, పార్టీ దాతల్లో అనేక రోజులుగా పెరుగుతున్న ఆందోళనల తరువాత జూలై 21న తన ఎన్నికల ప్రచారాన్ని ముగించినట్లు బైడెన్ ప్రకటించాడు. ప్రారంభంలో ధిక్కరించిన బైడెన్ ఆ తరువాత తన పట్టును సడలించాడు. "మన ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ఏదీ అడ్డుకాదు. అందులో వ్యక్తిగత ఆశయం కూడా ఉంది"అని అతను బుధవారం ఓవల్ కార్యాలయం నుంచి ప్రసంగించాడు. హారిస్ ప్రచారం మొదలవగానే విరాళాల ప్రవాహం ఊపు అందుకుంది. కమలా హారిస్‌కు బైడెన్ మద్దతు పలికిన 24 గంటల్లో 81 మిలియన్ డాలర్ల విరాళాలను అందుకుంది. వచ్చే నెలలో జరిగే పార్టీ సమావేశంలో డెమొక్రాట్లు అధికారికంగా హారిస్‌ను నామినేట్ చేస్తారని భావిస్తున్నారు.

ఒకవేళ కమలా హారిస్ గనుక విజయం సాధించటం జరిగితే అది మూడవ ప్రపంచ యుద్ధానికి దారి తీస్తుందని ట్రంప్ హెచ్చరించాడు. కమలా హారిస్ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలిస్తే, మధ్యప్రాచ్యంలో "పెద్ద యుద్ధాలు", "బహుశా మూడవ ప్రపంచ యుద్ధం" చెలరేగవచ్చని మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నాడు. హారిస్, అధ్యక్షుడు బైడెన్ అమెరికాను ప్రపంచ యుద్ధంవైపు లాగుతున్నారని ట్రంప్ పదేపదే ఆరోపిస్తున్నాడు. 2022లో ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి బైడెన్, హారిస్‌లపై ట్రంప్ ఇలాంటి ఆరోపణలను చేస్తున్నాడు. తాను అధికారంలో ఉండివుంటే యుద్ధం మొదలయ్యేదే కాదని, నవంబర్‌లో ఎన్నికైతే మాస్కో, కీవ్‌లను 24 గంటల్లో చర్చలకు తీసుకువస్తానని ట్రంప్ హామీ ఇచ్చాడు.

శాంతి చర్చలపై ఆటలాడుతున్న ఉక్రెయిన్



లావ్రోవ్

శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని ఉక్రెయిన్ చేసిన ప్రకటనలను రష్యా పెద్దగా పట్టించుకోలేదని, ఈ విషయంపై కనీసం స్పందించలేదని ఆ దేశ విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్ అన్నాడు. అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఈస్ట్ ఏషియన్ నేషన్స్ (ఆసియాన్) సదస్సుకు హాజరై లావోస్‌లోని వియంటియాన్‌లో విలేకరులతో మాట్లాడుతున్నప్పుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ, ఉక్రేనియన్ విదేశాంగ మంత్రి డిమిత్రి కులేబాతో సహా ఉక్రేనియన్ సీనియర్ అధికారులు ఇటీవలి ప్రకటనలపై వ్యాఖ్యానించాల్సిందిగా లావ్రోవ్‌ను కోరారు.

ఈ నెల ప్రారంభంలో జెలెన్‌స్కీ సంఘర్షణను "సాధ్యమైనంత త్వరగా" ముగించాలనుకుంటున్నట్లు సంకేతాలు ఇచ్చాడు. ఉక్రెయిన్‌లో అధికారంలో ఎవరు ఉన్నా రష్యాతో మాట్లాడటానికి సిద్ధంగా ఉన్నామని ఆ దేశ అధికారులు ప్రకటించారు. ఇది 2022 శరదృతువులో జెలెన్‌స్కీ సంతకం చేసిన అధ్యక్ష డిక్రీతో విభేదిస్తుంది. ఇది మాస్కోలో ప్రస్తుత నాయకత్వంతో అన్ని చర్చలను నిరోధించింది. నాలుగు ఉక్రేనియన్ ప్రాంతాలు రష్యాలో చేరడానికి అత్యధికంగా ఓటు ద్వారా సమ్మతించిన తర్వాత అతను నిషేధాన్ని ప్రవేశపెట్టాడు.

ఇంతలో, కులేబా ఈ వారం ప్రారంభంలో చైనీస్ విదేశాంగ మంత్రి వాంగ్‌యితో జరిపిన అరుదైన సమావేశం తర్వాత కీవ్‌ను చర్చలకు ఎవరూ బలవంతం చేయలేరని అన్నాడు. కులేబా వ్యాఖ్యలపై వ్యాఖ్యానిస్తూ, లావ్రోవ్ "అతను ఇలా చెప్పడం ఇదే మొదటిసారి కాదు, కొన్నిసార్లు సరిగ్గా వ్యతిరేకంగా చెప్పాడు." కులేబా, జెలన్‌స్కీ ఇద్దరినీ ప్రస్తావిస్తూ "నిజాయితీగా చెప్పాలంటే నేను వారి మాట వినను" అని లావ్రోవ్ ఒప్పుకున్నాడు. కులేబాతో చర్చల గురించి వాంగ్ యి తనకు వివరించారని లావ్రోవ్ తెలిపారు. "ఘర్షణ మూల కారణాలను గురించి సంపూర్ణ అవగాహనగల చైనా తన వైఖరిని మార్చుకోదని మేము నమ్ముతున్నాము" అని లావ్రోవ్ చెప్పాడు.

ఉక్రెయిన్‌తో చర్చలకు రష్యా సిద్ధంగా ఉందని, అయితే దేశాధినేతగా వ్లాదిమిర్ జెలెన్‌స్కీ చట్టబద్ధత, పాశ్చాత్య జోక్యంతో సహా అనేక సమస్యలు - ఏదైనా ముఖ్యమైన సంభాషణను ప్రారంభించడానికి పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఇంతలో క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ వివరించాడు. డాన్‌బాస్, దాని ఇతర రెండు పూర్వ ప్రాంతాల నుంచి దళాలను ఉపసంహరించుకుని, తటస్థ స్థితికి కట్టుబడి, నాటోలో చేరాలనే ఆకాంక్షను వదులుకుంటే వెంటనే రష్యా ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు సిద్ధంగా ఉందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గత నెలలో మాస్కోలో చెప్పాడు.



విలక్షణ రచయిత్రి శివ శంకరి

శివశంకరి... గత నాలుగు దశాబ్దాలుగా తమిళ సాహిత్య ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. తన తోలైన అధ్యయనం ద్వారా సామాజిక సమస్యలపై అవగాహన పెంచుకున్నారు. ఆ సమస్యల పరిష్కారానికై తన కలాన్ని ఝుళిపిస్తున్నారు. పాఠకుల్లో ఆలోచనలు రేకెత్తిస్తున్నారు. అందుకే సరస్వతీ సమ్మాన్ ఆమెను వరించింది. అటువంటి విలక్షణ రచయిత్రి ఈ రోజు విశ్వంభర డా.నారాయణరెడ్డి జాతీయ పురస్కారాన్ని హైదరాబాద్‌లో అందుకోబోతున్న సందర్భంగా ఆమె సాహిత్య ప్రస్థానం...

శివశంకరి 1942, అక్టోబర్ 14న చెన్నైలో సూర్యనారాయణన్, రాజలక్ష్మి దంపతులకు జన్మించారు. ఈమెకు ముగ్గురు తోబుట్టువులు ఉన్నారు. ఇద్దరు అన్నలు, ఒక అక్క. వీరంతా రామకృష్ణ మిషన్, శారదా విద్యాలయ పాఠశాలల్లో చదువుకున్నారు. ప్రాథమిక విద్య పూర్తి చేసిన తర్వాత శివశంకరి SIET కాలేజ్ ఫర్ ఉమెన్స్‌లో చదువుకున్నారు. చదువులో ఆమె అత్యంత ప్రతిభ కనబరిచే వారు. బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (జువాలజీ)లో కళాశాలలో మొదటి ర్యాంక్, విశ్వవిద్యాలయంలో 9వ ర్యాంక్ సాధించారు. చదువుతో పాటు దక్షిణ భారత శాస్త్రీయ సంగీతంలో శిక్షణ పొందారు. విదేశాలలో అనేక కచేరీలు కూడా ఇచ్చారు. అలాగే శాస్త్రీయ నృత్యం, భరతనాట్యంలో కూడా ప్రతిభావంతురాలు. చదువు పూర్తి చేసిన తర్వాత ఆమె సిటీ బ్యాంక్‌లో పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా పని చేశారు. ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ అయిన చంద్రశేఖరన్‌ను 1963లో వివాహం చేసుకున్నారు.

లోతైన రచనలు

ఆమె రచనల్లో 36కి పైగా నవలలు, 48 లఘు నవలలు, 150 చిన్న కథలు, 15 ట్రావెలాగ్స్, ఏడు వ్యాసాల సంకలనాలు, నాలుగు సాహిత్య పరిశోధన సంపుటాలు ఉన్నాయి. ఇందిరా గాంధీ, శ్రీ.జిడి నాయుడు జీవిత చరిత్రలను కూడా ఈమె రచించారు. ఇలా అనేక రంగాలలో అగ్రగామిగా పేరు సంపాదించుకున్నారు. అమె రచనలన్నీ సామాజిక సమస్యలకు సంబంధించే ఉంటాయి. ముఖ్యంగా ఆమె అనేక ఏండ్లు పరిశోధన చేసి, స్వయంగా బాధితులను కలుసుకుని, వారితో మాట్లాడి ఆ అనుభవాలతో మాదకద్రవ్యాల దుర్వినియోగం, మద్యపానం, వృద్ధాప్య సమస్యలపై నవలలు రచించారు. ఈ నవలలు జాతీయ, ప్రాంతీయ టెలివిజన్ నెట్‌వర్క్‌లలో సీరియల్స్‌గా వచ్చాయి. ప్రజల నుండి విపరీతమైన స్పందన వచ్చింది. అత్యంత ప్రజాదరణ పొందిన వాటిలో మాదకద్రవ్యాల ముప్పుపై వచ్చిన సీరియల్ ఒకటి. 1987 మెగా హిట్‌గా దీన్ని చెప్పుకునేవారు.

సామాజాన్ని మేల్కొలిపే రచనలు

ప్రముఖ తమిళ పత్రికలలో ప్రచురించబడిన ఆమె కథలు, వ్యాసాలు ఇంగ్లీష్‌తో పాటు ఇతర భారతీయ భాషలలోకి అనువదించబడ్డాయి. మాదకద్రవ్య వ్యసనంపై ఆమె రాసిన నవల ఉక్రేనియన్లోకి అనువదించబడింది. అలాగే నేత్రదానంపై ఆమె రాసిన వ్యాసం పాఠకులపై తీవ్ర ప్రభావం చూపించిందని చెప్పుకోవచ్చు. ఫలితంగా వేలాది మంది ప్రజలు మరణానంతరం తమ కండ్లను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. అలాగే శారీరక, మానసిక వికలాంగులు, వృద్ధులపై ఆమె రాసిన కథనాలు పాఠకులలో సామాజిక అవగాహనను మేల్కొల్పాయి. తన రచనలకుగాను ఆమె ఎంతో మంది నిపుణులు, సంక్షేమ సంస్థల నుండి ప్రశంసలు అందుకుంటారు.

ఆమె రాసిన ఆరు నవలలు తమిళ చిత్రాలుగా చిత్రీకరించబడ్డాయి. అవన్ అవల్ అధు(1980) నవల ఒరు సింగం మయలగిరదు ముక్తా శ్రీనివాస్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం 125 రోజులు ప్రదర్శించబడింది. అలాగే 47 నాట్కల్(1981)కు కె.బాలచందర్ దర్శకత్వం వహించారు. అలాగే కన్నడలో ఒక కథ, తెలుగు భాషల్లో ఒకటి చిత్రీకరించారు. తెలుగులో చిరంజీవి, జయప్రద నటించారు. 1987లో దూరదర్శన్‌లో సుబా అనే టీవీ సీరియల్‌గా వచ్చింది ఈమె రాసిన నవలనే.

ప్రముఖులతో ఇంటర్వ్యూలు

శివశంకరి కేవలం రచయితగానే కాక అనేకమంది ప్రముఖలతో ఇంటర్వ్యూలు సైతం చేశారు. వీరిలో ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, మదర్ థెరిసాతో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఉన్నారు. అలాగే వీడియో, ఆడియో టేపుల ద్వారా తన కథను వివరించిన మొదటి రచయిత కూడా ఆమెనే. టెలివిజన్ కోసం ఆమె ఆలోచింపజేసే అనేక కార్యక్రమాలను అందించారు. సన్ టీవీ కోసం విభిన్న అంశాలపై అత్యంత ప్రజాదరణ పొందిన టాక్ షో NETRU, INDRU, NAALAIలను వ్యాఖ్యాతగా కూడా చేసారు. ఈమె ట్రావెల్స్ విత్ రాజీవ్ గాంధీ అనే పేరుతో రెండు ట్రావెల్‌లాగ్‌లు రాశారు. ఇవి జపాన్‌లోకి అనువదించబడ్డాయి.



KNIT ఇండియా

16 ఏండ్లు శ్రమించి ఆమె జూన్ 2009లో తన ప్రాజెక్ట్ KNIT ఇండియాను పూర్తి చేశారు. భారత రాజ్యాంగంలోని VIIIవ షెడ్యూల్ ఆమోదించిన మొత్తం 18 భారతీయ భాషలకు చెందిన ప్రముఖ రచయితలను కలుసుకుని ఇంటర్వ్యూ చేయాలనే లక్ష్యంతో ఆమె ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు. ఈ పర్యటన సందర్భంగా ఎదురైన అనుభవాలను, ఆ ప్రాంతాలకు సంబంధించిన యాత్రా కథనాలతో పాటు వివిధ భాషల సాంస్కృతిక, సాహిత్య వారసత్వంపై లోతైన వ్యాసం కూడా ప్రచురించారు. ఈ ప్రాజెక్ట్ సౌత్, ఈస్ట్, వెస్ట్, నార్త్ పేర్లతో వరుసగా 1998, 2000, 2004, 2009లో ప్రచురించబడ్డాయి.

విభిన్న బాధ్యతలు

చెన్నైలోని తారామణిలోని విహెచ్ఎస్ హాస్పిటల్‌లో డి-అడిక్షన్ కోసం ఏర్పాటు చేసిన రాజాజీ సెంటర్‌ను ఏర్పాటు చేయడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. మదురై కామరాజ్ యూనివర్శిటీ వారు శివశంకరి రచనలపై ప్రత్యేకంగా ఐదు విశ్వవిద్యాలయాలకు చెందిన ఎనిమిది మంది ప్రొఫెసర్లతో రెండు రోజుల సెమినార్ నిర్వహించారు. ఇప్పటి వరకు ఎనభై మందికి పైగా యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్లు ఆమె రచనలపై ఎం.ఫిల్, పీహెచ్‌డీలు చేస్తున్నారు. 1998 వరకు ఆమె మూడేండ్లపాటు సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డులో బోర్డు సభ్యురాలిగా కూడా పని చేశారు. AGNI (జాతీయ సమైక్యత కోసం మేల్కొన్న సమూహం)కు వ్యవస్థాపకురాలిగా, మేనేజింగ్ ట్రస్టీగా ఉన్నారు. డ్రగ్ దుర్వినియోగంపై అవగాహన కోసం జాతీయ ఉన్నత స్థాయి కమిటీలో కూడా పని చేశారు. మాస్కోలో జరిగిన అంతర్జాతీయ మహిళల సమావేశంలో పాల్గొన్న ప్రతినిధి బృందంలో ఈమె కూడా ఓ సభ్యురాలు. అలాగే ఏఐఆర్ సలహా కమిటీ, కేంద్ర సాహిత్య అకాడమీ అడ్వైజరీ బోర్డు సభ్యురాలిగా కూడా ఈమె గతంలో పని చేశారు.

- సలీమ

ఉప్పు ఎక్కువైందా?

ఒక్కోసారి కూరల్లో ఉప్పు ఎక్కువవుతుంటుంది. ఈ పొరపాటు అప్పుడప్పుడు ప్రతి ఇంట్లోనూ జరుగుతుంది. అలా ఎక్కువైన ఉప్పును వెనక్కి తీయలేకపోయినా దాని వల్ల కూర రుచి చెడిపోకుండా మాత్రం జాగ్రత్త పడవచ్చు. అదెలాగో చూద్దాం..



- కూరల్లో పొరపాటున ఉప్పు ఎక్కువ పడితే చాలామందికి వెంటనే గుర్తొచ్చేది నిమ్మరసం. కూరల్లో దీన్ని కలపడం వల్ల ఉప్పు తగ్గుతుంది. ముఖ్యంగా మాంసాహార వంటల్లో నిమ్మరసం కలిపితే కూర రుచి కూడా పెరుగుతుంది.
- కూరలో ఉప్పు ఎక్కువైనప్పుడు అందులో కొద్దిగా కొబ్బరిపాలు, లేదా కొబ్బరి పేస్టు కలపాలి. ఇలా చేడయం వల్ల కూరల్లో ఉప్పదనం తగ్గి రుచికరంగా ఉంటుంది.
- బంగాళదుంప తొక్క తీసి, నాలుగు ముక్కలుగా కోసి కూరలో వేయాలి. వీటిని దాదాపు 10 నిమిషాల పాటు అందులో ఉడకనిస్తే ఆ ముక్కలు ఉప్పును పీల్చుకుంటాయి. వడ్డించే ముందు వాటిని కూరలోంచి బయటకు తీసేయాలి.
- రెండు లేదా మూడు కప్పుల పెరుగును కూరలో కలపడం వల్ల ఉప్పు తగ్గడమే కాదు, చాలా రుచిగా ఉంటుంది. పెరుగు ఇష్టపడని వారు దానికి బదులుగా మీగడను కలుపుకోవచ్చు.
- కూర పరిమాణాన్ని బట్టి ఒకటి లేదా రెండు ఉల్లిపాయలను చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకొని, నూనెలో వేయించి కూరలో కలపడం వల్ల ఉప్పదనం తగ్గుతుంది.
- గోధుమ పిండికి కొద్దిగా నీటిని కలిపి చిన్న చిన్న ఉండలుగా చేసుకొని, వీటిని కూరలో వేసి మూడు – నాలుగు నిమిషాలు ఉడకనివ్వాలి. ఇవి కూరలో ఎక్కువగా ఉన్న ఉప్పును గ్రహిస్తాయి. తర్వాత వీటిని బయటకు తీసేయొచ్చు.
- చేసిన వంటకాన్ని బట్టి టమాట ముక్కలు వేయొచ్చు. . అప్పటికే కూరలో ఉల్లిపాయ, టమాట పేస్టు వేసినప్పటికీ మరికొంత అదనంగా కలుపుకోవచ్చు. ఇలా చేయడం వల్ల కూరలో ఉప్పు తగ్గుతుంది, రుచీ పెరుగుతుంది. గ్రేవీ ఎక్కువగా వస్తుంది. పాలు పోసినా కూర చాలా రుచిగా మారుతుంది.

తెలంగాణ దార్శనికుడు జైపాల్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

నిదర్శనమని తెలిపారు. ఒక రాజకీయ నాయకుడిగానే గాక ఒక సిద్ధాంతకర్తగా, లోతైన విశ్లేషకునిగా.. అంతర్జాతీయ స్థాయిలో మెప్పు పొందిన వ్యక్తి అని గుర్తు చేశారు. చివరి శ్వాస వరకూ ఎక్కడా రాజీ పడకుండా ప్రజాస్వామ్య, లౌకిక రాజకీయాలకు ఊతం ఇచ్చేవారన్నారు. ఈ ప్రాంతంలోని మిడ్జిల్ నుంచి జడ్పీటీసీగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన తాను ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా, పీసీసీ అధ్యక్షునిగా చివరికి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టానంటే జైపాల్ రెడ్డే తనకు మార్గదర్శకులని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఈ రాష్ట్రంలో సీఎం అభ్యర్థిని ప్రకటించకపోవడం వల్లనే ప్రజలు కాంగ్రెస్‌ను అధికారానికి దూరంగా పెట్టారని తెలిపారు. తల్లిని చంపి బిడ్డను బతికించుకున్నారన్న మోడీ మాటలు తెలంగాణ రాష్ట్రం పట్ల ఆయనకున్న కపట ప్రేమను తెలియజేస్తున్నాయన్నారు.

కల్వకుర్తిలో 100 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తండాల్లో బీటీ రోడ్లతో పాటు ఆర్అండ్‌బీ రోడ్లు, గెస్ట్ హౌస్ నిర్మాణానికి రూ.180 కోట్లు విడుదల చేస్తున్నట్టు చెప్పారు. ఆమనగల్ మండల కేంద్రంలోని డిగ్రీ, జూనియర్ కళాశాలలకు మౌలిక వసతులతో పాటు పక్కాభవనాలు నిర్మించి ఇస్తామన్నారు. మాడుగుల మండలానికి అండర్ గ్రౌండ్ డ్రయినేజీ కోసం రూ.10 కోట్లు ఇస్తామన్నారు. తాండ్ర, వెల్దండ పాఠశాలల అభివృద్ధికి తలా రూ.5కోట్లు ఇస్తున్నట్టు తెలిపారు. ఎన్నో ఏండ్ల నుంచి నిరుద్యోగులు ఎదురుచూస్తున్న స్కిల్ యూనివర్సిటీకి రూ. 100 కోట్లతో కడ్తాల మండలం ముచ్చర్లలో మూడు రోజుల్లో భూమి పూజ చేయబోతున్నట్టు ప్రకటించారు. ఇప్పటికే రుణమాఫీలో భాగంగా లక్ష రుణం మాఫీ చేశామని, ఈ నెల చివరి కల్లా రెండో విడత పూర్తి చేస్తామని, ఆగస్టు 15 నాటికి రూ.2 లక్షలు మాఫీ చేసి తీరుతామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రూ.500కే సిలిండర్, ఉచిత విద్యుత్ వంటి పథకాలు ఇప్పటికే అమలు చేస్తున్నట్టు చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి రాడని కొడుకు ప్రకటిస్తే.. కేసీఆర్ మాత్రం అర్ధగంట ముందే అసెంబ్లీకి రావడం శోచనీయమన్నారు. కేసీఆర్ ఎంత మొత్తుకున్నా ప్రయోజనం లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడగొడితే పార్లమెంట్ ఎన్నికల్లో గుండు సున్నా ఇచ్చారని, స్థానిక ఎన్నికల్లో ఘోర పరాజయం తప్పదని చెప్పారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయఢంకా మోగిస్తుందని దీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలను అభివృద్ధిలో భాగస్వాములను చేస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్ మొదలుకొని జడ్పీ చైర్మెన్ దాకా ప్రతి ఒక్కరినీ గెలిపించే బాధ్యత పార్టీ తీసుకుంటుందని హామీ ఇచ్చారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. పారదర్శక రాజకీయాలు చేయడంలో ఈ ప్రాంత నాయకులకు సాటిలేరన్నారు. యాదృచ్ఛికమో లేక అదృష్టమో కానీ ఉత్తమ పార్లమెంటేరియన్ జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ చేయడం అదృష్టంగా భావిస్తానని అన్నారు. తత్వవేత్తగా, రాజకీయనేతగా జైపాల్ రెడ్డికి ఎవరూ సాటి లేరని కొనియాడారు. సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యులు వంశీచంద్ రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే నారాయణరెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, రాజేష్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు స్థలాన్ని..

పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ-కందుకూరు

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట్ రెవెన్యూ పరిధిలో వృత్తి నైపుణ్యం యూనివర్సిటీ ఏర్పాటు చేయడానికి రెవెన్యూ అధికారులు గుర్తించిన 57 ఎకరాల స్థలాన్ని ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థలానికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వృత్తి నైపుణ్యం యూనివర్సిటీ ఏర్పాటుకు త్వరితగతిన చర్యలు తీసుకొని, పనులు త్వరగా పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి వెంట వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, టీజీఐఐటీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శశాంక, కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.

కమిషన్ల కక్కుర్తి వల్లే మేడిగడ్డ కుంగింది

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. దీనికి కచ్చితంగా మాజీ సీఎం కేసీఆరే బాధ్యత వహించాలని చెప్పారు. ఆదివారంనాడిక్కడి జలసౌధలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి కే తారకరామారావు పిచ్చి కూతలు కూయడం మానుకోవాలని హితవు పలికారు. మేడిగడ్డ కుంగుబాటుకు కాంగ్రెస్ మంత్రులపైనే అనుమానాలు వస్తున్నాయని ఆయన చేసిన ఆరోపణలు సత్యదూరమనీ, దానికి సంబంధించిన ఆధారాలు ఏవైనా ఉంటే జస్టిస్ ఘోష్ విచారణ కమిషన్‌కు ఇవ్వాలని సూచించారు. కేసీఆర్ కుటుంబం ధనదాహంతో నీటిపారుదల రంగాన్ని సర్వనాశనం చేశారనీ, వాస్తవాలను వక్రీకరించడం గులాబీదండుకు వెన్నతో పెట్టిన విద్య విమర్శించారు. కేటీఆర్ వ్యాఖ్యలు కూడా దానిలో భాగమేననీ, ఇప్పటికైనా గోబెల్ ప్రచారం ఆపాలని హితవు పలికారు. అసలు సెంట్రల్ వాటర్ కమిషన్ అనుమతి తీసుకోకుండా రూ.94 వేల కోట్లు ఎలా ఖర్చు చేశారని ప్రశ్నించారు. పార్లమెంటు చట్టం ద్వారా జాతీయ ఆనకట్టల భద్రతా పర్యవేక్షణ సంస్థ(ఎన్డీఎస్ఏ) ఏర్పడిందనీ, దానిలో దేశంలోనే పేరొందిన ఇంజినీరింగ్ నిపుణులు ప్రతినిధులుగా ఉన్నారని తెలిపారు. వారి సలహా మేరకే పంపింగ్ నిలుపుదల చేశామన్నారు. మేడిగడ్డకు పంపింగ్ చేస్తే ఆస్తి, ప్రాణనష్టం సంభవిస్తుందనీ, దానితో పాటు సమ్మక్క-సారక్క ప్రాజెక్ట్ కొట్టుకు పోతుందనీ, సీతారామ ప్రాజెక్టు డ్యామేజ్ అవుతుందనీ, 44 గ్రామాలతో పాటు సుప్రసిద్ధ భద్రాచలం దేవస్థానం కూడా ముంపునకు గురవుతుందని ఇంజినీరింగ్ నిపుణులు హెచ్చరించారని తెలిపారు. తాము ఎన్డీఎస్ఏ చెప్పినట్టు చేస్తామే తప్ప, కేసీఆర్, కేటీఆర్ చెత్త సలహాలను పాటించబోమని స్పష్టంచేశారు. మేడిగడ్డ, సుందిళ్ళ, అన్నారంలను ఉపయోగంలోకి తేవాలనేదే తమ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ఉత్తర తెలంగాణకు నీళ్లు రాకుంటే అక్కడ రైతాంగానికి కేసీఆరే కారణం అవుతారని అన్నారు. నాన్ బ్యాంకింగ్ కార్పోరేషన్‌ల నుంచి అధిక వడ్డీలతో అప్పులు చేశారన్నారు. "ప్రాజెక్ట్ పూర్తే కాలేదు. ఇప్పటికే వడ్డీ, అసలు కలిపి ఏడాదికి రూ.15 వేల కోట్లు కడుతున్నాం. ప్రాజెక్ట్ పూర్తి అయితే అసలు, వడ్డీ కలిపి ఏడాదికి రూ. 25 వేల కోట్లు కట్టాల్సి వస్తుంది" అని వివరించారు. ఈ ప్రాజెక్టును పూర్తిచేయాలంటే ఇంకా రూ.లక్షా 47 వేల కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉంటుందన్నారు. రూ.38,500 కోట్ల అంచనా వ్యయంతో మొదలు పెట్టిన చేవెళ్ల-ప్రాణహిత ప్రాజెక్టును పూర్తి చేస్తే ప్రజలపై ఇంతటి ఆర్థిక భారం పడేది కాదని అభిప్రాయపడ్డారు. ఈప్రాజెక్ట్ పూర్తయితే విద్యుత్ బిల్లుల ఖర్చు సంవత్సరానికి రూ. వెయ్యి కోట్లు మాత్రమే అయ్యేవనీ, రీ-డిజైనింగ్, రీ-ఇంజినీరింగ్ వల్ల ఇప్పుడు కరెంటు బిల్లులు రూ.పదివేల కోట్లు వస్తున్నాయని తెలిపారు.

సం'క్షా'మ హాస్టళ్లు

(మొదటిపేజీ తరువాయి)

అనిపిస్తున్నారు. కాస్మోటిక్ ఛార్జీలు తలనూనెకూ సరిపోవట్లేదు.

రాష్ట్ర వ్యాప్తంగా సాంఘీక సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. కాస్తోకూస్తో గురుకులాలపైన పెట్టిన శ్రద్ధ సంక్షేమ హాస్టళ్లపై పెట్టని పరిస్థితి ఉంది. సామాజిక తరగతులకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు వసతి పొందుతూ చదువుకుంటున్న హాస్టళ్లలో పౌష్టికాహార లోపం స్పష్టంగా కనిపిస్తుంది. విద్యార్థులకు అందించాల్సిన ఆహార పదార్థాల్లో నాణ్యతాప్రమాణాలు ఉండట్లేదు. ప్రభుత్వం మెస్ ఛార్జీలు పెంచకపోవడంతో హాస్టల్ వార్డెన్స్ సైతం ఉన్నంతలో పిల్లలకు పూట గడిచేలా చూస్తున్నారు. రాష్ట్రంలో 1750 వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లున్నాయి. వీటిల్లో 2.5 లక్షల మంది వరకు విద్యార్థులు వసతి పొంది చదువుకునేందుకు వీలుంది. గురుకులాలకు పోటీ పెరిగాక సంక్షేమ హాస్టళ్లల్లో విద్యార్థుల సంఖ్య కొద్దిగా తగ్గింది. సంగారెడ్డి జిల్లాలో 93, మెదక్ జిల్లాలో 56, సిద్దిపేట జిల్లాలో 75 వరకు హాస్టళ్లున్నాయి. 3వ తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు వసతి పొందుతున్నారు.

అర్ధాకలిలో హాస్టల్ విద్యార్థులు

సంక్షేమ హాస్టల్ విద్యార్థులు అర్ధాకలితో కాలమెల్లదీస్తున్నారు. చాలీచాలని భోజనం, టిఫిన్‌తో సరిపెట్టుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మెస్ ఛార్జీలు నిర్ణయించి చాలా ఏండ్లు కావస్తున్నది. 3వ తరగతి నుంచి ఏడో తరగతి విద్యార్థులకు నెలకు రూ.950, 8 నుంచి పదో తరగతి విద్యార్థులకు రూ.1100, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు రూ.1500 చొప్పున మెస్ ఛార్జీలు చెల్లిస్తోంది. ప్రభుత్వం బియ్యం మాత్రమే సరఫరా చేస్తోంది. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం, సాయంత్రం స్నాక్స్ అందించాలి. భోజనంలో కూర, సాంబార్, పప్పుతో పాటు కోడిగుడ్డు ఇవ్వాలి. వారంలో రెండు సార్లు చికెన్ పెట్టాలి. స్నాక్స్‌గా పండ్లు, బిస్కెట్స్ ఇతర పదార్థాలివ్వాలి. ఉదయం అల్పాహారంగా ఇడ్లీ, కిచిడీ, ఉప్మా ఇతర ఆహార పదార్థాలివ్వాలి. ప్రభుత్వం చెల్లిస్తున్న మెస్ ఛార్జీలతో భోజనం, టిఫిన్, స్నాక్స్ కోసం అవసరమైన సరుకులేవీ రాని పరిస్థితి ఉంది. చికెన్ ధర కిలో రూ.200 పైనే ఉంది. పాలు లీటర్ ధర రూ.70, గుడ్డు ధర రూ.7 ఉంది. కూరగాయాలు ఏ రకమైనా కిలో ధర రూ.60 నుంచి రూ.100 మధ్య ఉంటున్నాయి. నూనెలు, పప్పులు, కారం, పసుపు, ఇతర సరుకుల ధరలన్నీ నిత్యం పెరుగుతూనే ఉన్నాయి. దాంతో హాస్టల్ విద్యార్థుల మెను గోడలపై బోర్డులకే పరిమితమైంది. వంట గదిలో కనిపించట్లేదు. ధరల పెరుగుదల వల్ల నాసికరం కూరగాయలు, నాణ్యతలేని నూనెలు, పప్పులు, చికెన్ పెడుతున్న పరిస్థితి ఉంది. వారానికి ఒక సారి చికెన్, వారంలో రెండు మూడు గుడ్లు ఇస్తున్నారు.

పేరుకే కాస్మోటిక్ ఛార్జీలు.. అన్నీ ఇంటి నుంచే..

హాస్టల్స్‌లో వసతి పొందే విద్యార్థులకు ప్రభుత్వం పేరుకే కాస్మోటిక్ ఛార్జీలు ఇస్తుంది. కానీ..! తమ అవసరాలకు కావాల్సిన స్నానం, బట్టల సబ్బులు, తలకు కొబ్బరినూనె, హేర్ కటింగ్, బ్రెష్, పేస్ట్, వాజిలిన్ వంటి వస్తువులన్నీ కూడా పిల్లలు తమ ఇంటి నుంచే తెచ్చుకుంటున్నారు. ప్రభుత్వం మొక్కుబడిగా నెలకు బాలురకు రూ.62, బాలికలకు 3 నుంచి ఏడో తరగతి వరకు రూ.55, 8 నుంచి పదో తరగతి విద్యార్థినీలకు రూ.75 చొప్పున కాస్మోటిక్ ఛార్జీలిస్తున్నారు. మార్కెట్‌లో కొబ్బరి నూనె, బట్టలు, స్నానపు సబ్బుల ధరలు విపరీతంగా పెరిగాయి. హేర్ కట్టింగ్ చార్జీ రూ.100 ఉంది. ప్రభుత్వం ఇస్తున్న డబ్బులతో పిల్లలకు కొబ్బరి నూనె కూడా రాని పరిస్థితి ఉంది. అందుకే విద్యార్థులు ప్రభుత్వం ఇచ్చే కాస్మోటిక్ ఛార్జీల గురించి మర్చిపోయి ఇంటిపైనే ఆధారపడ్డారు. అవి ఎప్పుడొస్తాయో వచ్చినా అవి చేతికొచ్చే వరకు గ్యారంటీ లేని పరిస్థితి నెలకొంది.

నాలుగు నెలలుగా బిల్లుల్లేవు

మెస్, కాస్మోటిక్ ఛార్జీల పెండింగ్ బిల్లులే సంక్షేమ హాస్టళ్ల పట్ల సర్కార్ నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తాయి. రాష్ట్రంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు గత విద్యా సంవత్సరంలో ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరంలో జూన్‌లో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగింది. జూన్ 15 నుంచి జులై 25 వరకు బిల్లులు రావాలి. మే నెలలో సెలవుల్లో ఉన్నప్పటికీ మిగతా నెలల్లో విద్యార్థులకు అవసరమైన కూరగాయలు, పాలు, గుడ్లు, చికెన్, మటన్, ఇతర నిత్యవసర వస్తువులన్నీ సంక్షేమ హాస్టల్స్ అధికారులు ఉద్దెర తెచ్చి పెట్టారు. బిల్లులు సకాలంలో రాకపోవడంతో తెచ్చిన సరుకుల డబ్బులకు వడ్డీలు చెల్లించాల్సి వస్తుందని చెబుతున్నారు. ఉద్దెర పుట్టక బంగారం తాకట్టు పెట్టి సరుకులు తెస్తున్నామని పలువురు అధికారులు ఆవేదన వ్యక్తం చేశారు.

నీళ్ల చారు.. చారులాంటి పప్పు

పెరిగిన ధరలకనుగుణంగా మెస్ ఛార్జీలు పెరకపోవడంతో పిల్లలకు చాలీచాలని ఆహార పదార్థాలను నాణ్యతా లోపాలతో అందిస్తున్నారు. భోజనంలో పెట్టే పప్పు చారులా... చారు నీళ్లలా ఉంటుంది. ఇక పాలు, నీళ్లు భలే కలిసిపోతాయి. పండ్ల ధరలు పెరగడంతో విద్యార్థులకు కనీసం అరటి పండు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉంది. గ్యాస్ ధరలు పెరగడం వల్ల ఇడ్లీ, పూరీ మానేసి అన్నంలో పప్పు, ఆలుగడ్డ, టమాటా ముక్కలేసి కిచిడి చేసి పెడుతున్నారు. గుడ్లు సైతం వారంలో ఒకసారి ఇచ్చినా అవి కూడా నాసిరకంగా ఉంటున్నాయి. ఇక కూరగాయలైతే కుళ్లిన టమాటాలు, దోస, బీర, బెండ, దొండ, ఆలు, వంకాయ, గోరుచిక్కుడు వంటివి వండి పెడుతున్నారని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు.


మెస్ ఛార్జీలు రూ.2500 ఇవ్వాలి: అతిమేల మాణిక్, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు

సంక్షేమ హాస్టల్స్ విద్యార్థులకు ఇచ్చే మెస్ ఛార్జీలను రూ.2500లకు పెంచాలి. పెరిగే ధరలకు సరిపడేలా మెస్ ఛార్జీలు పెంచడంలో ప్రభుత్వం నిర్లక్షం చేస్తున్నది. కాస్మోటిక్ ఛార్జీలను కూడా రూ.250, కళాశాల విద్యార్థులకు రూ.1000 పాకెట్ మనీ కింద ఇవ్వాలి. హాస్టల్స్‌లో నెలకొన్న సమస్యలపై కేవీపీఎస్ సర్వేలు చేస్తున్నది. మంచినీళ్లు, కరెంట్, దుప్పట్లు, అద్దె భవనాలు, అపరిశుభ్రత వంటి సమస్యలున్నాయి. తినే తిండి నాణ్యతలేదు. గుడ్లు, చికెన్, మటన్ నెలకోసారి కూడా పెట్టట్లేదు. మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తం.

రాబందులు తగ్గాయ్

న్యూఢిల్లీ : భారత్‌లో రాబందుల అంతం మానవుడి అస్తిత్వంపై ప్రభావం చూపుతున్నది. రాబందుల జనాభా క్షీణత కారణంగా ఐదేండ్లలో ఐదు లక్షల మానవ మరణాలు నమోదయ్యాయని అమెరికన్ ఎకనామిక్ అసోసియేషన్ జర్నల్ వివరించింది. ఈ జర్నల్ ప్రకారం.. 1990లలో భారత్‌లో రాబందులు దాదాపు అంతరించిపోవటంతో కళేబరాల నుంచి ప్రాణాంతకమైన బాక్టీరియా, ఇన్‌ఫెక్షన్‌లు వృద్ధి చెందాయి. ఇది ఐదేండ్లలో ఐదు లక్షల మంది మరణానికి దారితీసింది. భారత్ 2000 నుంచి 2005 వరకు రాబందుల జనాభాను కోల్పోవటంతో ఏడాదికి 69.4 బిలియన్ డాలర్ల (రూ. 58,621 కోట్లు) ఆర్థిక నష్టాన్ని చవిచూసింది. భారతీయ పర్యావరణ వ్యవస్థకు అత్యంత అవసరమైన పక్షుల్లో రాబందు ఒకటి అని అధ్యయన రచయితలు పేర్కొన్నారు. రైతులు వ్యాధులతో బాధపడుతున్న పశువులకు డైక్లోఫెనాక్ అనే శోథ నిరోధక మందును ఇవ్వటం ప్రారంభించిన తర్వాత వాటి జనాభాలో బాగా తగ్గుదల కనిపించింది. రాబందు మూత్రపిండాలపై ప్రాణాంతక ప్రభావాన్ని చూపే మందు, పశువుల కళేబరాల్లో ఉండి పక్షికి ప్రాణాంతకంగా మారింది. కాగా, డైక్లోఫెనాక్‌ను భారత ప్రభుత్వం 2006లో నిషేధించింది. అయితే, దాని ప్రభావంతో రాబందులు ఐదు కోట్ల నుంచి కేవలం వేల సంఖ్యకు తగ్గాయని అధ్యయనం తెలిపింది. దీంతో జంతువుల కళేబరాలు కుళ్లిపోవటంతో అంటువ్యాధులు, ఇతర వ్యాధులు ప్రబలే అవకాశమున్నది.రాబందుల జనాభా ప్రభావాన్ని అర్థం చేసుకోవటానికి పరిశోధకులు 600 కంటే ఎక్కువ జిల్లాలకు సంబంధించిన ఆరోగ్య రికార్డులను పరిశీలించారు.

గొడ్డు మాంసం తినటంపై నిషేధమున్న భారత్ వంటి దేశంలో చాలా పశువులు కళేబరాలుగా మారుతున్నాయని అధ్యయన సహ రచయిత అనంత్ సుదర్శన్ ఎత్తి చూపారు. చికాగో విశ్వవిద్యాలయం హారిస్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీలో అసిస్టెంట్ ప్రొఫెసర్, సహ రచయిత అయిన ఇయాల్ ఫ్రాంక్ మాట్లాడుతూ.. "రాబందులు ప్రకృతి పారిశుధ్య సేనగా పరిగణించబడుతున్నాయి. ఎందుకంటే అవి మన వాతావరణం నుంచి బ్యాక్టీరియా, వ్యాధికారకాలను కలిగి ఉన్న చనిపోయిన జంతువులను తొలగించటంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి" అని తెలిపారు.



జూరాలకు భారీగా వరద

నవతెలంగాణ -ధరూర్

వారం రోజులుగా జోగులాంబ గద్వాల జిల్లాతో పాటు ఎగువన కురుస్తున్న వర్షాలతో జూరాల ప్రాజెక్టుకు వరద నీరు పోటెత్తుతోంది. ఎగువ ప్రాంతం ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌ల నుంచి భారీ ఎత్తున వరద నీరు చేరుతోందని పీజేపీ అధికారులు తెలిపారు. ఎగువ నుంచి వరద నీరు వస్తుండటంతో 41 గేట్లు ఎత్తి శ్రీశైలానికి సుమారు 2,75,538 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఆరు యూనిట్ల ద్వారా 18,938 టీఎంసీల నీటిని జలవిద్యుత్ కేంద్రం ద్వారా దిగువకు వదులుతున్నట్టు అధికారులు తెలిపారు. జూరాలతో పాటు సుంకేశుల నుంచి 1.40లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండటంతో శ్రీశైలం జలశయానికి భారీగా నీరు చేరుతోంది. కుడి, ఎడమగట్టు విద్యుత్ కేంద్రాల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసి 60,977 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 872.60 అడుగులకు చేరింది.







బ్రాంజ్ భాకర్

- మను భాకర్‌కు కాంస్య పతకం
- పతక ఖాతా తెరిచిన టీమ్ ఇండియా

పారిస్ 2024 ఒలింపిక్స్

పుష్కర కాల నిరీక్షణకు తెరపడింది. 2012 ఒలింపిక్స్ తర్వాత షూటింగ్‌లో భారత్ తొలి పతకం సాధించింది. స్టార్ షూటర్ మను భాకర్ ఒలింపిక్స్‌లో పతక చరిత్ర సృష్టించింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో కాంస్య పతకం సాధించిన మను భాకర్.. ఒలింపిక్స్‌లో పతకం సాధించిన తొలి భారత షూటర్‌గా నిలిచింది.

టోక్యో ఒలింపిక్స్ పీడకలకు మను భాకర్ ముగింపు పలికింది. పతక ఫేవరేట్‌గా టోక్యోకు వెళ్లిన మను భాకర్.. పిస్టల్‌లో సాంకేతిక లోపంతో సుమారు ఐదు నిమిషాల సమయం కోల్పోయింది. స్వల్ప తేడాతో మెడల్ రౌండ్‌కు దూరమైంది. పారిస్ ఒలింపిక్స్‌లో అర్హత రౌండ్ నుంచి అద్భుత ప్రదర్శన చేసిన మను భాకర్ కాంస్య పతకంతో ఒలింపిక్ క్రీడల రెండో రోజే భారత్ గర్వపడేలా చేసింది.

నవతెలంగాణ-పారిస్

మను భాకర్ (22) పతక చరిత్ర సృష్టించింది. విశ్వ క్రీడల్లో భారత్‌కు పతకం సాధించిన తొలి మహిళా షూటర్‌గా నిలిచింది. పారిస్ 2024 ఒలింపిక్స్ మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో మను భాకర్ కాంస్య పతకం సాధించింది. ఆదివారం జరిగిన ఫైనల్లో మను భాకర్ మూడో స్థానంలో నిలిచింది. ఎనిమిది మంది మేటి షూటర్లు పోటీపడిన ఫైనల్లో మను భాకర్ ఉత్తమ ప్రదర్శన కనబరిచింది. 221.7 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సొంతం చేసుకుంది. 0.1 పాయింట్ తేడాతో పసిడి పోరుకు దూరమైన మను భాకర్.. తృటిలో సిల్వర్ మెడల్ చేజార్చుకుంది. దక్షిణ కొరియాకు చెందిన షూటర్లు స్వర్ణం, రజతం సొంతం చేసుకున్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ఇదే తొలి పతకం కాగా.. సుమారు 12 ఏండ్ల తర్వాత ఒలింపిక్స్ షూటింగ్‌లో భారత్ సాధించిన తొలి మెడల్ ఇదే కావటం విశేషం.

సూపర్ మను

శనివారం జరిగిన అర్హత రౌండ్‌లో మూడో స్థానంలో నిలిచిన మను భాకర్.. ఆదివారం జరిగిన ఫైనల్లో అద్భుత ప్రదర్శన చేసింది. తొలి దశలో (ఐదు రౌండ్లు) 50.4 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. కానీ తర్వాతి దశలో మను భాకర్ రెండో స్థానాన్ని దక్షిణ కొరియా షూటర్‌కు కోల్పోయింది. 221.7 పాయింట్లతో మను భాకర్ కాంస్య పతకం సాధించగా.. 221.8 పాయింట్లతో కిమ్ యెజి (దక్షిణ కొరియా) పసిడి పోరుకు చేరుకుంది. పసిడి పోరులో దక్షిణ కొరియాకే చెందిన షూటర్ యే జిన్ 243.2 పాయింట్లతో (ఒలింపిక్ రికార్డు) పసిడి పతకం సాధించగా.. కిమ్ యెజి 241.3 పాయింట్లతో రజత పతకం సొంతం చేసుకుంది. అర్హత రౌండ్‌లో అగ్రస్థానంలో నిలిచిన మేజర్ వెరోనికా (హంగరీ) ఫైనల్లో తొలి రౌండ్లోనే పోటీ నుంచి నిష్క్రమించింది. విన్హ్ (వియత్నాం), లీ (చైనా), రాంక్సిన్ (చైనా), తర్హన్ (టర్కీ)లు టాప్-7లో నిలిచారు.

> ఆఖరు క్షణం వరకు పతక రేసులో నిలిచేందుకు సర్వశక్తులా కష్టపడ్డాను. ఏ దశలో ఆశలు కోల్పోకుండా.. ఉత్తమ ప్రదర్శన కోసం ప్రయత్నిస్తూనే ఉన్నాను. పతక పోరులో పోటీ నువ్వా నేనా అన్నట్టు సాగింది. 0.1 పాయింట్ వ్యత్యాసంతో సిల్వర్ మెడల్ చేజార్చుకున్నాను. కాంస్య పతకం సాధించి భారత్ గర్వపడేలా చేసినందుకు ఎంతో సంతోషంగా ఉంది
>
> - మను భాకర్

ఏకైక మహిళా షూటర్

ఒలింపిక్స్‌లో భారత షూటింగ్‌కు ఘనమైన రికార్డు ఉంది. 2004 ఏథెన్స్ ఒలింపిక్స్ నుంచి 2012 లండన్ ఒలింపిక్స్ వరకు భారత్ షూటింగ్‌లో పతకాలు సాధించింది. రాజ్యవర్థన్ సింగ్ రాథోడ్ 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో భారత్‌కు సిల్వర్ మెడల్ (డబుల్ ట్రాప్) సాధించాడు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో అభినవ్ బింద్రాకు ఏకంగా 10మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో పసిడి పతకం తీసుకొచ్చాడు. 2012 లండన్ ఒలింపిక్స్‌లో గగన్ నారంగ్ (మెన్స్ 10మీ ఎయిర్ రైఫిల్), విజయ్ కుమార్ (మెన్స్ 25మీ ర్యాపిడ్ ఫైర్ పిస్టల్) వరుసగా సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించారు. కానీ ఆ తర్వాత వరుసగా 2016, 2020 ఒలింపిక్స్‌లో భారత్‌కు షూటింగ్‌లో పతకం దక్కలేదు. 12 ఏండ్ల నిరీక్షణకు తెరదించుతూ మను భాకర్ పారిస్‌లో పతకం గురి పెట్టింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో కాంస్య పతకం సాధించింది. గత 20 ఏండ్లలో ఒలింపిక్స్ షూటింగ్‌లో పతక రౌండ్‌కు తొలి భారత మహిళా షూటర్‌గా నిలిచిన మను భాకర్.. కొద్ది క్షణాల్లోనే పతకం సాధించిన ఏకైక షూటర్‌గా చరిత్ర పుటల్లో నిలిచింది.

పతక వేటలో మనోళ్లు



పారిస్ ఒలింపిక్స్ మూడో రోజు భారత అథ్లెట్లు మూడు క్రీడాంశాల్లో పతక వేట సాగించనున్నారు. షూటింగ్‌లో రమిత, అర్జున్ సహా ఆర్చరీలో మెన్స్ జట్టు మెడల్ రేసులో నిలిచారు. మహిళల 10మీ ఎయిర్ రైఫిల్ ఫైనల్లో రమిత.. మెన్స్ 10మీ ఎయిర్ రైఫిల్ ఫైనల్లో అర్జున్ పోటీపడుతున్నారు. మెన్స్ ఆర్చరీ జట్టు క్వార్టర్స్‌లో నెగ్గితే కనీసం కాంస్య పతకం సాధించనుంది. సెమీస్‌లో సైతం విజయం సాధిస్తే ఏకంగా పసిడి పోరుకు చేరుకోనున్నారు.

> టోక్యో ఒలింపిక్స్ అనంతరం ఎంతో నిరుత్సాహానికి గురయ్యాను. అయినా, బలంగా పుంజుకున్నాను. గతాన్ని గతంలోనే ఉండిపోని. పారిస్ ఒలింపిక్స్‌లో మెడల్ సాధించటం గర్వంగా ఉంది'
>
> - మను భాకర్

చాంపియన్ షూటర్

ఒలింపిక్ పతకం ధైర్యవంతులే సాధిస్తారు!. మను భాకర్ ఈ విషయాన్ని మరోసారి నిరూపించింది. 2020 టోక్యో ఒలింపిక్స్. షూటింగ్‌లో భారత్‌పై ఎన్నో అంచనాలు. పతక ఆశల భారాన్ని 19 ఏండ్ల యువ షూటర్ మను భాకర్ భుజాన వేసుకుంది. పిస్టల్ సాంకేతిక లోపం సహా ఒత్తిడిలో మను భాకర్‌కు ఏదీ కలిసి రాలేదు. మూడు పతక ఈవెంట్లలో పోటీపడిన మను భాకర్.. రెండు ఈవెంట్లలో కనీసం పతక పోరుకు అర్హత సాధించలేదు. ప్రపంచకప్‌లలో పతకాల వర్షం కురిపించిన మను భాకర్ విమర్శలకు గురైంది. మానసికంగా మను భాకర్ అత్యంత క్లిష్ట దశకు చేరుకుంది. ఆ స్థితి నుంచి మళ్లీ పుంజుకుని పోటీల్లో నిలిచేందుకు కొండంత ధైర్యం కావాలి. మను భాకర్ అది చేసి చూపించింది. సున్నా నుంచి మొదలుపెట్టింది. పారిస్ ఒలింపిక్స్‌లో పతకం సాధించింది.



మూడేండ్లలో మను భాకర్ తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంది. శనివారం పారిస్ ఒలింపిక్స్‌లో ఫైనల్‌కు చేరుకుంది. అర్హత రౌండ్‌లో మను భాకర్‌లో ఎటువంటి భావోద్వేగాలు కనిపించలేదు. తన ముందు కెరీర్‌లో అతి పెద్ద సవాల్ నిలిచినా.. మను భాకర్ భావోద్వేగాలను నియంత్రించుకుంది. ఉత్కంఠ పోటీకి ఎదురొడ్డి పతకంపై గురి ఎక్కుపెట్టింది. ఒలింపిక్ మెడల్ సాధించిన అనంతరం మను భాకర్ భగవద్గీతలో అర్జునుడికి శ్రీకృష్ణుడి ఉపదేశాన్ని ప్రస్తావించింది. మహాభారతంలో అర్జునుడు బాణం లక్ష్యంపైనే ఎక్కుపెట్టినట్టు.. మను భాకర్ సైతం తన దృష్టిని పతకంపైనే కేంద్రీకరించింది. 22 ఏండ్ల మను భాకర్‌కు ఒలింపిక్స్‌లో ఇది కేవలం ఆరంభం మాత్రమే. పారిస్ ఒలింపిక్స్‌లో మను భాకర్ మరో రెండు పతక ఈవెంట్లలో పోటీపడనుంది. మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్, 10 మీటర్ల పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మను భాకర్ పోటీపడనుంది.

నిఖత్ మొదలెట్టింది!

తొలి రౌండ్లో స్టార్ బాక్సర్ అలవోక విజయం

పారిస్ : భారత స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ పతక వేట మొదలెట్టింది. మహిళల 50 కేజీల బాక్సింగ్ తొలి మ్యాచ్‌లో గెలుపు పంచ్ విసిరింది. జర్మనీ బాక్సర్ మ్యాక్సీ కరీనాపై 5-0తో ఏకపక్ష విజయం సాధించింది. తొలి రౌండ్లో బలమైన పంచ్‌లు సంధించినా 3-2తో గట్టెక్కిన నిఖత్.. రెండో రౌండ్‌లో పంచ్ పదును పెంచింది. మూడో రౌండ్లోనూ మెప్పించిన నిఖత్ జరీన్ 5-0తో క్లీన్ విక్టరీ నమోదు చేసింది. తర్వాతి మ్యాచ్‌లో టాప్ సీడ్, చైనా బాక్సర్ వు యూతో నిఖత్ జరీన్ పోటీపడనుంది. 52 కేజీల విభాగంలో వు యూ వరల్డ్ చాంపియన్. ఆసియా క్రీడల్లోనూ పసిడి సాధించింది. నిఖత్‌కు కఠిన డ్రా ఎదురైనా.. పతక వేటలో ఆత్మవిశ్వాసంతో కనిపిస్తుంది. టేబుల్ టెన్నిస్‌లో తెలంగాణ స్టార్ ఆకుల శ్రీజ 4-0 (11-4, 11-9, 11-7, 11-8)తో తొలి మ్యాచ్‌లో విజయం సాధించింది. బ్యాడ్మింటన్‌లో పి.వి సింధు శుభారంభం చేసింది. 21-9, 21-6తో తొలి రౌండ్లో అబ్దుల్ నబా (మాల్దీవులు)పై విజయం సాధించింది. మెన్స్ సింగిల్స్‌లో హెచ్.ఎస్ ప్రణయ్ 21-18, 21-12తో ఫబియన్‌పై గెలుపొందాడు. వెటరన్ స్టార్ శరత్ కమల్ తొలి రౌండ్లో అనూహ్య పరాజయం చవిచూశాడు. షూటింగ్‌లో అర్జున్ బబుత 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మెన్స్ ఫైనల్‌కు అర్హత సాధించాడు. అర్హత రౌండ్‌లో సందీప్ సింగ్ 12వ స్థానంలో నిలిచి పతక పోరుకు దూరమయ్యాడు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో ఎలవేనిల్ వలరివన్ ఫైనల్‌కు అర్హత సాధించలేదు. రమిత జిందాల్ ఐదో స్థానంతో పతక పోరుకు చేరుకుంది. రోయింగ్ రిపిచేజ్ రౌండ్లో బల్‌రాజ్ పన్వార్ రెండో స్థానంలో నిలిచి క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్నాడు. టెన్నిస్‌లో నగాల్ మూడు సెట్ల ఉత్కంఠ మ్యాచ్‌లో పోరాడి ఓడాడు.

క్వార్టర్స్‌లో పరాజయం

నిరాశపరిచిన మహిళా ఆర్చర్లు



పారిస్ : 2024 ఒలింపిక్స్‌లో పతక ఆశలతో బరిలోకి దిగిన భారత మహిళా ఆర్చర్లు నిరాశపరిచారు. ర్యాంకింగ్ రౌండ్‌లో మెప్పించి నేరుగా క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్న మహిళల జట్టు.. క్వార్టర్స్‌లో తడబడింది. నెదర్లాండ్స్ చేతిలో 0-6తో ఓటమి చెందింది. అంకిత, భజన్ కౌర్, దీపిక కుమారిలు వరుసగా మూడు సెట్లలో అంచనాలను అందుకోలేదు. 51-52, 49-54, 48-53తో డచ్ జట్టుకు సెమీఫైనల్ బెర్త్ కోల్పోయారు. భజన్ కౌర్ మూడు సార్లు 10, రెండు సార్లు 9, ఓసారి 8 పాయింట్లు స్కోరు చేయగా..దీపిక కుమారి, అంకిత బలమైన గాలులకు అనుగుణంగా బాణం సంధించటంలో విఫలమయ్యారు. మెన్స్ జట్టు నేడు క్వార్టర్‌ఫైనల్లో పోటీపడనుంది. ఆర్చరీలో వ్యక్తిగత విభాగాల్లో పోటీలు మంగళవారం నుంచి మొదలవుతాయి.




మహిళల ఆసియా కప్ విజేతగా శ్రీలంక నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో భారత మహిళల జట్టుపై 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. భారత్ 165/6 పరుగులు చేయగా, శ్రీలంక 167/2 పరుగులు చేసింది.



అందమైన ముక్కోణ ప్రేమకథ

హీరో విశ్వక్ సేన్ 'మెకానిక్ రాకీ'గా అలరించబోతున్నారు. ఈ మాస్ యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్‌కి నూతన దర్శకుడు రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహిస్తు న్నారు. ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్ మెంట్స్‌పై నిర్మాత రామ్ తాళ్లూరి నిర్మించారు. ఈ మూవీ ఫస్ట్ గ్లింప్స్‌ని మేకర్స్ ఆదివారం లాంచ్ చేశారు.
విశ్వక్ సేన్ మాట్లాడుతూ, 'ఇది జస్ట్ గ్లింప్స్ మాత్రమే. ఈ ఏడాది చాలా స్పెషల్. నా మూడో సినిమా కూడా రాబోతోంది. ఈ సినిమా అవుట్ పుట్ ఇంత గ్రాండ్‌గా రావడానికి కారణం నిర్మాత రామ్ తాళ్లూరి. దర్శకుడు రవితేజ చాలా ట్యాలెంటెడ్. సినిమాని చాలా అద్భుతంగా తీశారు. ఇదొక బ్యూటీఫుల్ ట్రయాంగిల్ లవ్‌స్టోరీ. మలక్ పేట్ బ్యాక్‌డ్రాప్ ఉండే కథ ఇది. చాలా మంచి కామెడీ టైమింగ్‌తో నా క్యారెక్టర్ చాలా కనెక్టింగ్‌గా ఉంటుంది. ఇదొక రొమాంటిక్ కామెడీ, యాక్షన్ థ్రిల్లర్. ఇది దీవాళి క్రాకర్ అవుతుంది' అని అన్నారు.
'ఇదొక మంచి మాస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. అక్టోబర్ 31న మీ ముందుకు వస్తున్నాం. మీ అందరూ ఎంజాయ్ చేస్తారు. రవితేజ కొత్త దర్శకుడైన చాలా గొప్పగా తీశాడు. విశ్వక్ ఎనర్జీ గురించి చెప్పాల్సిన అవసరం లేదు. చాలా మంచి రోల్ చేస్తున్నారు. మీ అందరికీ నచ్చుతుంది' అని నిర్మాత రామ్ తాళ్లూరి చెప్పారు.
'జేక్స్ బిజోయ్ వండర్ ఫుల్ మ్యూజిక్ ఇచ్చాడు. నాకు ఈ అవకాశం ఇచ్చిన నిర్మాత రామ్ తాళ్లూరి , హీరో విశ్వక్‌కి థ్యాంక్స్' అని డైరెక్టర్ రవితేజ చెప్పారు.

కుబేరలో ధనుష్ విశ్వరూపం



ధనుష్

ధనుష్, నాగార్జున, శేఖర్ కమ్ముల వంటి భిన్న కాంబినేషన్‌లో రూపొందుతున్న మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'కుబేర'. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. మేకర్స్ డిఫరెంట్ పోస్టర్లు, గ్లింప్స్ ద్వారా సినిమాలోని ప్రధాన పాత్రలను పరిచయం చేశారు. ఆదివారం ధనుష్ పుట్టినరోజు.
ఈ నేపథ్యంలో మేకర్స్ అద్భుతమైన పోస్టర్‌ని రిలీజ్ చేశారు. పోస్టర్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. ఇదివరకూ ఎన్నడూ చేయని క్యారెక్టర్‌లో కనిపిస్తున్నారు ధనుష్. ఇందులో ధనుష్ తన నట విశ్వరూపాన్ని చూపించబోతున్నారని ఈ పోస్టర్ చెప్పకనే చెప్పింది. ఈ చిత్రంలో రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తుండగా, జిమ్ సర్బ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పి, అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌పై సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రం తమిళం, తెలుగు, హిందీ భాషల్లో మల్టీలాంగ్వేజ్ ప్రాజెక్ట్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.

నవచిత్రం

100% బెటర్‌గా ఉంటుంది



రవితేజ, డైరెక్టర్ హరీష్ శంకర్ కాంబోలో రూపొందుతున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. ఆదివారం మేకర్స్ చిత్ర టీజర్‌ను లాంచ్ చేశారు.
టీజర్ లాంచ్ సందర్భంగా దర్శకుడు హరీష్‌శంకర్ మాట్లాడుతూ, '80, 90ల మధ్య జరిగేకథ ఇది. కొంచెం పొయిటిక్‌గా చెప్పాలంటే ల్యాండ్ లైన్స్, క్యాసెట్ రికార్డింగ్ సెంటర్లు, చేతక్ స్కూటర్లు, కుమార్ షాను పాటలు ఇవన్నీ కలిపితే 'మిస్టర్ బచ్చన్'. ఫస్ట్ హాఫ్‌లో చాలా నోస్టాలజిక్ మూమెంట్స్ ఉంటాయి. ఇందులో అమితాబ్ బచ్చన్‌ని బేస్ చేసుకొని చాలా మంచి ఐటమ్స్ ఉన్నాయి. అవి స్క్రీన్ మీద చూస్తే బావుంటుంది. 'మిరపకాయ్'లో రవితేజని చాలా అద్భుతంగా చూపించాను. ఇందులో అంతకుమించి చూడబోతున్నారు. ఈ సినిమా టేకింగ్ పరంగా, విజువల్, మ్యూజిక్, హీరో క్యారెక్టరైజేషన్ పరంగా 'మిరపకాయ్' కంటే మిస్టర్ బచ్చన్ హండ్రెడ్ టైమ్స్ బెటర్‌గా ఉంటుంది. నా కెరీర్ ఫాస్టెస్ట్ సినిమా ఇది. దీనికి కారణం మా నిర్మాత విశ్వప్రసాద్. 78 రోజుల షూటింగ్‌లో ఏ రోజూ ఇబ్బంది పడలేదు. 'మిస్టర్ బచ్చన్' టైటిల్ పెట్టడానికి కారణం కథపరంగా చిన్న పిట్టకథ ఉంటుంది. ఈ టైటిల్ పెట్టింది కూడా రవితేజానే' అని చెప్పారు.
'ఆగస్ట్ 15న సినిమాని విడుదల చేస్తున్నాం. ఐదు రోజుల హాలీడేస్‌కి రెండు పెద్ద సినిమాలు వస్తున్నాయి. మరో తమిళ్ సినిమా, చిన్న సినిమా కూడా వస్తోంది. మన థియేటర్ సిస్టమ్ అన్నింటినీ సపోర్ట్ చేయగలదు' అని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ అన్నారు.

దుల్కర్ సల్మాన్ హీరోగా ఆకాశంలో ఒక తార



దుల్కర్ సల్మాన్

దుల్కర్ సల్మాన్ వైవిధ్యమైన పాత్రలు, సినిమాలతో తెలుగులోనూ తనదైన ముద్ర వేశారు. 'మహానటి, సీతారామం' వంటి సూపర్ హిట్ చిత్రాల్లో ఆయన నటన అత్యద్భుతం. రీసెంట్‌గా విడుదలైన పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ 'కల్కి 2898 ఏడీ'లోనూ అతిథి పాత్రలోనూ దుల్కర్ అలరించారు. తాజాగా ఆయన కథానాయకుడిగా తెలుగులో ఓ సినిమా ప్రారంభమైంది.
ఆదివారం దుల్కర్ సల్మాన్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. 'ఆకాశంలో ఒక తార'గా తెరకెక్కబోతున్న ఈ మూవీ పోస్టర్‌లో దుల్కర్ సల్మాన్ లుక్ చాలా సింపుల్‌గా ఉంది. ఓ రైతులా కనిపిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలైన గీతా ఆర్ట్స్, స్వప్న సినిమాలతో పాటు లైట్ బాక్స్ మీడియా బ్యానర్స్ సమర్పణలో సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం ఈ మూవీని నిర్మిస్తున్నారు. త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానున్న ఈ సినిమాలోని నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే తెలియజేస్తామని మేకర్స్ తెలియజేశారు. ఈ సినిమా తెలుగు, తమిళ, హిందీ, మలయాళ భాషల్లో అలరించనుంది.

శభాష్ సోదరా.. దుల్కర్ సల్మాన్ హీరోగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న చిత్రం 'లక్కీ భాస్కర్', వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, "శ్రీమతి గారు" గీతం విశేషంగా ఆకట్టుకొని, సినిమాపై అంచనాలను పెంచాయి. ఆదివారం దుల్కర్ సల్మాన్ పుట్టినరోజు
సందర్భంగా ఈ చిత్రం నుంచి టైటిల్ ట్రాక్‌ను చిత్ర బృందం ఆవిష్కరించింది. ఈ పాట మనల్ని 1980-90ల రోజుల్లోకి తీసుకెళ్తోంది. వాయిద్యాలు వినియోగించిన విధానం, ముఖ్యంగా లెజెండరీ సింగర్ ఉషా ఉతుప్ గాత్రం.. ఈ గీతాన్ని ఓ కమ్మటి విందు భోజనంలా మలిచాయి. 'శభాష్ సోదరా.. కాలరెత్తి తిరగరా.. కరెన్సీ దేవి నిను వరించెరా' అంటూ రామజోగయ్యశాస్త్రి తనదైన సాహిత్యంతో హీరో పాత్రను ఆవిష్కరించడంతో పాటు, శ్రోతలలో స్ఫూర్తి నింపేలా సాహిత్యాన్ని అందించారు. సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ ఈ పాట కోసం 1980ల నాటి ఇండి-రాక్‌ని ప్రస్తుత తరానికి తగ్గట్టుగా స్వరపరిచారు. ఈ సినిమా షూటింగ్ ఇటీవలే పూర్తయింది. తెలుగు, మలయాళం, హిందీ, తమిళ భాషల్లో సెప్టెంబర్ 7న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది.

అందర్నీ మెప్పించే క్రేజీ రాంబో



షమ్ము హీరోగా హరీష్ మధురెడ్డి దర్శకత్వంలో సప్తాశ్వ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రూపొందుతున్న చిత్రం 'క్రేజీ రాంబో'. పూజా కార్యక్రమాలతో ఈ సినిమా గ్రాండ్‌గా ప్రారంభమైంది. ఈ వేడుకలో హీరో అశ్విన్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
కామెడీ, యాక్షన్, డ్రామా, రొమాన్స్‌తో రోలర్-కోస్టర్ రైడ్‌గా ఈ సినిమా ఉండబోతోంది. రాంబోగా హీరో షమ్ము చాలా ఇంట్రెస్టింగ్ క్యారెక్టర్‌లో కనిపించ బోతున్నారు. సినిమా స్క్రీన్‌ప్లే, డైలాగ్‌లు, సంగీతం గ్రేట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని అందించనున్నాయి.
టైటిల్ లాంచ్ ఈవెంట్‌లో హీరో అశ్విన్ బాబు మాట్లాడుతూ, 'టైటిల్ చాలా ఆసక్తికరంగా ఉంది. సినిమా తప్పకుండా క్రేజీగా ఉంటుంది. ఈ మూవీ పెద్ద విజయం సాధించాలి' అని అన్నారు.
'ఇది నా మూడో సినిమా. మా అన్నయ్య ప్రొడక్షన్‌లో వర్క్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ కథ చాలా బావుంటుంది. అందరినీ అలరిస్తుంది' అని హీరో షమ్ము చెప్పారు. నిర్మాత, సంగీత దర్శకుడు ర్యాప్ రాక్ షకీల్ మాట్లాడుతూ, 'డైరెక్టర్ మధు చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. మా తమ్ముడు హీరోగా నేనే నిర్మించాలని అనుకున్నాను. చాలా మంచి కంటెంట్. అందరినీ ఎంటర్ టైన్ చేస్తుంది' అని తెలిపారు.

క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



రామ్ భీమన, హాసిని సుధీర్, రమేష్ తేజావత్

రాజ్ తరుణ్ హీరోగా నటించిన కొత్త సినిమా 'పురుషోత్తముడు'. ఈ చిత్రాన్ని శ్రీ శ్రీదేవి ప్రొడక్షన్స్ బ్యానర్ పై డా.రమేష్ తేజావత్, ప్రకాష్ తేజావత్ నిర్మించారు. ఈ చిత్రంతో హాసిని సుధీర్ హీరోయిన్‌గా పరిచయమయ్యారు. రామ్ భీమన దర్శకుడు. ఈ సినిమా శుక్రవారం గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వచ్చి, అన్ని చోట్ల నుంచి సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ప్రశంసల్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో మేకర్స్ సక్సెస్‌మీట్‌ని ఏర్పాటు చేశారు.
దర్శకుడు రామ్ భీమన మాట్లాడుతూ, 'మా సినిమాకు వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. మీడియా నుంచి కూడా చాలా మంచి రివ్యూస్ వచ్చాయి. రాజ్ తరుణ్ ఫోన్‌లో తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. డా.రమేష్ తేజావత్, ప్రకాష్ తేజావత్ వంటి అభిరుచి గల ప్రొడ్యూసర్స్ ఉండటం వల్లే ఇలాంటి మూవీ చేయగలిగాం' అని అన్నారు.
'మా సినిమా గ్రాండ్‌గా వరల్డ్ వైడ్ రిలీజైంది. అన్ని చోట్ల నుంచి సూపర్ హిట్ టాక్ వస్తోంది. ఒక మంచి క్లీన్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ సినిమా చేశారనే ప్రశంసలు ప్రేక్షకుల నుంచి వస్తున్నాయి. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలకు ఈ సినిమా చూపించాలి' అని నిర్మాత డా.రమేష్ తేజావత్ చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At Navatelangana Printers Private Limited, Laxmidas Bhavan, Phase-2, Plot No. 8&9, Surana X Road, Near Mint Compound, Ida, Charlapally, Medchal-Malkajgiri District-500051, Published At Navatelangana Printers Private Limited, Laxmidas Bhavan, Phase-2, Plot.8&9, Surana X Road, Near Mint Compound, Ida, Charlapally, Medchal-Malkajgiri District-500051, Telangana State, Editor : R.Sudha Bhaskar. TELTEL/2015/60815